తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

శనివారం 21.06.2025 | సంపుటి :11 సంచిక : 333 | పేజీలు :12 వెల : రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి

98483 28698








## 45 రోజుల తర్వాతే ఎన్నికల వీడియోలు తొలగించండి

రాష్ట్రాలకు ఎలక్షన్ కమిషన్ సూచన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఎన్నికల సరళికి సంబంధించిన వీడియోలను దుర్వినియోగం చేసి తప్పుడు కథనాలు సృష్టించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ఫలితంపై 45 రోజుల్లోగా ఎలాంటి ఫిర్యాదులు రాకపోతే ఆ ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ కెమెరా రికార్డింగ్‌లు, వెబ్‌కాస్టింగ్, వీడియో ఫుటేజ్‌లను తొలగించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులకు సూచించింది. దీనికి సంబం ధించి రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులకు మే మిగతా 2లో..



## పాక్‌పై దాడులు ఆపాలని భారత్‌ను మేమే కోరాం

అంగీకరించిన పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్

**ఇస్లామబాద్(జనంసాక్షి):** పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత్.. పాకిస్థాన్‌లోని అనేక ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణి దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. అనంతరం ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందాన్ని తానే కుదిర్చానని చెప్పుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రధాని మోదీ ఇచ్చిన స్పష్టతతో మాట మార్చుకున్నారు. భారత్‌-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గురించి తాజాగా పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్ ఓ మిగతా 2లో..




## సీఎం రేవంత్ పిటిషన్‌పై ముగిసిన విచారణ

తీర్పు వాయిదా వేసిన హైకోర్టు

కేటీఆర్, జగదీశ్ రెడ్డి పిటిషన్లపైనా విచారణ వాయిదా

**హైదరాబాద్(జనంసాక్షి):** గచ్చిబౌలిలో 2016లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును కొట్టివేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది. గోపన్‌పల్లిలో సర్వే నం.127లోని 31 ఎకరాలకు సంబంధించి హక్కుల వివాదంలో ఎస్సీ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి, రేవంత్‌రెడ్డి సోదరుడు ఎ.కొండల్‌రెడ్డి, ఎ.లక్ష్మయ్యల మధ్య వివాదం కొనసాగుతోంది. అప్పట్లో ఎంపీగా మిగతా 2లో..

# చర్చించుకుందాం రా..



## బాబుతో చర్చలకు సిద్ధమన్న ముఖ్యమంత్రి రేవంత్

- ప్రాజెక్టుల వారీగా సమస్యలపై చర్చిద్దాం
- రాష్ట్రాల మధ్య జలవివాదాలకు సమాలోచనలే పరిష్కారం
- విభజనచట్టం ప్రకారం ప్రాజెక్టుల్లో మార్పులు చేస్తే చెప్పుకోవాలి
- కేంద్రానికి ఏపీ పీఎఫ్‌ఆర్ ఇవ్వడం వల్లే వివాదం మొదలైంది
- అంతకుముందే తెలంగాణతో చర్చించి ఉంటే బాగుండేది
- 23న కేబినెట్ సమావేశంలో బనకచర్లపై చర్చిస్తామని వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):** బనకచర్ల అంశం గురించి కూర్చొని మాట్లాడుకుంటే వివాదం ఉండదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బనకచర్ల-గోదావరి ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబుతో చర్చలకు సిద్ధమని ప్రకటించారు. "ఏపీ.. కేంద్రానికి పీఎఫ్‌ఆర్ ఇవ్వడం వల్లే వివాదం మొదలైంది. పీఎఫ్‌ఆర్ ఇచ్చేముందే తెలంగాణతో చర్చించి ఉంటే వివాదం ఉండేదికాదు. ఆంధ్రప్రదేశ్ ప్రీ ఫీజిబులిటి రిపోర్ట్ (పీఎఫ్‌ఆర్) ఇచ్చిన వెంటనే కేంద్రం స్పందిస్తోంది. బనకచర్లపై కేంద్రం అన్ని రకాల చర్యలకు సిద్ధమైంది. ఇద్దరు సీఎంలు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై చర్చిద్దాం. ఒక రోజు కాదు నాలుగు రోజులైనా చర్చిద్దాం. రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయి. మిగతా 2లో..

### బనకచర్లను అడ్డుకుంటాం

అందుకోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం : ఎంపీ చామల

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్ర ప్రజలను భారాస నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మిగతా 2లో..

## అభివృద్ధికి కొత్త నిర్వచనం తెలంగాణ

ప్రపంచదేశాల పెట్టుబడులకు సరైన వేదిక హైదరాబాద్

సామాజిక న్యాయం పునాదిపై ఆర్థిక అభివృద్ధి.. కాంగ్రెస్ సిద్ధాంతం

అసోచామ్ సదరన్ కౌన్సిల్ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్(జనంసాక్షి):** ఆర్థిక అభివృద్ధి తో పాటు మానవీయ కోణాన్ని జోడిస్తూ తెలంగాణ రాష్ట్రం లోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి ఓ కొత్త నిర్వచనాన్ని రచిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాదులో అసోచామ్ సదరన్ సీఎస్‌ఆర్, సస్టేబిలిటీ కౌన్సిల్ సదస్సు, అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక, పర్యావరణ బాధ్యత లతో కూడిన తెలంగాణను నిర్మించేందుకు యావత్ క్యాబినెట్ కట్టుబడి పని చేస్తుంది అన్నారు. మనం ఇప్పుడు అపార వనరులు ఉన్నా కానీ అసమానతలు ఉన్న ప్రపంచంలో జీవిస్తున్నాం అన్నారు. ' ' ట్రికిల్ డౌన్' ఆర్థిక వ్యవస్థలు పనిచేయలేవని స్పష్టం అయ్యింది, ఇప్పుడు కేవలం ' లిఫ్ట్ ఆల్' అందరినీ అభివృద్ధి చేయాలన్నది అని



వార్యం అన్నారు. ఆర్థిక వృద్ధి సామాజిక న్యాయం పునాదిపై నిలవాలని కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం, తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఆసిద్ధాంతానికి కట్టుబడి పని చేస్తుంది అన్నారు. పారిశ్రామికవేత్తల చర్యలు దానం కోసం కాకుండా బాధ్యత కోసం కావాలి, మీ పని ప్రశంసల కోసం కాదు మిగతా 2లో..



విప్లవ యోధుడు గాజర్ల రవికి కన్నీటి వీడ్కోలు

## ఎరుపెక్కిన వెలిశాల

**భూపాలపల్లి(జనంసాక్షి):** ఆంధ్రా -ఒడిశా సరిహద్దుల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన ఎన్ కౌంటర్ లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమి టీ సభ్యులు గాజర్ల రవి అలియాస్ గణేష్ కు అభి మానులు, ప్రజాసంఘాలు, బంధు మిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు. విప్లవ సూర్యుడు రవన్నకకు అం తిమ వీడ్కోలు పలికేందుకు తెలం గాణ సహా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజా సంఘా ల నాయకులు, ప్రముఖులు రవన్న స్వగ్రామానికి భారీగా చేరుకోవ డంతో.. వెలిశాల గ్రామం మిగతా 2లో..

### మారేడు ఎన్‌కౌంటర్ బూటకం

న్యాయ విచారణ జరపండి:హరగోపాల్ డిమాండ్

**హైదరాబాద్(జనంసాక్షి):** ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి జిల్లా మారేడుమిల్లిలో జరిగింది బూటకపు ఎన్‌కౌంటర్ అని దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం నేతలు మిగతా 2లో..

## కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక వచ్చాక స్పందిస్తా..

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్(జనంసాక్షి):** కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరామని, డీసీసీ పరిశీలకుడి నుంచి నివేదిక వచ్చాక స్పందిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆయనకు సంబంధం లేని పంచాయతీ ఎన్నికలపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడటం సరికాదని ఆయనకు సూచించినట్టు తెలిపారు. న్యాయస్థానంలో ఉన్న అంశంపై పొంగులేటి మాట్లాడటంపై తాను అభ్యంతరం వ్యక్తం చేసినట్టు వివరించారు. పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరిచేందుకు మాట్లాడిన మాటలే తప్ప వేరే ఉద్దేశం కాదని పొంగులేటి చెప్పినట్లు వివరించారు. న్యాయస్థానం తీర్పు తర్వాతనే పంచాయతీ ఎన్నికలు ఉంటాయని పీసీసీ అధ్యక్షుడు స్పష్టం చేశారు. మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా తమ పరిధిలో లేని అంశాలను మాట్లాడవద్దని సూచించారు. ఇతరుల శాఖల్లో ఎవరూ జోక్యం చేసుకోవద్దని స్పష్టం మిగతా 2లో..



## జగన్నాథుడి కోసం ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా

- ఒడిశాలో నవశకం ప్రారంభమైంది: ప్రధాని మోడీ
- ఏడాది పాలనలో ఎంతో మార్పు కనిపిస్తోంది
- రూ.18,600 కోట్ల విలువైన 105 ప్రాజెక్టులు ప్రారంభం

**భువనేశ్వర్(జనంసాక్షి):** ఒడిశాలో మొదటిసారిగా ఏర్పడ్డ బీజేపీ ప్రభుత్వం సుపరిపాలన, ప్రజా సేవలతో విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసిందని.. ఇది ఎంతో ప్రత్యేకమైన రోజని ప్రధాని మోడీ అన్నారు. ఈ వార్షికోత్సవం కేవలం ప్రభుత్వ వార్షికోత్సవం మాత్రమే కాదని.. ఇది సుపరిపాలన స్థాపన వార్షికోత్స వమని అభివర్ణించారు. ఏడాదిలో ప్రజలకు సుపరి పాలన అందించిన ముఖ్యమంత్రి మోహన్ మాఝి, ఆయన మొత్తం బృందాన్ని అభినందిస్తున్నానని అన్నారు. కాగా, 2024 జూన్ లో జరిగిన ఒడిషా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీని మట్టికరిపించి.. ఒడిషా రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా అక్కడ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రాష్ట్రాల్లో సామాజిక ఆర్థిక అభివృద్ధి విషయంలో నవశకం ప్రారంభమైందని ప్రధా ని నరేంద్ర మోదీ అన్నారు. బిహార్ నుంచి ఒడిశా పర్య టనకు వెళ్లిన ఆయన.. రూ.18,600 కోట్ల విలువైన 105 ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాని మాట్లాడారు. సుపరిపాలన, ప్రజాసేవలో ఒడిశాలోని మిగతా 2లో..

### ఆటవిక రాజ్యం నుంచి బీహార్‌ను బయటపడేశాం

- మళ్లీ ఆ సంస్కృతి రాకుండా ప్రజలే అడ్డుకోవాలి
- బలమైన అభివృద్ధి దిశగా రాష్ట్రం పయనం
- 55వేల కి.మీ మేర గ్రామీణ రోడ్లు వేశాం: మోదీ

వార్త 2లో

## కాళేశ్వరం వట్టిపోయింది

ఆ బ్యారేజీల మరమ్మతులకు పెట్టే ఖర్చుతో మరో 14 ప్రాజెక్టులు పూర్తి చేయొచ్చు : ఎమ్మెల్యే కూనంనేని

**హైదరాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టుపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు తీసేసి.. వాటిలోని పైపులను వాడుకోవాలని సూచించారు. ఆ మూడు బ్యారేజీల మరమ్మతులకు రూ.20వేల కోట్లు ఖర్చు అవుతోందని, అంత ఖర్చు మిగతా 2లో..





## ఆంగ్ల భాష వారధిలాంటిది

ఆ భాష సిగ్గుచేటు కాదు.. విద్యార్థుల అభివృద్ధికి ఊతం

వద్దనడం పేదలను చులకన చేయడమే

వారిని ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర

అమిత్ షా వ్యాఖ్యలపై రాహుల్ కౌంటర్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఇంగ్లీష్ మాట్లాడే వాళ్లు త్వరలోనే సిగ్గుపడాల్సి వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ శుక్రవారంనాడు తప్పుపట్టారు. దేశంలోని పేద పిల్లలను ఉన్నత విద్యకు దూరం చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తున్నాయని అన్నారు. 'ఇంగ్లీష్ అనేది డ్యామ్ కాదు, ఒక బ్రిడ్జి. ఇంగ్లీష్ అంటే సిగ్గు కాదు, పవర్. ఇంగ్లీషు అనేది ఒక చైన్ కాదు, చైన్‌లను బ్రేక్ చేసే పరికరం. ఇండియాలోని పేద పిల్లలు ఇంగ్లీష్ చదువుకోవడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఇష్టం లేదు. వాళ్లను ప్రశ్నించేవారు ఉండకూడదని వారు కోరుకుంటున్నారు. తమతో సమానంగా ఎదగడం కూడా వారికి ఇష్టం లేదని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రతిరోజూ ఇంగ్లీష్ మాట్లాడవద్దని, హిందీలో మాట్లాడమని చెబుతుం టారని, అయితే ఆర్ఎస్ఎస్, బీజేపీలోని పిల్లల మాత్రం ఇంగ్లీషు విద్యకు వెళ్తుంటారని, దీని వెనుక కారణమేమిటని రాహుల్ ప్రశ్నించారు. ఎందుకంటే పేద పిల్లలు బోర్డ్ రూముల్లోకి ఎంటర్ కారాదని, అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు రాకూడదని వారు కోరుకుంటున్నారని అన్నారు. వాళ్లు ఇంగ్లీషు స్కూళ్లకు వెళ్లి కాంటాక్టులు పెంచుకుంటారని, పేద పిల్లలకు మాత్రం తలుపులు మూసేస్తారని ఆక్షేపణ తెలిపారు. సాధికారతకు మాతృభాషతో పాటు ఇంగ్లష్ చాలా అవసరమని, ఇంగ్లీష్ విద్య విద్యార్థులకు ఆత్మవిశ్వా సాన్ని, ఉపాధిని కల్పిస్తుందని రాహుల్ అన్నారు. దేశంలోని ప్రతి భాష ఆత్మవంటిదని, సంస్కృతి, నాలెడ్జికి ప్రతీక అని అన్నారు. భాషాభివృద్ధి జరగాలని, అదే సమయంలో ప్రతి ఒక్క పిల్లవాడికి ఇంగ్లీష్ బోధించాలని అన్నారు. అప్పుడే ప్రపంచంతో భారత్ పోటీ పడగలుగుతుందని, ప్రతి ఒక్క పిల్లవాడు సమానావకాశాలు పొందగలడని రాహుల్ స్పష్టం చేశారు. తన ఎక్స్ అకౌంట్‌లో హిందీ భాషలో రాహుల్ గాంధీ ఈ పోస్టు చేశారు. ప్రతి భారతీయ భాషకు ఆత్మ, సంస్కృతి, జ్ఞానం ఉన్నాయని, వాటిని ఆదరించాలని, అదే సమయంలో మిగతా 9లో..

కాళేశ్వరం వ్యవహారం..

### నీటిపారుదలశాఖ ఈఎన్సీ జనరల్‌పై బదిలీ వేటు

ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని అనిల్‌కుమార్‌కు ఆదేశం

**హైదరాబాద్(జనంసాక్షి):** నీటిపారుదలశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ జనరల్ జి.అనిల్ కుమార్‌పై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆయనకు అధికారులు ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. మేడిగడ్డ ఆనకట్ట గ్రౌటింగ్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం అనిల్ కుమార్‌పై బదిలీ వేటు వేసినట్లు తెలుస్తోంది. గ్రౌటింగ్ చేయడంతో బ్యారేజీకి సంబంధించిన అన్ని పరీక్షలు చేయడానికి ఆస్కారం లేకుండా పోయిందని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ తుది నివేదికలో పేర్కొంది. ఎవరి ఆదేశాల మిగతా 2లో..



## అమెరికాతో 'అణు' చర్చలుండవు

ట్రంప్‌తో సంప్రదింపుల ప్రసక్తే లేదు : ఇరాన్

**టెహ్రాన్(జనంసాక్షి):** తమపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో అమెరికాతో ఎలాంటి అణు ఒప్పంద చర్చలు జరిపేది లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. అణు ఒప్పందంపై ఇరాన్ చర్చలకు రాని పక్షంలో రెండు వారాల్లోగా దాడులపై నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాఘ్చి స్పందిస్తూ.. 'అణు ఒప్పందానికి సంబంధించి అమెరికా చర్చలకు రావాలని పేర్కొంది. అయితే, మేం వాటిని తిరస్కరిస్తున్నాం' అని పేర్కొన్నారు. ట్రంప్ చేస్తున్న ఇజ్రాయెల్ అనుకూల వ్యాఖ్యలు చూస్తే.. దాడుల్లో అమెరికా ప్రమేయం ఉందనే విషయం స్పష్టమవుతోందన్నారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించాలని ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పలువురు నేతలు పిలుపునిచ్చారన్నారు. తాము ఆత్మరక్షణ కోసం పోరాడుతున్నామని, ఇది ఆగదని అరాఘ్చి అన్నారు. ఇరాన్‌తో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని మిగతా 9లో..



### అమెరికా ఆదేశాల కోసం వేచిచూడలేం

- ఇరాన్‌లో అణుకేంద్రాలన్నింటినీ ధ్వంసం చేస్తాం
- ఆ సామర్థ్యం మాకుంది: నెతన్యాహు
- యుద్ధంలో ట్రంప్ చేరాలనేది పూర్తిగా ఆయన నిర్ణయమే..

2లో

### భారత్ కోసం ప్రత్యేకంగా గగనతలం తెరిచిన ఇరాన్



ఇరాన్ నుంచి భారతీయ విద్యార్థులు వెనక్కి

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21.06.2025

# చర్చించుకుందాం రా..

న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం. వివాదాల పరిష్కారంలో నాకెలాంటి బేషజాలు లేవు. ఇద్దరు వ్యక్తులు కాదు.. రాష్ట్రాల మధ్య వ్యవహారం ఇది. విభజనచట్టం ప్రకారం ప్రాజెక్టుల్లో మార్పులు చేస్తే చెప్పుకోవాలి. విభజన చట్టం ప్రకారం గతంలో సీఎంల స్థాయిలో చర్చలు జరిపాం. అనేక అంశాలను సీఎం స్థాయిలో చర్చించాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు."తెలుగువారి మధ్య అనవసరమైన సమస్యలు ఉండొద్దు. పైన, కింద ఉన్న రాష్ట్రాలతో వివాదం కోరుకోవట్లేదు. కింది రాష్ట్రంగా ఏపీకి హక్కులు ఉన్నాయంటున్నారు. అదే రకమైన హక్కులు తెలంగాణకు కూడా ఉంటాయి. ఈనెల 23న రాష్ట్ర కేబినెట్ సమావేశం ఉంది. కేబినెట్‌లో బనకచర్లపై చర్చిస్తాం. ఒక అడుగు ముందుకేసి మేమే ఏపీని చర్చలకు పిలుస్తాం. మోదీ సీట్లో కూర్చోవాలంటే చంద్రబాబు సపోర్టు కావాలి. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాలంటే గోదావరి నీటిని తరలించాలి. విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉంది. బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు.బనకచర్లపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే. 2016, 2018లో ఏపీ సర్కారు రెండు జీవోలు ఇచ్చింది. ఏపీ జీవోల ఆధారంగా వ్యాప్కోస్ 150 పేజీల నివేదిక ఇచ్చింది. గోదావరి-పెన్నా అనుసంధానంలో బనకచర్ల ఒక భాగం. 86 రోజుల్లో 400 టీఎంసీలు తరలించేలా బనకచర్ల డిజైన్ చేశారు. గోదావరిలో 968 టీఎంసీలు వాడే వెసులుబాటు తెలంగాణకు ఉంది. కేటాయించింది వాడుకునేందుకు అవకాశం ఇవ్వట్లేదు. కేటాయింపులు వాడుకునే అవకాశం ఇవ్వకపోవడంతోనే వివాదం. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడం మంచిది. ఈ వివాదం పరిష్కారానికి ఎలాంటి డెడ్‌లైన్ లేదు" అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## కాళేశ్వరం వట్టిపోయింది

పెట్టినా వరద ఉద్ధృతి వల్ల బ్యారేజీలు కొట్టుకుపోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారని అన్నారు. ఆ మూడు ప్రాజెక్టులకు పెట్టే ఖర్చుకు బదులు ప్రాణహిత పూర్తి చేస్తే సరిపోతుందని అభిప్రాయపడ్డారు."3 ప్రాజెక్టులు తీసేయడం వల్ల కేవలం రూ.10వేల కోట్ల నష్టం వస్తుంది. వీటికి మరమ్మతులు చేసే బదులు శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులో గోదావరిపై 14 చిన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలి. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వృథా అని నేను చెప్పలేదు. కేవలం ఆ మూడు బ్యారేజీలపై మాత్రమే మా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాం. తెలంగాణను సంప్రదించకుండా ఏపీ సీఎం చంద్రబాబు ప్రాజెక్టులు చెపడుతున్నారు. బనకచర్ల ప్రాజెక్టును ఆపేయాలి.పరివాహక ప్రాంతాల వారీగా నిబంధనల మేరకు నీటి వాటాలు జరగాలి. ఇద్దరు సీఎంలు కూర్చొని బనకచర్ల ప్రాజెక్టుపై మాట్లాడుకోవాలి. నీటి ప్రాజెక్టులపై రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు. పోలవరం ప్రాజెక్టు కడుతున్న ఏపీకి కొత్త ప్రాజెక్టులు ఎందుకు? తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి"అని ఎమ్మెల్యే కూనంనేని కోరారు.

## 45 రోజుల తర్వాతే ఎన్నికల వీడియోలు తొలగించండి

30న లేఖలు పంపగా.. ఆ విషయం తాజాగా బయటికొచ్చింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పలు దశల్లో చేపట్టే ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సీసీటీవీ రికార్డింగ్, వెబ్‌కాస్టింగ్ విధానాలపై ఈసీ ఆ లేఖలో సూచనలు జారీ చేసింది. సాధారణంగా ఎన్నికలకు సంబంధించిన చట్టాల ప్రకారం.. ఈ రికార్డింగ్‌లు తప్పనిసరి కానప్పటికీ పారదర్శకత కోసం ఈసీ వీటిని ఓ సాధనంగా వినియోగిస్తోంది. అయితే, ఇటీవల ఈ రికార్డులను దుర్వినియోగం చేసి కొందరు సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, కథనాలను వ్యాప్తి చేస్తున్నట్లు ఎన్నికల సంఘం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులకు ఈసీ పలు సూచనలు చేసింది. "ఎన్నికల ఫలితాన్ని సవాల్ చేస్తూ ఏ వ్యక్తి అయినా 45 రోజుల్లోపు సంబంధిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసే వీలుంది. అందువల్ల పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ, వెబ్‌కాస్టింగ్, ఫొటోగ్రఫీ డేటాను ఫలితాలు వెలువడిన 45 రోజుల వరకు భద్రపర్చాలి. ఆలోగా సంబంధిత నియోజకవర్గంలో ఓటర్ల తీర్పును సవాల్ చేస్తూ ఎలాంటి పిటిషన్ దాఖలు కాకపోతే ఆ రికార్డింగ్‌లను ధ్వంసం చేయొచ్చు" అని ఈసీ అందులో స్పష్టం చేసింది.ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన రికార్డింగ్‌లను దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు గతేడాది డిసెంబరులో కేంద్ర చట్టంలో సవరణలు చేసింది. సీసీ కెమెరా, వెబ్‌కాస్టింగ్ ఫుటేజీ, అభ్యర్థుల వీడియో రికార్డింగ్‌లను బహిరంగంగా తనిఖీ చేయకుండా ఆంక్షలు తీసుకొచ్చింది.

## పాక్ దాడులు ఆపాలని భారత్‌ను మేమే అడిగాం

ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో తమపై దాడులు ఆపాలని భారత్‌ను కోరిన మాట వాస్తవమేనని అంగీకరించారు. ఆ సమయంలో భారత్ తమ ముఖ్య వైమానిక స్థావరాలైన నూర్‌ఖాన్, షోర్కోట్‌లపై దాడి చేసిందని ఇషాక్ దార్ వెల్లడించారు. ఈ దాడుల వల్ల తమ దేశానికి భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉండడంతో ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని అమెరికాను కోరినట్లు తెలిపారు. సౌదీ యువరాజు ఫైజల్ ఫోన్‌కాల్ ద్వారా భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్‌తో సంప్రదింపులు చేశామని వివరణ ఇచ్చారు. "ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ మే 7న పాక్‌లోని పలు స్థావరాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణి దాడులు చేసింది. అనంతరం ఇరుదేశాల మధ్య జరిగిన దాడుల్లో భారత సైన్యం నూర్ ఖాన్ వైమానిక స్థావరం, షోర్కోట్ వైమానిక స్థావరంపై దాడి చేసినట్లు గుర్తించాము. సౌదీ యువరాజు ఫైసల్ నాకు ఫోన్ చేశాడు. కాల్పుల విరమణ గురించి భారత్‌తో మాట్లాడాలా అని ఫైసల్ అడగగా.. సహాయం చేయమని ఆయనను కోరాను. మరోవైపు ఈ విషయంపై అమెరికాతోనూ చర్చలు జరిపాము.. . .

## బనకచర్లను అడ్డుకుంటాం

కాళేశ్వరం అక్రమాలపై ప్రజలు అవగాహన పెంచుకుంటున్నారన్నారు. ఇంటర్‌నెట్‌లో వెతికి మరీ తెలుసుకుంటున్నారని చెప్పారు. "రాయలసీమ ఎత్తిపోతల, పోతిరెడ్డిపాడు పనులు జరుగుతున్నప్పుడు భారాస ప్రభుత్వం అభ్యంతరం చెప్పలేదు. బనకచర్లను అడ్డుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. అవసరమైతే సుప్రీంకోర్టుకు కూడా వెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. కేంద్రం మన ఆలోచనలను పరిగణనలోకి తీసుకోకపోతే సర్వోన్నత న్యాయస్థానానికి వెళ్తామని ఆయన స్పష్టంగా చెప్పారు. తెలంగాణ సెంటిమెంట్ రేకెత్తించి తప్పుదోవ పట్టించేందుకు భారాస నేతలు ప్రయత్నిస్తున్నారు. బనకచర్ల అంశంపై తప్పనిసరిగా అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తాం. ఏకగ్రీవ తీర్మానం చేస్తామంటేనే భారాస ఎంపీ ఇటీవల సమావేశం నుంచి వాకౌట్ చేశారు" అని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

## సీఎం రేవంత్ పిటిషన్‌పై ముగిసిన విచారణ

ఉన్న రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతో సొసైటీకి చెందిన స్థలంలోకి అక్రమంగా చొరబడ్డారని, అడ్డుకున్న తనపై కులం పేరుతో దూషించారంటూ సొసైటీ తరఫున ఎన్.పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. దీన్ని కొట్టివేయాలని కోరుతూ రేవంత్‌రెడ్డి 2020లో పిటిషన్ దాఖలు చేశారు.ఘటనా స్థలంలో లేకున్నా రేవంత్‌రెడ్డిపై రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ప్రభుత్వం కేసు నమోదు చేసిందని ఆయన తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. పెద్దిరాజు 2014లోనే చందానగర్‌లో రేవంత్‌పై ఫిర్యాదు చేశారని, సరైన ఆధారాలు లేకపోవడంతో కోర్టు ఆ కేసు కొట్టివేసిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు కోర్టుకు తెలిపారు. 2016లో మళ్లీ గచ్చిబౌలి పీఎస్‌లో పెద్దిరాజు ఫిర్యాదు చేశారని, 8 మంది సాక్షుల వాంగ్మూలంలోనూ రేవంత్‌రెడ్డి ఘటనా స్థలంలో లేరని చెప్పారని తెలిపారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

**కేటీఆర్, జగదీశ్ రెడ్డి పిటిషన్లపై హైకోర్టులో విచారణ వాయిదా**

మేడిపల్లి పీఎస్‌లో నమోదైన కేసును కొట్టి వేయాలని కోరుతూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్(%ఖు=%), మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఫేక్ వీడియో సృష్టించి ప్రచారం చేశారని తీన్మార్ మల్లన్న ఫిర్యాదు మేరకు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిపై మేడిపల్లి పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. పోలీసులు తప్పుడు సెక్షన్లు నమోదు చేశారని కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల తరఫు న్యాయవాది రమణారావు వాదనలు వినిపించారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. వాదనలు వినిపించేందుకు తీన్మార్ మల్లన్న తరఫు న్యాయవాది సమయం కోరడంతో తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 27కి వాయిదా వేసింద్ణి.

## కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక వచ్చాక స్పందిస్తా

చేశారు. విధానపరమైన అంశాల విషయంలో పార్టీపరంగా చర్చించి, మంత్రి మండలిలో నిర్ణయం తీసుకున్న అంశాలపై మాట్లాడితే ఎలాంటి అభ్యంతరం ఉండదని వివరించారు. అలా కాకుండా అంతర్గతంగా మాట్లాడుకున్న అంశాలను మీడియాతో మాట్లాడవద్దని మాత్రమే తాను చెప్పినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో తానే అభ్యర్థిని అని అజహరుద్దీన్ మాట్లాడటంలో తప్పు లేదన్న మహేశ్‌కుమార్‌గౌడ్.. గతంలో పోటీ చేసినందున తిరిగి తననే పోటీలో నిలుపుతారన్న భావనతో చెప్పి ఉంటారని అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలన్న కృతనిశ్చయంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు వివరించారు.




# అభివృద్ధికి కొత్త నిర్వచనం తెలంగాణ

అవకాశం ఉందని దేశవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ సంస్థలు తెలంగాణ రాష్ట్రంలో %జూ=% నిధులు ఖర్చు చేయాలని పిలుపునిచ్చారు. పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం అనువైన ప్రాంతం అన్నారు. ఇక్కడ అనుకూలమైన అందరికీ సరిపోయే వాతావరణం, భాషా సమస్య లేదు, శాంతిభద్రతలు, తక్కువ ధరకు పుష్కలంగా లభించే మానవ వనరులు, అన్నిటికీ మించి ఫ్రెండ్లీ గవర్నమెంట్ ఇక్కడ ఉందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఈ దేశంలోని రాష్ట్రాలతో కాదు అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతుంది అన్నారు. హెల్త్, ఫార్మా, ఐటీ, ఫుడ్ గ్రైన్స్ వంటి రంగాల్లో తెలంగాణ ది తిరుగులేని ప్రస్థానం అన్నారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో పేద విద్యార్థులకు విద్యను అందించాలన్న లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అని తెలిపారు. ఒక్కో పాఠశాలను 25 ఎకరాల క్యాంపస్లో, ఒక్కో పాఠశాలను 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నాం అన్నారు. మొదటి దశలో నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున 100 పాఠశాలలు మంజూరు చేసాం అన్నారు. స్కూల్స్ నిర్మించడం కాదు వాటిని నిర్వహించడమే సమస్య అని ఓ మిత్రుడు సూచించారు. ఈ నేపథ్యంలో నిర్వాణ కోసం కార్పొరేట్ కంపెనీలను సంప్రదించగా గొప్ప స్పందన కనిపించింది ఆ పాఠశాలలన్నిటిని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని కార్పొరేట్ కంపెనీలు 15 రోజుల వ్యవధిలోనే హామీ ఇవ్వడం గమనార్హం అన్నారు.గతంలో నిర్మించిన 100 ఐటిఐలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నాం, ఈ కార్యక్రమానికి ప్రసిద్ధ కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చాయని డిప్యూటీ సీఎం తెలిపారు. అంటే లాభాల్లో రెండు శాతం ప్రజాహిత కార్యక్రమాలకు కేటాయించడానికి చట్టపరమైన బాధ్యతగా చూస్తాం, కానీ నేను ఒక భిన్నమైన దృష్టి కొనాన్ని సమావేశానికి హాజరైన వారితో పంచుకోవాలని కోరుకుంటున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. సమాజాన్ని పరిగణలోకి తీసుకోని అభివృద్ధి సరైనది కాదు, ప్రయోజనం లేని లాభం శూన్యమే అన్నారు. సుస్థిరత అనేది పర్యావరణానికి మాత్రమే పరిమితం కాదు అది మానవ గౌరవాన్ని కూడా కలిగి ఉండాలన్నారు, అభివృద్ధి ఫలితాలు కేవలం కార్పొరేట్ ఆఫీసులకే పరిమితం కాకూడదు అవి ప్రభుత్వ పాఠశాలలోని బాలికలకు, ఇబ్బందుల్లో ఉన్న రైతులకు, అంతరించిపోతున్న గ్రామీణ కళాకారులకు చేరాలి అన్నారు. ఉపాధి కల్పించే పరిశ్రమలను మేము ప్రభుత్వానికి విరాళాలు ఇచ్చే సంస్థలు గా కాకుండా భాగస్వాములుగా చూస్తున్నాం అన్నారు. పల్లెల్లో యువతకు గ్రీన్ స్కిల్ స్ లో శిక్షణ, మహిళా సంఘాలకు కేవలం నిధులు మాత్రమే కాకుండా యంత్రాలు, శిక్షణ, మార్కెటింగ్ పై అవగాహన కల్పించాలని ఒకేసారి నిధులు కేటాయించడం కాదు దీర్ఘకాలిక అభివృద్ధికి మార్గదర్శకులుగా మారుద్దాం అని డిప్యూటీ సీఎం అన్నారు.మీరు పని చేసే ప్రాంతాల్లో ప్రజల జీవన అనుభవాలను తెలుసుకోవాలని, స్థానిక ప్రజా సంస్థలతో కలిసి పని చేయాలని సూచించారు. నిర్మించిన భవనాలు పాతవి అవుతాయి కానీ ప్రజల నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వం వంటి అంశాలు నిరంతరం ప్రభావాన్ని చూపుతాయి అన్నారు. ప్రతి పథకం ప్రజలు తమ కాళ్ళ మీద నిలబడేలా చేయాలి, చేతులు చాచేలా కాదు, స్వరాజ్య స్ఫూర్తితో స్వయం విశ్వాసంతో నడవాలి అని డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన,సురేష్ చుక్కపల్లి, బారుల్ ఇస్లాం, అభిషేక రంజన్, కృష్ణ ఏదుల తదితరులు పాల్గొన్నారు.

సామా జిక మార్పు కోసం అని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. మనందరి ప్రయత్నం సం స్థల నిర్మాణం కోసం మాత్రమే కాకుండా సమాజాల శ్రేయస్సు కోసం కూడా పనిచే యాలని డిప్యూటీ సీఎం ఉద్బోధించారు. కార్పొరేట్ సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు ఖర్చు చేసేందుకు తెలంగాణ రాష్ట్రం సరైన వేదిక అన్నారు. ఈ రాష్ట్రంలో మీరు అనుకున్న లక్ష్యాలను నూటికి నూరు శాతం నెరవేర్చడమే కాదు, ప్రతి పైసాను పారదర్శకంగా ఖర్చు చేసేందుకు

## మారేడు ఎన్‌కౌంటర్ బూటకం

డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి అరాచకత్వానికి పోటీ పెట్టి జూదం ఆడుతున్నదని పేద ప్రజల పక్షాన పోరాడుతున్న వారిని ఎప్పటిలాగే పోలీసులే చంపేసి ఎన్ కౌంటర్ కథలు అల్లుతున్నారని ధ్వజమెత్తారు. ఈ బూటకపు ఎన్ కౌంటర్ల పర్వాన్ని పౌర హక్కుల సంఘం తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు. నిన్న మారేడుమిల్లిలో జరిగిన ఎన్ కౌంటర్ ఘటనలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, 2004 నాటి చర్చల కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేశ్ తో పాటు ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు అరుణ, అంజు మృతి చెందిన ఘటనపై ఇవాళ ఉప్పల్ లో పౌరహక్కుల సఘం మీడియా సమావేశం నిర్వహించింది. తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జి. లక్ష్మణ్, ప్రొఫెసర్ హరగోపాల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. నారాయణరావు, ప్రొ. హరగోపాల్ తో పాటు సంఘం పలువురు నేతలు ఈ మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. ఇకపైనా ఆపరేషన్ కగార్ పేరుతో సాగుతున్నహత్యాకాండలను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ వెంటకే ప్రకటించి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. పోలిస్ క్యాంపులను ఎత్తివేసి, మిలిటరీ బలగాలను వెంటనే ఉపసంహరించాలన్నారు.

# ఎరుపెక్కిన వెలిశాల..

ఎర్ర జనసంద్రంగా మారింది. గాజర్ల రవి పార్థివ దేహానికి పూలమాల వేసి అరుణాంజలి ఘటించి శోకసముద్రంలోని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతిమ యాత్రలో విప్లవ గీతాలు, విప్లవ నినాదాలతో విప్లవాల పోరుగడ్డ వెలిశాల ఎరుపెక్కింది. విప్లవ యోధుడికి అడుగడుగునా అరుణ జోహార్లు అర్పిస్తూఈ అంతిమయాత్ర జనకడలిని తలపించింది. చివరి మజిలీ వరకు కొనసాగింది. గాజర్ల కుటుంబం నుంచి ఇప్పటికే ఆరుగురు అమరులయ్యారు. గాజర్ల కుటుంబ విప్లవోద్యమ చరిత్ర విని కన్నీరు మున్నీరుగా ప్రజానీకం విలపించారు. గాజర్లది బూటకపు ఎన్ కౌంటర్ అని ప్రజా సంఘాలు ఆరోపించాయి. సుప్రీం కోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశాయి.

**మారణ హోమం ఆపాలి**

దేశ ప్రజలకు విముక్తి కోసం ఉద్యమించిన వ్యక్తి గాజర్ల రవి అలియాస్ గణేష్ అని, చంద్రబాబు మారణ హోమం ఆపాలి అని భరత్ బచావో అధ్యక్షులు తెలంగాణ సిద్ధాంత కర్త, ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య ఘాటుగా హెచ్చరించారు. ముందుగా గాజార్ల రవి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన అనంతరం మీడియతో మాట్లాడారు. ఏపీ సీఎం చంద్రబాబు ప్రధాని మోడీ, అమిత్ షా కాళ్ళు కడుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసులకు కోసం అంబేద్కర్ రాజ్యాంగంలో 5 వ షెడ్యూల్ అమలు కోసం రవి ఉద్యమించాడన్నారు. నరహంతక చంద్రబాబు గ్రేహౌండ్స్ బలగాలను వాడి పచ్చటి అడవుల్లో రక్తపుటేరులు పారిస్తున్నాడన్నారు. ఆపరేషన్ కాగర్ తో ఇప్పటికే 600 మందిని పొట్టన పెట్టుకున్నారని అమిత్షా పై ఆగ్రహం వ్యక్తం చేశారు. షుగర్ వ్యాధితో అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న గాజర్ల రవిని పట్టుకొని 12 గంటలు చిత్రహింసలు పెట్టిఅతి దారుణంగా చంపారని ఆరోపించారు. కుటుంభ సభ్యులకు రవి అనారోగ్యంతో ఉన్నడని ఇంటలిజెన్స్ వర్గాలతో సమాచారం ఇచ్చి కావాలనే హతమార్చారన్నారు . రవి మరణంతో దేశంలో ఓ సూర్య కిరణం అస్తమించిందని, హత్యాలతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. అస్తమించిన రవి దేశానికి వెలుగునిస్తాడన్నారు. నరమేధం సృష్టిస్తున్న ఆపరేషన్ కాగర్ ను వెంటనే ఆపాలని డిమాండ్ డిమాండ్ చేశారు.

**విప్లవ గీతాలతో మార్మోగిన వెలిశాల**

విప్లవ వీరుడు గాజర్ల రవి మృతితో అంతిమ యాత్రలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, కవులు, రచయితలు, కళాకారులు పాల్గొన్నారు. పార్థివ దేవాహం వద్ద కళాకారులు పాడిన విప్లవ గీతాలతో వెలిశాల పోరుగడ్డ హోరెత్తింది. అంత్యక్రియలు మొదలైన నుండి చివరి మజిలీ వరకు ఆధ్యాంతం విప్ల జోహార్లు అర్పిస్తూ కళాకారులు గీతాలు ఆలపించారు.వారి గీతాలు అందరిని కంట తడి పెట్టించాయి.

**భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర నివాళి**

మావోయినేత గాజర్ల రవి మృతిచెందగా భూపాలపల్లి గండ్ర సత్యనారాయణ రావు రవి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ నేత గాజర్ల రవి సోదరుడు మాజీ మావోయిస్టు నేత, ప్రస్తుత పిసిసి



అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ ఏఐతు తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుని వారి కుటుంబాన్ని ఓదార్చారు.

**అంతిమ యాత్రలో పాల్గొన్న పలువురు**

గాజర్ల రవి అంతిమ యాత్రలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేషం సతీమణి పుష్ప, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, అమరుల బంధుమిత్రుల సంఘం అధ్యక్షురాలు అంజమ్మ, ఉపాధ్యక్షురాలు శాంత, రాష్ట్ర కమిటీ సంఘం శోభ, సహాయ కార్యదర్శి పౌర హక్కుల సంఘం తెలంగాణ మాదన కుమారస్వామి, ఈసీ మెంబర్ పౌర హక్కుల సంఘం శ్రీపతి రాజగోపాల్, ఉపాధ్యక్షురాలు పుల్ల సుచరిత, కన్వీనర్ బాలసాని రాజయ్య, పౌర పవర్ ఆకుల సంఘం బండి శంకర్ , భరత్ బచావో,తెలంగాణ సిద్ధాంత కర్త, ఉద్యమ కారుల నాయకులు గాదె ఇన్నయ్య, జంపన్న, సీపీఐ ఎం ఎల్ న్యూ డెమోక్రాసి నాయకులు, తెలంగాణ విద్యావంతుల వేదిక అంబటి నాగయ్య, రాదండీ దేవేందర్, కాంగ్రెస్ పార్టీ, జిల్లా, మండల నాయకులు బుర్ర కొమురయ్య, మోటపోతుల శివ శంకర్,చందర్ గౌడ్, శేఖర్ నానీ, లక్ష్మా రెడ్డి,మాజీ ప్రజా ప్రతినిధులు, ఉద్యమ కారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నీటిపారుదలశాఖ ఈఎన్సీ జనరల్‌పై బదిలీ వేటు

మేరకు గ్రౌటింగ్ చేశారని అనిల్ కుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది.సీఎం, మంత్రుల సమావేశంలోనూ చర్చ జరిగినట్లు తెలిసింది. దీంతో పాటు ఈఈ నూనె శ్రీధర్‌ను బదిలీ చేసినప్పటికీ అక్కడే కొనసాగడానికి కూడా అనిల్ కుమార్ కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈఎన్సీ జనరల్‌గా ఉన్న అనిల్ కుమార్‌ను బదిలీ చేసింది. చీఫ్ ఇంజనీర్ అంజద్ హుస్సేన్‌కు ఈఎన్సీ జనరల్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన ఇప్పటికే ఈఎన్సీ అడ్మిన్‌గా అదనపు బాధ్యతల్లో ఉన్నారు. ఇకనుంచి రెండు పోస్టుల్లో అదనపు బాధ్యతల్లో ఉండనున్నారు. ఈ మేరకు నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా మెమో జారీ చేశారు.

## జగన్నాథుడి కోసం ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా

భాజపా ప్రభుత్వం విజయవంతంగా ఒక ఏడాది పూర్తి చేసుకుందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహ్వానాన్ని తాను సున్నితంగా తిరస్కరించానని ప్రధాని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. 'జీ7 సదస్సు కోసం కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ ఫోన్ చేశారు. వాషింగ్టన్ మీదుగా వెళ్లాలని సూచించారు. విందులో పాల్గొని చర్చించుకుందామని పిలిచారు. జగన్నాథుడి పుణ్యభూమికి వెళ్లడం నాకు ముఖ్యమని చెప్పా. ఆయన ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించా'అని చెప్పారు. పూరీ జగన్నాథ ఆలయంలోని రత్న భాండాగారాన్ని తెరవాలన్న ప్రజల డిమాండ్‌ను భాజపా ప్రభుత్వం నెరవేర్చిందని మోదీ చెప్పారు. కాంగ్రెస్ పాలనలో భారత్‌లో సుపరిపాలనకు చోటు లేకపోయిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఒడిశా అవినీతి కేంద్రంగా నిలిచిందన్న ప్రధాని.. మౌలిక సదుపాయాల కల్పనలో అప్పటి ప్రభుత్వం విఫలమైందన్నారు. చాలా ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయని, క్రమంగా వాటిని అభివృద్ధి చేసేందుకు భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా రూ.18,600 కోట్ల విలువైన 105 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. 'ఒడిశా విజన్ డాక్యుమెంట్'ను ఆవిష్కరించారు. అలాగే పలు కొత్త రైళ్లను ప్రారంభించారు. ఒడిశా పర్యటన అనంతరం.. ప్రధాని విశాఖకు రానున్నారు. రాత్రి అక్కడే బస చేసి, శనివారం ఉదయం ఆర్కే బీచ్‌లో నిర్వహించబోయే యోగా కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## ఆటవిక రాజ్యం నుంచి బీహార్‌ను బయటపడేశాం

**పాట్నా(జనంసాక్షి):** బీహార్‌ను ఆటవిక రాజ్యంలోకి నెట్టిన ఘనత కాంగ్రెస్, ఆర్జేడీలదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ప్రజలే ఆటవిక పాలనకు చరమగీతం పాడారని, ఇప్పుడు ఎన్డీయే హయాంలో బీహార్ బలమైన అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. బీహార్‌లోని సివాన్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, రాష్ట్రం దశాబ్దాలుగా పేదరికంలో మగ్గడానికి, కార్మికుల వలసలకు కాంగ్రెస్, ఆర్జేడీలే కారణమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బిహార్‌లో తాజాగా మరోసారి పర్యటించిన మోదీ.. కాంగ్రెస్, ఆర్జేడీ కూటమిపై నిప్పులు చెరిగారు. బిహార్‌ను 'లైసెన్స్ రాజ్' సుదీర్ఘ కాలం పేదరికంలోనే ఉంచిందని, ఇందులో దళితులే అతిపెద్ద బాధితులుగా మారారని ఆరోపించారు. రాష్ట్రంలోని సివాన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన.. ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతుందన్నారు.ఎన్డీయే హయాంలో సాధించిన కీలక విజయాలను ప్రధాని ప్రస్తావిస్తూ, 55,000 కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేశామని, 1.5 కోట్ల ఇళ్లకు విద్యుత్ ఇచ్చామని, 26 కోట్ల మందికి పైపుల ద్వారా తాగునీటిని అందించామని చెప్పారు. బీహార్‌ను ఆటవిక రాజ్యంగా మార్చిన వారు తమ తప్పిదాలను పునరావృతం చేయాలనుకుంటున్నారని, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని హెచ్చరించారు. పేదలకు మరో మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## అమెరికా ఆదేశాల కోసం వేచిచూడలేం

**టెల్‌అవీవ్(జనంసాక్షి):**ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఈక్రమంలో ఇరాన్ అణుస్థావరాలపై దాడికి అమెరికా సిద్ధమవుతున్నట్లు వస్తున్న వార్తలు ఈ ఉద్రిక్తతలను మరింత పెంచాయి. ఈక్రమంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. న్యూక్లియర్ స్థావరాలపై దాడులు చేసేందుకు అమెరికా ఆదేశాల కోసం వేచి చూడలేమన్నారు. ఇరాన్‌లో అణుకేంద్రాలన్నింటినీ ధ్వంసం చేసే సామర్థ్యం తమ దేశానికి ఉందని నెతన్యాహు పేర్కొన్నారు. ఫోర్డ్‌లోని భూగర్భ అణుకేంద్రంతో సహా ఇరాన్ న్యూక్లియర్ స్థావరాలపై దాడి చేయనున్నట్లు తెలిపారు. అయితే, ఇందుకు అమెరికా నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేవరకు వేచి ఉండబోమని స్పష్టంచేశారు. ఇప్పటివరకు నిర్వహించిన దాడుల విషయంలో కూడా యూఎస్ ఆదేశాల కోసం వేచి చూడలేదన్నారు. ఈసందర్భంగా ఇరాన్‌లో పరిపాలనను పతనం చేసే ఉద్దేశం తమకు లేదని, అది పూర్తిగా ఆ దేశ ప్రజలకు సంబంధించిన విషయమన్నారు. ఇరాన్‌పై దాడిలో యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ చేరాలనుకుంటున్నారా లేదా అనేది పూర్తిగా ఆయన నిర్ణయమేనన్నారు. తాను ఇజ్రాయెల్‌కు ఏది మంచిదో అదే చేస్తానని, అలాగే ట్రంప్ కూడా అమెరికాకు మంచి జరిగే నిర్ణయాలే తీసుకుంటారన్నారు.ఇరాన్ అణుస్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. ఈక్రమంలో అమెరికా కూడా ఇందులో చేరేందుకు సిద్ధమైనట్లు కథనాలు వెలువడ్డాయి. దీంతో పశ్చిమాసియాలోని పరిస్థితులపై సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. దీనిపై వైట్‌హౌస్ స్పందిస్తూ.. ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టే విషయంలో ట్రంప్ రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటారని తెలిపింది. ఇరాన్‌తో త్వరలో చర్చలు జరిగే అవకాశాలు ఉన్నాయా, లేవా అనే అంశాన్ని బట్టి ట్రంప్ నిర్ణయం ఉంటుందని పేర్కొంది.

ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రం చేస్తాం

ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు శుక్రవారం మాట్లాడుతూ.. ఇరాన్‌లోని న్యూక్లియర్ స్థావరాలపై దాడులు చేసేందుకు అమెరికా ఆదేశాల కోసం వేచి చూడలేమన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ ఐడీఎఫ్ సిబ్బందికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇరాన్ పాలనను అస్థిర పరచడానికి దాడులను మరింత తీవ్రం చేయాలని సూచించారు. ఇరాన్ ప్రభుత్వ కేంద్రాలు, సంస్థలు, మౌలిక సదుపాయాలు, ఆస్తులను లక్ష్యంగా చేసుకోవాలన్నారు. టెహ్రాన్‌లోని శక్తిమంతమైన బాసిజ్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ వంటి కేంద్రాలను ధ్వంసం చేయాలని సూచించారు. ప్రస్తుతం చేపడుతున్న ఆపరేషన్ లక్ష్యాలతో సహా.. ఇరాన్ ఆయుధ కార్యక్రమంతో సంబంధమున్న అన్ని అణు కేంద్రాలు, శాస్త్రవేత్తలపై దాడులు కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలను టెహ్రాన్ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు.

## భారత్ కోసం ప్రత్యేకంగా గగనతలం తెరిచిన ఇరాన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ఉద్ధృతమవుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇండియాకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులు తిరిగి స్వదేశానికి వెళ్లేందుకు వీలుగా ఇప్పటికే మూసివేసిన ఎయిర్‌స్పేస్‌ను ఆ దేశం తెరిచింది. దీంతో ఇరాన్ నగరాల్లో చిక్కుకుపోయిన సుమారు 1,000 మంది భారతీయ విద్యార్థులను 'ఆపరేషన్ సింధు' కింద ప్రత్యేక విమానాల్లో న్యూఢిల్లీకి తీసుకువస్తున్నారు. రాబోయే రెండ్రోజుల్లో వీరంతా ఢిల్లీకి చేరుకుంటారు. కాగా, ఇరాన్‌లో ఉంటున్న భారతీయ విద్యార్థులతో వస్తున్న తొలివిమానం శుక్రవారం రాత్రి 11 గంటలకు న్యూఢిల్లీ చేరే అవకాశం ఉంది. రెండో విమానం శనివారం ఉదయం, మూడో విమానం అదేరోజు సాయంత్రం ఇండియాకు చేరుకుంటాయి. ఇ్రాయెల్-ఇరాన్ మధ్య క్షిపణి, డ్రోన్ దాడులు కొనసాగుతుండటంతో దాదాపు అన్ని అంతర్జాతీయ విమానాలకు ఎయిర్‌స్పేస్‌ను ఇరాన్ మూసివేసింది. అయితే ఇండియా కోసం ప్రత్యేకమైన క్యారిడార్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి తరలించేందుకు ఇరాన్ ప్రభుత్వం అంగీకరించింది. ఇరాన్‌లో 4,000 మందికి పైగా భారతీయులు నివసిస్తుండగా, వీరిలో సగం మంది విద్యార్థులు ఉన్నారు. 'ఆపరేషన్ సింధు' కింద భారత ప్రభుత్వం 110 మంది భారతీయ విద్యార్థులను ఇప్పటికే న్యూఢిల్లీకి తీసుకువచ్చింది.

# భద్రకాళి అమ్మవారి బోనాలు తాత్కాలికంగా వాయిదా

**రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటన**

**రాజకీయ విభేదాలను అమ్మవారికి ముడిపెట్టి ఇబ్బందులు సృష్టిస్తారనే నిర్ణయం**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రతిష్టాత్మకంగా వరంగల్ భద్రకాళి అమ్మవారికి బోనాలు నిర్వహించేందుకు గతంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. అయితే, ఇటీవల భద్రకాళి బోనాలకి సంబంధించి కొంతమంది నుంచి అభ్యంతరాలు వెలువడిన నేపథ్యంలో, పలు మాధ్యమాల్లో ఈ విషయంపై తప్పుడు వార్తలు ప్రచురితమైన దృష్ట్యా, ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని అనుకున్నట్టు స్పష్టం చేశారు. ప్రస్తుతం స్థానికంగా నెలకొన్న రాజకీయ విభేదాలను... పవిత్రమైన అమ్మవారికి ముడిపెట్టి కొంతమంది ఉద్దేశపూరితంగా ఇబ్బందులు సృష్టిస్తారమో అని... ఈ కార్యక్రమంలోకి అసాంఘిక శక్తులను ప్రేరేపించి గొడవలు సృష్టిస్తారన్న అనుమానంతో తాత్కాలికంగా బోనాలు నిర్వహణ రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, భద్రకాళి అమ్మవారి టెంపుల్ పరిధిలో శాఖాహార బోనాలే ఉంటాయని స్థానిక ఈఓ, వేదపండితులు, ప్రభుత్వం పలుమార్లు పునర్ఘాటించారని అన్నారు. ఆగమ శాస్త్రం ప్రకారమే, వేద పండితుల నిర్ణయం మేరకు భద్రకాళి టెంపుల్ లో నిర్వహించాలని అనుకున్నమాన్నారు. అయితే, కొంతమంది మాంసాహారంతో బోనాలు నిర్వహిస్తున్నట్టు చెప్పడంతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్ళాయని చెప్పారు. రాజకీయాల కోసం భక్తుల మనస్సుల్లో తప్పుడు భావాలు నింపడం సహేతుకం కాదన్నారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి సురేఖ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. 22వ తారీఖు భద్రకాళి అమ్మవారి టెంపుల్ లో నిర్వహించాలన్న బోనాలను తాత్కాలికంగా రద్దు చేయాలని భావించినట్టు వివరించారు. స్థానిక ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని... భక్తులకి ఎటువంటి ఇబ్బందులు కలగొద్దని ఈ నిర్ణయం తీసుకున్నామని, భద్రకాళి అమ్మవారి బోనాల నిర్వహణపై సంప్రదింపులు జరిపిన అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా భక్తులకు తెలియజేయదలచినది – అమ్మవారి పట్ల నిష్కల్మషమైన భక్తి, సంప్రదాయాల పరిరక్షణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. కొంతమంది ప్రచారం చేసిన సమాచారం వల్ల ఏర్పడిన అపోహలకు తావులేదన్నారు. భద్రకాళి అమ్మవారి విశిష్టతను పెంపొందించేందుకు, ప్రభుత్వం వేద పండితుల సలహా మేరకు, ప్రజాప్రతినిధుల సూచనల ఆధారంగా తగిన సమయంలో బోనాలను వైభవంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉందన్నారు.

# కరీంనగర్ వన్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స




**కరీంనగర్ బ్యూరో, జూన్ 20 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వన్ ఆసుపత్రిలో అరుదైన శాస్త్ర చికిత్స నిర్వహించినట్లు ఆస్పత్రి సిటీ సర్జన్ డాక్టర్ తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలియజేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మోహన్ రావు పేట గ్రామానికి చెందిన గాజంగి రాజశేఖర్ (46) గత రెండు సంవత్సరాలుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స కోసం అనేక ఆసుపత్రులు తిరిగాడని తెలిపారు. హైదరాబాదు లోని ఆస్పత్రులను సంప్రదించగా అక్కడ కూడా ఈ కేసును తీసుకోలేదని , అంతటి కష్టమైన కేసు ను తాము టేకప్ చేశామని తెలిపారు. తీవ్రమైన చాతినొప్పి శ్వాస తీవసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వెంటనే ఆయన కుటుంబ సభ్యులు తమ ఆసుపత్రికి తీసుకురాగా అతనికి అవసరమైన వైద్య పరీక్షలన్నీ చేశామని తెలిపారు. సుమారు 12 నుంచి 14 గంటల పాటు శ్రమించి ఓపెన్ హార్ట్ సర్జరీ తో పాటు రెండు వాల్వులను రీప్లేస్మెంట్ చేశామని తెలిపారు. ప్రస్తుతం పేషంట్ కోలుకున్నారని, చాతి నొప్పి శ్వాస ఇబ్బందులు ఏమీ లేవని తెలిపారు. ఈ ఆపరేషన్ లు ఆరోగ్యశ్రీ పథకంలోనే చేశామని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ గోవింద్ యాదవ్, డాక్టర్ ప్రత్యూష, ఇతర వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఓమాన్ నుంచి మృతదేహాన్ని
# తెప్పించాలని వినతి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా కమ్మర్పల్లి మండలం హాస కొత్తూరు కు చెందిన జుంబారత్ అన్వేష్ (27) ఓమాన్ దేశం లోని బురైమి లో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన జరిగింది. ఓమాన్ నుంచి మృతదేహాన్ని త్వరగా ఇండియాకు తెప్పించాలని మృతుని సోదరుడు హరీష్ శుక్రవారం హైదరాబాద్ ప్రజాభవన్ లోని ప్రవాసీ ప్రజావాణి లో మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే అనిల్ ఈరవత్రి, రాష్ట్ర ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ మంద భీంరెడ్డి లతో కలిసి వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన ప్రజావాణి ఇంచార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ వి. శేషాద్రి తో మాట్లాడారు. మస్కట్ లోని ఇండియన్ ఎంబసీతో సంప్రదించి మృతదేహాన్ని తెప్పించాలని కోరారు.

# మత్తడివాగును ఆధునీకరించాలి

- **ఆయకట్టు రైతుల వినతి**

**ఆదిలాబాద్, జూన్20 (జనంసాక్షి) :** జిల్లాలోని తాంసి మండలం వడ్డాడి సమీపంలో నిర్మించిన మత్తడివాగు ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాలకు సాగునీరు అందనుంది. దీనిని పూర్తిస్థాయిలోకి అందుబాటు లోకి తీసుకుని వస్తే రైతులకు మేలు జరుగనుంది. జిల్లాలోని తాంసి, ఆదిలాబాద్, జైనథ్ మండలాల రైతుల భూములకు సాగునీరు అందించేందుకు తాంసి మండలం వడ్డాడిలో 2004లో మత్తడివాగు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2008 ఆగస్టులో ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యాయి. ఈ కాలువ ద్వారా వడ్డాడి, కప్పర్ల, బండలనాగాపూర్, జామిడి, చాందా–టి. సిర్సన్న, భోరజ్, సావర్గాం, తరోడ, మల్లాపూర్ భీంసరి, జందాపూర్ గ్రామాల్లోని 8500 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా పనులు చేపట్టారు. ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. రైతులు పంటలు సాగుచేసే ప్రతి ఎకరానికి సాగునీరు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రాజెక్టుల ఆధునీకీకరణతో ఆయకట్టు భూములు సస్యశ్యామలంగా మారను న్నాయని రైతులు అంటున్నారు. రైతులు రెండు పంటలు సాగుచేసుకునే అవకాశాలుండడంతో ప్రభుత్వం ఈ కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

# అస్తవ్యస్థంగా డ్రైనేజీ వ్యవస్థ

**పట్టణాల్లో మారని పరిస్థితులు**



**వరంగల్, జూన్20 (జనంసాక్షి) :** అసంపూర్తి డ్రైనేజీలు, నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగు గుంతలు అభివృద్ధిని వెక్కిరిస్తుంటాయి. ఏటా కోట్ల నిధులు ఖర్చుచేస్తున్నా ఏ కాలనీకి మురుగు నుంచి విముక్తి దక్కడంలేదు. దశాబ్దాల కాలంగా మున్సిపల్ పట్టణాలకు డ్రైనేజీలకు వెచ్చిస్తున్న నిధులు నిష్ఫలం అవుతున్నాయి. నిధులు ఖర్చు అవుతున్నా మురుగు నీటికి పరిష్కారం లభించడం లేదు. ఇలా పెద్ద నగరాల్లో సైతం డ్రైనేజీ అవ్యవస్థను చూస్తే ఈ అనుమానాలు కలగకమానవు. దశాబ్ద కాలంలో సుమారుగా కోట్ల వరకు వ్యయం చేసి ఉంటారని అంచనా. ఏటా బల్దియాకు విడుదలయ్యే నిధుల్లో మొదటి ప్రాథమ్యంగా డ్రైనేజీలకే కేటాయిస్తుంటారు. ఇన్ని నిధులు కేటాయించినా ప్రణాళిక లేని నిర్మాణాలతో నిధులు నిష్ప్రయోజనంగా మారుతున్నాయి. కాలువల నిర్మాణం చేపట్టే సమయంలో నిర్దేశిత ప్రమాణాలు పాటించక పోవడం, నాణ్యతకు తిలోదకాలివ్వడంతో మురుగు నీటి పారుదల వ్యవస్థ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పాత కాలువల స్థానంలో కొత్తవి వేస్తున్నా పైపులు వేయకుండా మళ్లీ ఓపెన్ డ్రైనేజీ కొనసాగిస్తున్నారు. దీంతో మళ్లీ చెత్తాచెదారం నిండడం మినహా ప్రయోజనం ఉండదు. ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం, ప్రణాళిక, ప్రణాళికేతర, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక పద్దుల కింద వచ్చిన నిధులతో వీటి నిర్మాణాలు చేపట్టారు. ఈ ఒక్క ఏడాదిలోనే పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. అంతకుముందు వివిధ పథకాల్లో వచ్చిన నిధులు ఈ పనులకే వెచ్చించారు. వచ్చిన నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీలు ప్రణాళికా బద్ధంగా ఉండటంలేదు. వచ్చిన నిధులతో డ్రైనేజీలు నిర్మించామా లేదా అన్నదే ప్రధానంగా మారింది. నిధుల రాకను బట్టి ఒక్కో వీధికి ఒక్కోసారి ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న కాలువలు ప్రజలకు సౌకర్యవంతంగా ఉండటం లేదు. నిధులు బురదలో పోసినట్లవుతుంది. పట్టణానికి మురుగు సమస్య తీరడం లేదు.

# శిశు విహార్‌లో ఆయమ్మలకు 5 నెలలుగా జీతాల్లేవ్..

**సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన..!**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఆయమ్మల వేతనాలకు కూడా ఎగనామం పెడుతోంది. హైదరాబాద్ యూసుఫ్‌గూడా మధురా నగర్ లోని శిశు విహార్‌లో ఆయమ్మలుగా పనిచేస్తున్న సిబ్బందికి జనవరి నెల నుంచి జీతాలు అందడం లేదు. అనాథ పిల్లల సంరక్షణ కేంద్రమైన శిశు విహార్‌లో 130 మంది ఆయమ్మలు పని చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది ఒంటరి మహిళలు, భర్త చనిపోయిన వారు. అనాథ బాలికలకు అన్నీ తామై చూసుకునే అయమ్మల వేతనాల విషయాన్ని సదరు విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. దాంతో, తక్షణమే తమ వేతనాలు చెల్లించాలంటూ సీపీఎం పార్టీ అనుబంధ సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శిశు విహార్ వద్ద ఆయమ్మలు ఆందోళనకు దిగారు.

శిశు విహార్‌లో పని చేస్తున్న ఆయమ్మలకు చట్ట ప్రకారం ప్రతి నెల 7 వ తేదీ లోపు జీతాలు ఇవ్వాలని.. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అమలు చేస్తున్న జీ ఓ 60 ప్రకారం రూ. 15,600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నెల వేతనాన్ని 30 రోజులకు లెక్కించి ఇవ్వడంతో రోజుకు రూ. 74 నష్ట పోతున్నారని.. చట్ట ప్రకారం 26 రోజులకు వేతనాన్ని లెక్కించి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా వర్తించేలా చూడాలని.. రిటైర్మెంట్ బెనిఫిట్ కూడా సౌకర్యం కల్పించాలని ఆయమ్మలు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గత ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తినడానికి తిండి లేని పరిస్థితి నెలకొందని.. అద్దె ఇంట్లో ఉంటున్న తాము కిరాయిలు కట్టడం కోసం అప్పులు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## మంత్రి గారు.. మా సమస్యలను పరిష్కరించండి

**పంచాయతీ కార్యదర్శుల వినతి**

**నారాయణపేట (జనంసాక్షి) :** దీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని నారాయణపేట జిల్లా తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్ ) అధ్యక్షుడు అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వివిధ మండలాల గ్రామపంచాయతీ కార్యదర్శుల తో కలిసి తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి వినతి పత్రం అందజేశారు. సంవత్సర కాలంగా నిధుల లేమి వల్ల అభివృద్ధి పనులు చేపట్ట లేక పోతున్నామని, నిధుల విడుదల చేపట్టాలని, పంచాయతీ లను నాలుగు గ్రేడ్స్ గా విభజన విభజన చేయాలని, ఓపీఎస్ లను జేపీఎస్ గా కన్వర్షన్ చేయాలని కోరారు.

# ఎర్రజెండాలతో ఎరుపెక్కిన వెలిశాల

**భారీగా తరలివచ్చిన అభిమానులు, నేతలు**

**అశ్రునయనాల మధ్య గణేష్ కు కడసారి వీడ్కోలు..**

**హాజరైన పౌరహక్కుల నేతలు, బంధుమిత్రుల కమిటీ సభ్యులు..**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఎర్రజెండాలతో వెలిశాల గ్రామం ఎరుపెక్కింది. అభిమానులు, వివిధ పార్టీల నేతలు భారీగా తరలివచ్చారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వివిధ పార్టీల నాయకుల అశ్రునయనాల మధ్య గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ బిరుసు కడసారి వీడ్కోలు పలికారు. పౌరహక్కుల నేతలు, బంధుమిత్రుల కమిటీ సభ్యులు హాజరై గాజర్ల రవికి ఎర్రజెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా ఆంధ్రప్రదేశ్లోని రంపచోడవరం నుండి వెలిశాలకు గాజర్ల రవి మృతదేహాన్ని తరలిస్తున్న క్రమంలో చిట్యాల మండలం లోని చల్లగరిగలో అభిమానుల కోరిక మేర కు కొద్దిసేపు ఆపగా గ్రామస్తులు, అభిమానులు భారీగా తరలివచ్చి నివాళులర్పించారు. అదేవిధంగా చిట్యాల, టేకుమట్ల మండల కేంద్రాల్లోనూ మధ్యలోనే ఆపి స్థానికులు నివాళులర్పించారు. అనంతరం పంగిడిపల్లి గ్రామం శివారు నుండి వెలిశాలలోని స్వగృహం వరకు ఎర్ర జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నినాదాలు చేశారు. రవి ఎన్కౌంటర్ బూటకమని దీనిపై విచారణ జరిపించాలని వివిధ సంఘాల నేతలు ఆరోపించారు. గణేశ్ అమర్ హై అంటూ పలు నినాదాలు చేశారు. అనంతరం గ్రామస్తుల సందర్శనార్థం వెలిశాలలోని గాజర్ల కుటుంబ సభ్యులకు చెందిన ఓపెన్ స్థలంలో మృతదేహాన్ని ఉంచారు. ఈ క్రమంలో వివిధ పార్టీ నేతలతో పాటు బంధుమిత్రుల కమిటీ సభ్యులు పౌర హక్కుల సంఘం నేతలు హాజరై ఎర్రగుడ్డాను కప్పి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. పలు విప్లవ గీతాలు ఆలపించారు. గాజర్ల రవి కడసారి చూపు కోసం వివిధ గ్రామాల నుండి ప్రజలు అభిమానులు భారీగా తరలి రావడంతో వెలిశాలలో వాహనాల రద్దీ పెరిగి భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. చివరికి అంత్యక్రియలు ప్రారంభం చేసి డప్పు చప్పుళ్ళు, ఎర్రజెండాలు, విప్లవ గీతాల మధ్య ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులో అశ్రునయనాల మధ్య కడసారి వీడ్కోలు పలికారు. మృతుని సన్నిహితులు బంధువులు భారీగా చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామ శివారు లో దహన సంస్కారాలు ఘనంగా నిర్వహించారు.





మావోయిస్టు పార్టీ నాయకుడు గాజర్ల రవి అలియాస్ గణేష్ పార్థివ దేహానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వెలిశాల గ్రామానికి వచ్చి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అనంతరం మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ నేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్, గణేష్ సోదరుడు అయినటువంటి మాజీ మావోయిస్టు నేత, ప్రస్తుత పిసిసి అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అలియాస్ ఐతు తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుని ఆయనను ఓదార్చారు. ఎమ్మెల్సీ, మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి వెలిశాల గ్రామానికి వచ్చి గాజర్ల రవన్న పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు, వారి సోదరుడు మాజీ మావోయిస్టు నేత, ప్రస్తుత పిసిసి అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ ను కలిసి వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే రవన్న గారి అంతిమయాత్రలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు. గాజర్ల అశోక్ అన్న ను కలిసి పరామర్శించారు. మీడియాతో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ ఆపేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని ఈ మారణ హోమంను నిలిపివేయాలన్నారు.ఆయన వెంట బీసీ జేఏసీ హరి శంకర్ గౌడ్, ఓదెలు, తెలంగాణ రాష్ట్ర తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర అధ్యక్షుడు మాదం రజిని కుమార్, తీన్మార్ మల్లన్న టీం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

**- అంతిమ యాత్రలో పాల్గొన్న బిఆర్ఎస్ నేతలు..**

విప్లవ వీరుడు మావోయిస్టు పార్టీ అగ్రనేత గాజర్ల రవి అలియాస్ ఉదయ్ అంతిమయాత్రలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి గౌడ్, పాల్గొని ఉద్యమ వీరుడికి ఘనంగా నివాళి అర్పించారు. మాజీ ఎంపీటీసీ ఆది రఘు, మాజీ సర్పంచ్ నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్, సోమనపల్లి మాజీ సర్పంచ్ ఉద్ధమారి మహేష్ యాదవ్, దుబ్యాల మాజీ సర్పంచ్ బిలకంటి ఉమేందర్రావు, మమ్మద్ అబ్జల్, వెలిశాల గ్రామ అధ్యక్షుడు సంపత్, చెరుకు రాజిరెడ్డి నల్లబెల్లి సారయ్య, గువ్వాడి లక్ష్మణ్, గువ్వాడ శివ, దేవేందర్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

**- బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..**

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ వెలిశాల గ్రామానికి వచ్చి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అనంతరం మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ నేత గాజర్ల రవి అలియాస్ గణేష్ సోదరుడు అయినటువంటి మాజీ మావోయిస్టు నేత, ప్రస్తుత పిసిసి అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అలియాస్ ఐతు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుని ఓదార్చారు. వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ వెంట బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు శ్రీపతి గోపి, పెరుమాండ్ల అనిల్, శనిగరపు సుమన్, కొడారి అనిల్ తదితరులు ఉన్నారు. అలాగే తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్, ఉపాధ్యక్షుడు తడక సుధాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బుర్ర రమేష్ గౌడ్, చిట్యాల మండల అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్, జిల్లా నాయకులు ముత్యాల రాజబాబు గౌడ్, తదితరులు గాజర్ల రవి మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

# మహిళా ప్రొఫెసర్ల సమస్యలను పరిష్కరించాలి

**ప్రభుత్వానికి మహిళా మెడికల్ ప్రొఫెసర్ల వినతి**

**హైదరాబాద్, జూన్ 20 (జనంసాక్షి) :** మహిళా ప్రొఫెసర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మెడికల్ కాలేజీ మహిళా ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా పాలనలో మెడికల్ కాలేజీ మహిళా ప్రొఫెసర్ల మొర ఎవరూ ఆలకించడం లేదని వాపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు రాగానే మాండేటరీ ట్రాన్స్‌ఫర్లు అంటూ ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీల ప్రొఫెసర్లను చెట్టుకు ఒకరిని పుట్టకు ఒకరిని ట్రాన్స్‌ఫర్ చేశారని తెలిపారు. గత 4–11 సంవత్సరాలుగా మహబూబ్ నగర్, నిజామాబాద్, అదిలాబాద్, సిద్దిపేట, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, జగిత్యాల, నల్గొండ మెడికల్ కాలేజీల్లో, ఒకే చోట పని చేస్తున్న ప్రొఫెసర్లను హెల్త్ సెక్రటరీ, ఆరోగ్య శాఖ మంత్రి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమ భర్తలు మానసికంగా వేధిస్తున్నారని, ట్రాన్స్‌ఫర్లు లేని ఉద్యోగం ఏంటని అని అవహేళన చేస్తున్నారని వాపోయారు. మహిళా ప్రొఫెసర్లు ఉదయం పది గంటల నుండి రాత్రి 7:30 వరకు హెల్త్ సెక్రటరీ ఆఫీస్ ముందు నిలబడినా అపాయింట్ మెంట్ ఇవ్వలేదని పేర్కొన్నారు. మనం ప్రజా పాలనలో ఉన్నామా లేక తాలిబన్ల పాలనలో ఉన్నామా అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్య శాఖ మంత్రికి విన్నవించినా ఫలితం లేదని తెలిపారు. మిగతా చాలా శాఖల్లో బదిలీలు అవసరం లేకపోవచ్చు, కానీ మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లకు మాత్రం బదిలీలు అత్యవసరమన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటిలో నేటితో దరఖాస్తులకు నేడు చివరితేదీ

**బాసర, జూన్ 20 (జనంసాక్షి) :** బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) లో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సులో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు జూన్ 21 చివరి తేదీతో ముగియనుంది. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 18,775 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. జూలై 4న ప్రవేశ ఫలితాలు విడుదల చేయబడతాయి. జూలై 7న మొదటి విడత కౌన్సిలింగ్ ప్రారంభమవుతుంది. ఆర్జీయూకేటీ అందించే ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. విద్యార్థులకు ఉచిత నివాస విద్య, ఆధునిక ప్రయోగశాలలు, నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు వంటి అనేక వసతులు కల్పిస్తూ, ఈ విశ్వవిద్యాలయం విశిష్టతను చాటుకుంటోందని పేర్కొన్నారు.

# మనోప్రశాంతతకు దివ్య ఔషధం యోగ



(శారీరక మానసిక ఆరోగ్యానికి దివ్య ఔషధం యోగ) హైటెక్ యుగంలో ఉరుకుల పరుగుల జీవితంలో నిరంతరం కాలంతో పోటీ పడుతున్న మానవుని జీవితంలో శరీరము మనసు తీవ్ర ఒత్తిడికి గురౌతుంది. ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించే దివ్యౌషధం యోగ. యోగాను ప్రపంచ దేశాలకు భారతదేశం పరిచయం చేసింది. క్రీస్తు పూర్వం పతంజలి మహర్షి యోగ ను అభివృద్ధి చేసి ప్రపంచానికి అందించాడు. భారతదేశం నుంచి ఉద్భవించిన జైన' బౌద్ధ ' హిందూ మతంలో యోగాకు ఒక ప్రత్యేక స్థానం కల్పించారు. 20వ శతాబ్దం అనంతరం ఆరోగ్య పరిరక్షణలో యోగ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. యోగ అభ్యసించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

### ప్రపంచానికి భారత్ అందించిన అద్భుతం యోగ

ప్రపంచానికి భారత్ అందించిన అద్భుతాలలో యోగా ఒకటి. మనిషి శారీరక మానసిక ప్రశాంతత కు ఆరోగ్యానికి యోగ ఎంతగానో దోహదపడుతుంది. నేడు ప్రపంచ వ్యాప్తంగా అన్నిదేశాలు యోగాను పాటిస్తున్నాయి. ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన ఘనత భారతదేశానికి ఉంది కావున భారతదేశం ప్రపంచానికి గురువుగా గుర్తింపు పొందడం గమనార్హం.

### యోగ మన ప్రాచీన సంస్కృతి వారసత్వం.

యోగ అన్న పదం సంస్కృతంలోని యజ అనే పదం నుండి పుట్టింది యజ అనగా దేనినైనా ఏకం చేయగలమని అర్థం ఆసనం అంటే భంగిమ ఈరెంటిని యోగాసనాలు అంటారు. మనసు శరీరాన్ని ఏకం చేసి ఆద్యాత్మిక తాదాత్మ్యం అందించేది. శరీరం మనసు ఆత్మలో చేయడం మరియు జ్ఞానోదయమైన అవగాహన సాధించడం.

### యోగ చరిత్ర


యోగ వేదకాలం నుండే యోగ వుందని పురాణాలు చెబుతున్నాయి. యోగకు 2000యేళ్ల చరిత్ర వుంది. మన దేశ సాంస్కృతిక ప్రాచీన వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది. కానీ ఆనాటి రోజుల్లో యోగ కొన్నివర్గాలకే పరిమితమైంది. ఋషులు ఆశ్రమాలలో వున్న శిష్యులకు మాత్రమే యోగ అభ్యసన అధ్యయన ప్రక్రియను పరిమితం చేశారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీబి యోగకు పెద్దపీట. నరేంద్రమోడి గారు భారత ప్రధాన మంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత యోగాకు పెద్దపీట వేశారు. ప్రపంచ మానవాళి "అనారోగ్యం నుండి ఆరోగ్యం వైపు వెళ్లేందుకు యోగాయే ఉత్తమ మార్గమని" పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారు 2014 సెప్టెంబర్ 27 న ఐక్య రాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో యోగ ప్రాధాన్యం గురించి ప్రసంగించి ప్రపంచ దేశాలను యోగ ప్రాధాన్యతను గుర్తించే విధంగా చేసిన ప్రతిపాదనను డిసెంబర్ 11 2014న ఐక్యరాజ్య సమితి తీర్మానంద్వారా ఆమోదించింది. ప్రధాన మంత్రి చొరవతో ప్రతి యేటా జూన్ 21న అంతర్జాతీయ యోగదినోత్సవం నిర్వహించాలని యుఎన్ఓ నిర్ణయించింది. అంతర్జాతీయ యోగా దినోత్సవ తీర్మానాన్ని 193 దేశాలు సమర్థించాయి .నాటి నుండి ప్రతి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగాదినోత్సవం జరుపుకుంటారు

### 2025 యోగ దినోత్సవం థీమ్

"ఒకే భూమి ఒకే ఆరోగ్యం యోగ అనే ఇతివృత్తంతో " భవిష్యత్తు కోసం యోగానికి మానవత్వాన్ని జోడించి యోగను మరింత మందికి చేరువ చేయాలన్న ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్ష అభినందనీయం. యోగ తత్వం మానవత్వం అనే సద్భావన ప్రతి ఒక్కరిలో కలుగ చేయడం. అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రపంచ వ్యాప్త ఉద్యమంగా అభివృద్ధి చెందుతుంది. శారీరక మానసిక మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి లక్షలాది మందిని యోగ సాధన ద్వారా ఐక్యం చేసింది .దేశంలో 100000 ప్రదేశాల్లో "యోగ సంగమం" పేరున సామూహిక యోగా ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుంది. యోగ బంధన్ యోగ పార్క్ యోగ సమవేశ్ యోగ ప్రభవ యోగ కనెక్ట్ హరిత యోగ, యోగ అన్ ప్లగ్ యోగా మహాకుం భ్ సంయోగ అని పేర్లతో యోగా ప్రదర్శనలు దేశంలో నిర్వహించబడుతున్నాయి.

### యోగ గిన్నిస్ రికార్డు

2015 జూన్ 21న మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవం రెండు గిన్నిస్ రికార్డులు పొందింది. 3595 మంది పాల్గొన్న అతిపెద్ద యోగా శేషన్గుర్తింపు పొందింది . ఈ సెషన్ లో84 దేశాలు పాల్గొన్నాయి. ప్రపంచ యోగ దినోత్సవం జరిగే వేడుకల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా యోగ ప్రాచుర్యం పెరుగుతోంది. చాలా దేశాల్లో యోగ అభ్యసించే వారి సంఖ్య క్రమ క్రమంగా పెరగడం గమనార్హం. వివిధ వ్యాయామాల ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం పొందవచ్చు .యోగలో ఒక భాగమైన హఠయోగ నేర్చుకుంటే వందల యేళ్లు బతుకవచ్చును అని వైద్య 'ఆరోగ్య అద్యయనాలు తెలుపుతున్నాయి. పహారిబాబా నుండి స్వామి వివేకానంద వరకు హఠయోగ నేర్చుకునేందుకు తీవ్రంగా కృషి చేశారు.



2025 అంతర్జాతీయ యోగా దినోత్సవం థీమ్.
ఒకే భూమి ఒకే ఆరోగ్యంతో ఈ సంవత్సరం యోగా దినోత్సవం నిర్వహిస్తారు. సంపూర్ణ శ్రేయస్సు పర్యావరణ సామరస్యాన్ని ప్రోత్సహించడంలో యోగా కీలక పాత్ర వహిస్తుంది. కరోనా కాలంలో యోగ సాధన అవసరం ప్రాదాన్యతనత పెరిగింది. శ్వాస కోశ ఇబ్బందులను అధిగమించడానికి యోగ ఉత్తమ సాధనం. కరోనా వైరస్ బారిన పడిన వారిలో తలెత్తే ప్రధాన అనారోగ్య సమస్య శ్వాస కోశ ఇబ్బందులు యోగ ద్వారా అధిగమించ వచ్చును. ఊపిరి తీసుకోవడంలో తలెత్తే ఇబ్బందులను యోగా చిట్కాలద్వారా అధిగమించవచ్చు. ప్రాణాయామం ద్వారా మానసిక దృఢత్వాన్ని సాధించ వచ్చును. భారతీయ మూలాల్లో ప్రాణాయామ వ్యవస్థ వుంది దశాబ్దాల కిందటే ప్రాణాయామాన్ని ఆచరించిన చారిత్రిక ఆధారాలు ఉన్నాయి.
మనో బలానికి యోగ.
మానవునికి అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో సడలని మానసిక దృఢత్వాన్నియోగ అందిస్తుంది .స్వామి వివేకానంద సైతంఈవిషయాన్ని వెల్లడించారు. కరోనా వైరస్ వల్ల ఏర్పడిన సంక్షోభ సంక్లిష్ట పరిస్థితుల్లో కూడా భారత్ ధైర్యంగ నిలబడటం గమనార్హం.

### యోగను పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలి.

ప్రభుత్వం నూతన విద్యా విధానంలో కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల' కళాశాల స్థాయిలో యోగ ప్రాణాయామం పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి. యోగ పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు రివార్డులు ఇచ్చి సత్కరించాలి. యోగ సాధనలో యువత సంపూర్ణ భాగస్వాములైతె ఆత్మహత్యలు డ్రగ్స్ మాదక ద్రవ్యాల బారిన పడకుండా మనోనిబ్బర వైఖరి పెరుగుతుంది. యోగలో ప్రజలు భాగస్వాములు అవుతే రాజ్యాంగంలో పేరుకొన్న అందరికీ ఆరోగ్యంఅన్న లక్ష్యం నెరవేరుతుంది.

### కార్పొరేట్ వైద్య దోపిడి అడ్డుకోవచ్చు

వైద్య' ఆరోగ్య రంగములో రాజ్యమేలుతున్న కార్పోరేట్ వైద్య ఆరోగ్య ఆర్థిక దోపిడీని అడ్డుకోవచ్చు. పిల్లలు పెద్దలు యువకులు మహిళలు అన్ని వయసుల వారు యోగాసనాలు నిత్య జీవితములో ఒక భాగం చేసుకోవాలి. పౌర సమాజం యోగ వల్ల కలిగే విస్తృత ఆరోగ్య మానసిక ఆరోగ్యం ప్రయోజనాల పట్ల అవగాహన చైతన్య సదస్సులు సమావేశాలు నిర్వహించాలి . రోగరహిత సమాజ స్థాపన లోయోగ క్రియాశీల పాత్ర పోషించాలి. యోగ ప్రతి వ్యక్తి జీవన శైలి కావాలి. యోగ చేద్దాం ఆరోగ్య భారత్ నిర్మాణానికి పాటుపడుదాం అని ప్రతి పౌరుడు ప్రతిజ్ఞ చెయ్యాలి.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు,
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
కరీంనగర్, 9440245771



# నరం లేని నాలుక



- ఎన్ని గప్పాలు అయినా కొడుతుంది
- ట్రంప్ వ్యాఖ్యల యూటర్న్

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రసంగాలు, వ్యాఖ్యలు, ట్వీట్లు తరచుగా అంతర్జాతీయ రాజకీయాల్లో గందరగో ళాన్ని సృష్టిస్తాయి. ఇటీవలి భారత్-పాకిస్తాన్ సీజ్ ఫైర్ (కాల్పుల విరమణ) విషయంలో అతను చేసిన వ్యతిరేక వ్యాఖ్యలు మళ్లీ అతని అస్థిరమైన ప్రవర్తనను బహిర్గతం చేశాయి. మునుపు "నేను భారత్-పాక్ యుద్ధాన్ని ఆపాను" అని పేర్కొన్న అదే ట్రంప్, ఇప్పుడు "నాకేం సంబంధం లేదు, వారే మాట్లాడుకున్నారు" అంటున్నాడు. ఇలాంటి మాటల మార్పులు అతని విశ్వసనీయతపై అనేక ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.

**ట్రంప్ వ్యాఖ్యలు - ఒక పునరావృతమయ్యే నాటకం :**
ట్రంప్ తరచుగా తన మాటలను, ప్రకటనలను మార్చుకుంటూ, అంతర్జాతీయ సంబంధాలను సంక్లిష్టంగా మారుస్తున్నారు. భారత్-పాకిస్తాన్ విషయం లో అతను ఇంతకు ముందు అనేకసార్లు తన మధ్య వర్తిత్వంతో యుద్ధాన్ని ఆపానని స్వయంగా చెప్పుకున్నారు. కానీ ఇప్పుడు, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈవిషయంలో స్పష్టం చేసిన తర్వాత, ట్రంప్ తన మాటను మార్చుకున్నాడు. ఇది అతని ప్రవర్తనలోని నమ్మకస్థత్వ లోపాన్ని తెలియ జేస్తుంది. ఇదే విధంగా, ట్రేడ్ ఒప్పందాలు, టారిఫ్ ల విషయంలో కూడా చైనా-అమెరికా వ్యవహారాలు వంటి అనేక అంశాల్లో ట్రంప్ తన స్టేట్మెంట్లను అనేక సార్లు మార్చుకున్నారు. ఉదాహరణకు, చైనాతో వాణిజ్య యుద్ధం ప్రకటించి, తర్వాత కొన్ని రోజుల్లోనే ఒప్పందం చేసుకున్నాడు. ఇలాంటి అస్థిరత వల్ల అంతర్జాతీయ మార్కెట్లు కంగారుపడ్డాయి.

**అమెరికా అధ్యక్ష పదవికి హొదా హాని:**
అమెరికా అధ్యక్షుడు అనేది ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన రాజకీయ పదవి. ఈ పదవికి గౌరవం, విశ్వసనీయత అనేవి అత్యంత ముఖ్యమైనవి. కానీ ట్రంప్ తరచుగా మాట మార్చడం, అస్పష్టమైన ప్రకటనలు చేయడం వల్ల ఈ పదవి యొక్క ప్రతిష్టకు హాని కలిగింది. అతని వ్యాఖ్యలు కేవలం అంతర్జాతీయ సంబంధాలను మాత్రమే కాకుండా, అమెరికా ప్రజల నమ్మకాన్ని కూడా ప్రభావితం చేస్తున్నాయి. ట్రంప్ మాటలను విమర్శనాత్మకంగా విశ్లేషించడం ఇప్పుడు అవసరమైంది. అతను చేసిన ప్రతి ప్రకటనను వెంటనే నమ్మకుండా, అధికారిక స్పందనలక కోసం ఎదురు చూడాలి. భారత్ వంటి దేశాలు తమ విదేశాంగ విధానంలో ట్రంప్ వ్యాఖ్యలను తీవ్రంగా తీసుకోకుండా, స్వతంత్ర దృక్పథంతో ముందుకు సాగడం మంచిది.

**మాటల కంటే చర్యలే ముఖ్యం:**
రాజకీయ నాయకులు, ముఖ్యంగా అగ్రరాజ్యాల అధినేత లు, తమ మాటలపై స్థిరత్వం కలిగి ఉండాలి. ట్రంప్ వ్యాఖ్యలు అనేకసార్లు అస్థిరతను, అహంకా రాన్ని చూపు తున్నాయి. అమెరికా అధ్యక్ష పదవి యొక్క గౌరవాన్ని కాపాడుకో వాలంటే, ట్రంప్ తన ప్రవర్తనలో మరింత జవాబుదారీతనం చూపించాలి. ప్రజలు కూడా అటువంటి నాయకుల మాటలను అబద్ధాల కంటే ఎక్కువగా పరిగణించకుండా ఉండటం మంచిది.
"మనిషికి మాటే ప్రాణం" ఒకసారి ఏదైనా విషయంలో ఒక మనిషి ఎదుటివారికి ఒక వాగ్దానం చేస్తే... లేదా ప్రకటన చేస్తే... దానికి జీవితా ంతం కట్టుబడి ఉన్నప్పుడే, ఆ మనిషికి విలువ ఉంటుంది . ఆతని మాటలకు "శక్తి" "విశ్వాసం" ఉంటుంది. అలా కాకుండా... "పిచ్చోడి చేతిలో రాయిలా" ఎప్పుడు, ఏది పడితే అది మాట్లాడి... తెల్లారే సరికి ఆ మాటలను మరిచిపోయి... మరో కొత్త మాటలు మాట్లాడితే ఎదుటి వాళ్ళు అతన్ని "పిచ్చోడి" కింద జమ కడతారు. ఒక అగ్రరాజ్యానికి దేశాధినేతగా ఉండి... ఇలా అడ్డదిడ్డంగా మాట్లాడుతూ, మరుక్షణం మాటలు, వాగ్దానాలు మారిస్తే... ఆ మనిషికి సమాజంలో విలువ ఉండదు.
"మనసా, వాచా, కర్మణా "త్రికరణ శుద్ధి" ప్రతి మనిషికి అవసరం.
"మాటలు మారేవి, కానీ చర్యలు చరిత్రను రాస్తాయి"... ఈ సూత్రం ట్రంప్ వంటి నాయకులకు ఎప్పుడూ గుర్తుంచుకోవాల్సిన పాఠం.

డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.



## నిన్ను ఏమనాలి?



హైనాలా ప్రాణం ఉండగానే
నీ శరీరపు మాంసాన్ని
గుంజుకుని తింటుండగ
నీకు స్పర్శ కూడా లేకుండా
మత్తెక్కిన వాడిలా
మైకంలో ఉన్నావంటే
నిన్ను ఏమనాలి?

వాడు నీలాంటి వాడే కానీ
వాడు నీకు వశీకరణ మంత్రం వేసి
సేవకుడిగా మార్చుకుంటే
వాడు చెప్పినట్టు
నిన్ను నీవు మర్చిపోయి
వాడి చెప్పు చేతుల్లో
తిరుగుతున్నావంటే
నిన్ను ఏమనాలి?

ఎదుటివాడు నిన్ను ఎర్రిపప్పును చేసి
నీకు రాజకీయ రంగు పులిమి
నిన్ను బానిస కుక్కను చేసుకొని
ఎదుటి వారిపై ఉసిగొలిపినప్పుడల్లా
విచక్షణ మరిచి పక్క వాడిని
కరుస్తున్నామంటే నిన్ను ఏమనాలి?

నీకు విషయ పరిజ్ఞానం ఉండదు.
వివేకం అస్సలే ఉండదు
ఒకరు చెప్పితే వినవు
నీ అంతట నువ్వు ఆలోచించవు
పరాన్న జీవిలా ప్రపంచం తెలియకుండా
బతుకుతున్నావంటే నిన్ను ఏమనాలి?

నీవు ఎటువైపు తిరిగి చూసిన
ఎదురుగా నీకేం కనబడుతుందో
తెలుసా?
ఒక మనిషిలో నీకు కులం
ఇంకో మనిషిలో నీకు మతం
ఒక మనిషిలో ఇంకొక మనిషిని
చూడని అంధుడివై
అపరిచితుడుగా బతుకుతున్న
నిన్ను నేను ఏమనాలి?

నెరువట్ల చైతన్య
9491470746
కరీంనగర్

## మతంతో పనిలేదు!

ఆమతం ఈమతంకాదు
ఏమతమైనాఏంచేసాయి
దేవుడుపరిష్కారమన్నా
గుళ్ళుచర్చిమసీదుల్లకట్టా
వేదం బైబిల్ ఖురాన్ లు
వేలకొద్దీ పేజీలు నింపి
శ్లోకాలుకాండలుసురాలు
బోధించి ఏమిఫలము?
ఇప్పటికీ జనానికి
తిండీ గుడ్డ నీడాలేదు!
అక్షరాస్యత లేదు
ఎందుకు అగ్రంధాలు?
వాటినిండా మానవ బంధాలు
ఎంత జుగుప్సాకరం?
అంతా అశ్లీలం, బూతు?
కాస్త కళ్ళు తెరవండి!
మన ఓటుతో గెలిచినోళ్లు
ఏం చేస్తున్నారో.. రండి
పార్లమెంటు అసెంబ్లీలు
అక్కడ నోరు విప్పండి!
మతాలకు కాలంచెల్లెను
అసమానతలు పోతే
నైతికత అదే పెరుగును
మతతో నేడు పనిలేదు!
నేడు చట్టసభలే
ఆధునిక దేవాలయాలు!
ఈ మహానాయకులే
ఆధునిక దేవుళ్ళు!
వాళ్ళను నిలదీద్దాం!
సమానత్వం కోసం
కలిసిపోరాడదాం!
మతమేల తమ్ముళ్లు?

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## అద్వితీయ శక్తి

అమ్మ పొత్తిళ్లను వీడివచ్చిన నాకు
ఈ లోకాన్ని చూపిన ఉషస్సు నాన్న
నా అడుగులకు ఆశలకు ఆశయాలకు
వెన్నెల వెలుగులు నింపిన నిశీధి
బాపు జీవిత కాలాన్నిచ్చిన ప్రదాత
నన్ను ఎత్తుకొని ఆటలాడించిన ఆకాశం
కొత్త స్పర్శనిచ్చిన ఒక చల్లని గాలి
నా అడుగులకు తాకిన మెత్తటి భూమి
నా కోసం అనునిత్యం ఉప్పొంగిన జలధి
బతుకు వెలుగులనిచ్చిన పరమజ్యోతి
పంచభూతాల కన్నా అద్వితీయ శక్తి నాన్న
నా పురోగతికై పరిశ్రమించిన స్వేదనది
నాకై పరితపించిన ఉద్వేగాల అగ్నిశిఖరం
ప్రేమలు పంచిన అనురాగమారుతం
ఎప్పటికీ కళ తప్పని వరాల వసంతం
బాపు కళ్ళెదుట నిలిచిన ప్రకృతి స్వరూపం
ఆయన తీర్చిదిద్దిన శిల్పాలమైన మనం
ఆ స్ఫూర్తితో ఉత్తమ వ్యక్తులమౌదాం
ఒకరోజు కాదు.. నాన్న కోసం
ప్రతి నిత్యం కన్నీటిపూల పూజలు చేద్దాం.

కొత్త అనిల్ కుమార్

# తెలంగాణ 12th ఫెయిల్...

## *(But it's a Success story)*

కొద్దిరోజుల క్రితం బాలీవుడ్‌లో ఎలాంటి హైప్ లేకుండా రిలీజ్ అయి మంచి సక్సెస్ సాధించి అన్ని భాషల్లోనూ రిలీజై దేశవ్యాప్తంగా అందరి మన్ననలు పొందింది 12th ఫెయిల్ చిత్రం. మధ్యప్రదేశ్‌లో బందిపోట్ల సామ్రాజ్యంగా వర్ధిల్లిన చంబల్ లోయలోని ఒక మారుమూల గ్రామం.. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబంలో నుంచి ఒక యువకుడు సివిల్స్ లక్ష్యసాధన కోసం చేసిన పోరాటమే ఆ చిత్రం ఇతివృత్తం. అవినీతిలో పూర్తిగా కూరుకుపోయిన ప్రభుత్వ యంత్రాంగం...ఉపాధ్యాయులే అధికారుల కు లంచాలు ఇచ్చి డైరెక్ట్ గా మాస్ కాపీయింగ్ జరిపి పాస్ చేపించే విద్యా విధానం. నిజాయితీ కట్టుబడి అవినీతికి లొంగక ప్రభుత్వ ఉద్యోగం నుండి సస్పెండ్ అయిన తండ్రి... కూలినాలీతో కుటుంబాన్ని సాకే తల్లి... ఏదోలా డిగ్రీ పాసై ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగంతో కుటుంబానికి ఆసరా అవ్వాలన్న హీరో మనోజ్ కుమార్ శర్మ. అత్యంత నిజాయితీగల డిఎస్పి రావడం.... పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడం...ఇంటర్లో ఫెయిల్ . ఇక తప్పని పరిస్థితుల్లో అన్నతో కలిసి కుటుంబ పోషణకు ఆటో సవారీ. అప్పటికే స్థానిక mla చేతిలో లోకల్ ట్రాన్స్పోర్టేషన్ దందా... ఎమ్మెల్యే మనుషుల దాడి... తప్పుడు కేసులు పోలీస్ స్టేషన్లో అన్న. నేరుగా నిజాయితీ గల డీఎస్పీని కలిసి జరిగింది చెప్పడం....రాత్రికి రాత్రికి ఆ డీఎస్పీ స్టేషన్ కి వచ్చి స్టేషన్ సిబ్బందికి వార్నింగ్ ఇచ్చి వారిని విడుదల చేయడం. అటు ఎగ్జామ్ సెంటర్ లో ఇటు స్టేషన్ లో ఆ అధికారి పవర్ చూసి నేను కూడా మీలాగా అవ్వాలి అంటే ఏం చేయాలి అని అడగడం. కష్టపడి చదివి సర్వీస్ కమిషన్ ఎగ్జామ్స్ లో ర్యాంక్ సాధించాలి అన్న సదరు అధికారి. దీంతో అదే మనసులో పెట్టుకొని కష్టపడి ఇంటర్, ఆపై డిగ్రీ పాసై సర్వీస్ కమిషన్ పరీక్షల ప్రిపరేషన్ కోసం ఇండోర్ పయనం. తీరా అక్కడకు వెళ్ళాక మూడేళ్ల సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్లు అన్నీ రద్దు సమాచారం. కనీసం టిఫిన్ చేసేందుకు డబ్బులు లేని దిక్కుతోచని స్థితిలో.... అక్కడే అదే పరీక్షల ప్రిపరేషన్ కోసం అని వచ్చిన యువకుడి పరిచయం. అతని ద్వారా తొలిసారి సివిల్ సర్వీసెస్ అన్న పేరు విని దాని మీనింగ్, కనీసం స్పెల్లింగ్ కూడా తెలియకుండా అతనితో పాటు ఢిల్లీకి పయనం. అక్కడ కోచింగ్ ,ప్రిపరేషన్ ప్రయత్నాలు, విఫలం తిరిగి ప్రయత్నించడం వాటి డబ్బుల కోసం గంటల తరబడి వెట్టిచాకిరి ఎట్టకేలకు చివరి అటెంప్ట్ లో సాధించిన విజయం అద్భుతంగా చిత్రీకరించారు. ఇదంతా ఏదో కల్పిత కథ కాకుండా మధ్యప్రదేశ్ ఐపిఎస్ అధికారి మనోజ్ కుమార్ శర్మ రియల్ స్టోరీ కావడం తో అందరి మనసులకు హత్తుకుంది.

ఇదంతా బాలీవుడ్లో సక్సెస్ అయిన ఒక మధ్యప్రదేశ్ సివిల్ సర్వెంట్ రీల్ రియల్ స్టోరీ. అయితే అంతకుమించి కష్టాలు అనుభవించి అదే సివిల్ సర్వీస్ లో ర్యాంక్ సాధించి దాదాపుగా 30 వేల కోట్ల టర్నోవర్ కలిగి ప్రత్యక్షంగా 40 వేల మందికి పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి కల్పిస్తున్న తెలంగాణలోని అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి %జడవీణ% గా ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న బలరాం నాయక్ రియల్ స్టోరీ. వెనుకబడిన మహబూబ్నగర్ జిల్లా బాలానగర్ మండలం తిరుమలగిరి గ్రామంలోని కేశ నాయక్ తండ. ఆ తండాలో అత్యంత వెనుకబడిన గిరిజన కుటుంబం . ఆరుగురు కొడుకులు ఒక కూతురు దీంతో భార్యాభర్తలు ఇద్దరు కూలీనాలీ చేస్తే గాని పూట గడవని పరిస్థితి. ఏడుగురు సంతానంలో పెద్దవాడు కావడంతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి వరకు ప్రాథమిక విద్యను అభ్యసించారు. గ్రామంలో ఉపాధి కష్టంగా మారడంతో భవన నిర్మాణ కార్మికులుగా తల్లి తండ్రి హైదరాబాద్ కు వలస వెళ్లగా నానమ్మ వద్ద ఉండి గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలో నిత్యం ఐదు కిలోమీటర్లు నడుస్తూ వెళ్లి ఆరు నుండి 8 వరకు పూర్తి చేశారు. ఆరవ తరగతి నుంచే కుటుంబ పోషణకోసం సెలవుల్లో కూలి పనులు చేయడం వచ్చిన డబ్బులు కుటుంబ అవసరాలకు ఇవ్వడం అలవాటుగా మలచుకున్నారు. జడ్చర్ల లోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్లో ఉంటూ తొమ్మిది , 10వ తరగతి పూర్తి చేశారు. అప్పటికే తల్లిదండ్రులు ఉపాధి కోసం భవన నిర్మాణ కార్మికులుగా హైదరాబాద్కు వలస వెళ్లగా వారి వద్దకే వెళ్లి వారితోపాటు కూలి పని చేస్తూ బాగ్ లింగంపల్లిలోని Dr. Br అంబేద్కర్ జూనియర్ కాలేజీలో ఎంపీసీలో చేరారు. గిరిజన కుటుంబం కావడం చిన్నప్పటినుండి పెద్దలు అనుకోవడంతో టెన్త్ పూర్తికాగానే పెళ్లి తీసుకోవాల్సిన రావడం వెంటనే పిల్లలు. తాను కూడా రోజు కూలికి వెళ్లి కుటుంబాన్ని పోషించాల్సిన పరిస్థితి దీనితో ఇంటర్ ఫెయిల్.
అయితే చిన్నప్పటినుండి చదువులో చురుకుగా ఉండడంతో మాధ్యమిక స్థాయిలో, ఉన్నత స్థాయిలో గురువులు పేదరికంలో పుట్టవచ్చు కానీ ఆలోచనలకు ఆశయాలకు పేదరికం అడ్డుకాదు చదువుకుంటేనే జీవితాల్లో మార్పు అన్న మాటలు స్ఫూర్తితో ఎట్టి పరిస్థితుల్లో చదువు కొనసాగించాలని దృఢంగా నిర్ణయించుకున్నారు. చదువు ముందుకు సాగాలంటే ఎంపీసీ కష్టంగా భావించి ప్రైవేట్ లో ఇంటర్ సీఈసీ పరీక్షలు రాసి ఒకేసారి ఇంటర్, ఆ తర్వాత అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కాచిగూడ సెంటర్లో బిఏ పూర్తి. అటు ఇంటర్ ఇటు డిగ్రీ చదువుతూనే కాళ్లకు చెప్పుల్లేకుండా, రామంతపూర్, పాల అడ్డా ఇలా వివిధ ప్రాంతాల్లో లుంగీ కట్టుకొని భుజాన తువ్వాలు వేసుకొని అడ్డమీద కూలీగా, కన్స్ట్రక్షన్ కార్మికూడా, తండ్రితో పాటు గ్యాస్ డెలివరీ బాయ్ గా చెమటోడ్చారు. రేషన్ షాప్ వచ్చినా అది ఎలా నడపాలో తెలియక నష్టపోయి అందులోనే జీతానికి చేరడమే కాదు మధ్యలో కేటరింగ్ పనులు కూడా చేశారు.. మెదక్ జిల్లాలోని చాక్లెట్ కంపెనీలో ఇంటర్ వేసవి సెలవుల్లో 50 రూపాయల కూలికి ఉదయం ఏడు నుంచి రాత్రి 7 వరకు కాళ్ల పగిలి రక్తాలు కారేలా సిమెంట్ పని నెల రోజులు కట్టు బానిసలా వెట్టి చాకిరి చేస్తే చివరకు సగం కూలీ డబ్బులు కూడా రాని దయనీయ పరిస్థితి. చిన్నప్పుడు గ్రామంలో ప్రభుత్వాధికారులు వాహనాల్లో రావడం వారు రాగానే పిల్లలంతా గుంపులుగా వెళ్లి వాళ్ళని చూడడం ఆ తర్వాత ఉన్నత విద్య స్థాయిలో పరీక్షల కోసం సర్టిఫికెట్లపై అసస్టేషన్ ఇతర అవసరాల కోసం గెజిటెడ్ అధికారుల వద్దకు వెళ్ళినప్పుడు వారిని చూసి తను కూడా అలా కావాలి అని కలలు కన్నారు. వాటి సాధన కోసం డిగ్రీ పూర్తయ్యాక పడిన నోటిఫికేషన్ కల్లా దరఖాస్తు ప్రిపరేషన్. ఒకటి రెండు ఉద్యోగాలు కూడా రావడం ఇదే సమయంలో సివిల్ సర్వీస్ గురించి తెలియడంతో వాటి ప్రిపరేషన్ కోసం ఏపీ స్టడీ సర్కిల్లో చేరాలని భావించగా అందులో చేరేందుకు ఖచ్చితంగా పీజీ పూర్తి చేయాలన్న నిబంధన ఉండడంతో ప్రొఫెసర్ రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ లో ఎంబీఏ లో చేరి పూర్తి చేశారు. ఆ తర్వాత ఎంఫిల్ కోసం దరఖాస్తు చేసుకోగా డైరెక్టుగా పీజీ పూర్తిచేసిన వాళ్ళతో పోటీ పడి సీట్ రావటంతో సివిల్స్ సాధించాలి అన్న పట్టుదల మరింత పెరిగింది.
ఉదయం స్టడీ సర్కిల్ కి వెళ్లడం అక్కడ క్లాసులు అక్కడ నుంచి లైబ్రరీలో ప్రిపరేషన్. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ప్రధాని రోజ్ గారి యోజన పథకం ద్వారా బ్యాంకు లోన్ తో కొనుగోలు చేసిన సెవెన్ సీటర్ ఆటో నడపటం. కనీసం పేపర్ వేయించుకునే స్తోమత కూడా లేక ఆటో నడుపుతూ మధ్యలో టిఫిన్ సెంటర్ వద్ద హేర్ సెలూన్లలో పేపర్ చదువుతూ జనరల్ నాలెడ్జ్ ప్రిపరేషన్ . ఒకవైపు అమ్మ, నాన్న, తమ్ములు, చెల్లి మరోవైపు భార్య ,ముగ్గురు పిల్లలు వీలందరి బాధ్యతలు చూస్తూ బండంత చాకిరితో రేయింబవళ్ళు కష్టపడుతూనే సివిల్స్ కు సన్నదమయ్యారు. 12th ఫెయిల్ సినిమాలో హీరోకు ఇంటి బాధ్యతలు ఏం లేవు మరీ ముఖ్యంగా భార్య పిల్లలు లేరు, ఇక మిత్రుడి సహకారం కూడా ఉంది ఇక్కడ బలరాం నాయక్ కు అవేం లేవు అంత ఒంటరి పోరాటమే. ఒక తపస్సులా లక్ష్య సాధనకోసం పోరాటం చేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం వరకు స్టడీ సర్కిల్, సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఆటో తోలడం ఇలా మొదటి సారే మెయిన్స్ కు అర్హత సాధించడం తో మరింత కసి పెరిగింది. ఎంత కష్టమైనా సరే ఖచ్చితంగా సివిల్ సర్వీస్ సాధించాలని పట్టుదలతో కృషి చేశారు. లక్షల బిట్లు ప్రిపేర్ అవుతూ పిల్లలను దేవుడితో సమానం వాళ్ళు గట్టిగా కోరుకుంటే జరుగుతుంది అన్న నమ్మకంతో ఎగ్జామ్ కి వెళ్లేటప్పుడు పిల్లలను జాబ్ రావాలని దేవుని మొక్కాలని కోరుకోవడం ...వాళ్ల చేత ఈ బిట్లు రావాలని టిక్కులు పెట్టించడం అలా ఎంతో కటోర సాధనతో సివిల్స్ లో ఐఆర్ఎస్ సాధించారు. మొదట ముంబై ఇన్కంటాక్స్ విభాగంలో పనిచేసి ఆ తర్వాత వివిధ సెంట్రల్ సర్వీసుల్లో సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. డిప్యూటేషన్ పై సింగరేణి డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించి అతి కొద్ది సమయంలో తన పనితీరు , ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వేలాది కార్మికుల అభిమానాన్ని చూరగొన్నారు. 2024 జనవరిలో సింగరేణి ఎండి గా ఎంపిక 135 ఏళ్ల చరిత్ర గల సింగరేణిలో తనదైన చెరగని ముద్ర వేశారు. చైర్మన్ అంటేనే బలరాం ...బలరామంటే సింగరేణి... సింగరేణి అంటే బలరామన్నంతగా ఉద్యోగులు ఆయనను ఓన్ చేసుకున్నారు.







మారుమూల గిరిజన తండాలో కటిక పేదరికంలో పుట్టి చిన్ననాటి నుండి కూలి పని, గ్యాస్ డెలివరీ , క్యాటరింగ్, ఆటో నడుపుతూ చిన్న వయసులోనే పెళ్లి అయి ముగ్గురు పిల్లలున్నా అత్యంత కటోరశ్రమ తో అనుకున్న లక్ష్యాన్ని సాధించి ... ఇప్పుడు దాదాపుగా 30 వేల కోట్ల టర్నోవర్ కలిగిన అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థకు బాసుగా లక్షలాదిమంది ఉద్యోగులకు అధికారిగా ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. నిలిచిన నిలవడమే కాదు తనలా ఎవరు కష్టపడకూడదు అన్న మహోన్నత ఆశయం కలిగిన వ్యక్తి బలరాం నాయక్. ఎంతోమంది పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ , పుస్తకాలు అందించడమే కాదు వారి లక్ష్య సాధనకు ప్రోత్సాహాన్ని కూడా అందిస్తున్నారు. ప్రిపరేషన్ సమయంలో 2వేలు కోచింగ్ ఫీజ్ కట్టేందుకు ఎంతో కష్టపడాల్సి వచ్చింది....50 రూపాయల పుస్తకం కొనాలంటే వారం రోజులు ఆలోచించే స్థితి నుంచి తాను ప్రిపరేషన్ కోసం పడ్డ కష్టాలు సివిల్స్ కు ప్రిపేర్ అయ్యే మరెవ్వరూ పడొద్దు అన్న మహోన్నత ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకానికి ఆర్థిక భరోసాగా నిలిచారు. సింగరేణి తరఫున సిఎస్ఆర్ నుండి సివిల్స్ ప్రిలిమ్స్ లో క్వాలిఫై అయ్యి మెయిన్స్ కు సన్నధమవుతున్న ఒక్కో అభ్యర్థికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల విడుదలైన సివిల్స్ 2024 ఫలితాలలో అలా ఆర్థిక సహాయం పొందిన వారిలో 7 గురు ఉత్తీర్ణత సాధించటమే కాక మంచి ర్యాంకులు సైతం సాధించారు.
చాలామంది ఎంతో కష్టపడి పైకి వచ్చాము తమ పిల్లలు లేదా ఇతరులకు కష్టాలు తెలియాలి అని భావిస్తారు . కానీ తాను మాత్రం తనలాంటి కష్టం మరెవ్వరు పడొద్దు అన్న సంకల్పంతో పేద విద్యార్థులకు మెటీరియల్స్ పరంగా ఆర్థికంగా సహాయం చేస్తూ ఎందరికో భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ... చదువులో రాణిస్తున్న ఉద్యోగుల పిల్లలను స్వయంగా అభినందిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు బలరాం(ఐ.ఆర్.ఎస్)

వ్యాసకర్త ...
ప్రదీప్ రావ్
సింగరేణి ఉద్యోగి, (9966089696)



# రేషన్ డీలర్లు నిబంధనలు పాటించాలి

● నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**బిజినేపల్లి, జూన్ 20 (జనం సాక్షి) :** రేషన్ సన్న బియ్యం పంపిణీ సజావుగా 100% నిర్వహించాలని, ఎక్కడా అక్రమాలకు తావులేకుండా చూడాలని నాగర్ కర్నూల్ నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. శుక్రవారం బిజినపల్లి మండలం వెలుగొండ గ్రామంలో 16వ నెంబర్ రేషన్ షాపును జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించారు. గ్రామంలో 2 రేషన్ దుకాణాలు ఉన్నాయని,16వ నెంబర్ రేషన్ దుకాణంలో 504 కార్డులు, 38వ రేషన్ దుకాణంలో 499 రేషన్ కార్డులు ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ప్రతి రేషన్ డీలర్ ప్రభుత్వం విధించిన నిబంధనలు పాటిస్తూ పంపిణీ సజావుగా జరగాలని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు 100% సన్న బియ్యం అందించాల్సిన అవసరం ఉందని స్పష్టంగా చెప్పారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో, రవాణా మరియు ఇతర ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం జూన్‌లోనే మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లాలో ఇప్పటికే 65.69% పంపిణీ పూర్తయిందని కలెక్టర్ వివరించారు. ఇప్పటి వరకు 1,60,351 మంది లబ్ధిదారులు మూడు నెలల సన్న బియ్యం అందుకున్నారని చెప్పారు. జిల్లాలో ఉన్న మొత్తం 2,43,720 రేషన్ కార్డులకు గాను జూన్, జూలై, ఆగస్టు నెలలకు బియ్యం పంపిణీ జరుగుతోంది. ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున మొత్తం 14169.405 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. సాధారణంగా ప్రతి నెల 15వ తేదీ వరకు మాత్రమే పంపిణీ జరిగే విధానాన్ని మార్చి, ఈ నెల 30వ తేదీ వరకు పంపిణీ కొనసాగించాలనే ఆదేశాలు జిల్లా వ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లకు ఇచ్చినట్లు చెప్పారు. ఇంకా బియ్యం అందుకోని లబ్ధిదారులు ఈ నెలాఖరు వరకు బియ్యం తీసుకోవచ్చని తెలిపారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట బిసినపల్లి తహసిల్దార్ మున్నూరోద్దీన్ రేషన్ డీలర్ బాలస్వామి, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

# అంబేద్కర్, గాంధీ ఆశయాలలో నడుద్దాం

● తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు



**వీపనగండ్ల, జూన్ 20 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, పురావస్తు, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు జై బాపు, జై భీమ్, జై సావిదాన్ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో అవమానాలకు గురై అంటరానితనాన్ని సమూలంగా రూపుమాపడానికి ఆర్థికంగా వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ ఆశయాలను, బానిస బతుకుల నుండి బ్రిటిష్ వాళ్ళని ఎదిరించి భారతదేశానికి స్వాతంత్రం తీసుకువచ్చిన గాంధీజీ ఆశయాల బాటలో నడుద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. మహనీయుల విగ్రహాలకు పూలమాలవేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు ఆధ్వర్యంలో వీపనగండ్ల గ్రామ యువకులు మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి గ్రామంలో క్రీడలు ఆడుకోవడానికి క్రీడా ప్రాంగణం లేదని కోరగా స్పందించిన మంత్రి వెంటనే గ్రామంలోని తన సొంత భూమిని క్రీడా ప్రాంగణంగా మార్చుకోండి అని తెలిపారు.తెలంగాణ క్రీడా చైర్మన్ శివసేన రెడ్డి తో మాట్లాడి గ్రామంలో నాలుగు కోట్ల రూపాయలతో క్రీడా ప్రాంగణాన్ని వెంటనే అభివృద్ధి చేపిస్తానని హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని గట్టు పైన ఉన్న పొలాలకు రైతుబంధు పడడం లేదని కాంగ్రెస్ నాయకులు కోరగా స్పందించిన మంత్రి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయానికి 50 లక్షల రూపాయలతో నిర్మించడానికి భూమి పూజ నిర్వహించారు. భవన నిర్మాణానికి మొదటి విడతగా 20 లక్షల రూపాయలు ఈజీఎస్ నిధులు, 30 లక్షల రూపాయలు మంత్రి నిధులతో నిర్మిస్తామని అన్నారు. మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను పక్కాగా అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్, గ్రామ అధ్యక్షుడు నక్క విష్ణు,యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పాము రాజశేఖర్, మండల మార్కెట్ కమిటీ చైర్మన్ బొల్లారం సుదర్శన్ రెడ్డి, వల్లభాపురం నారాయణరెడ్డి, ఎస్.రవీందర్ రెడ్డి,రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడు బసవరాజు గౌడ్, ఎత్తం కృష్ణయ్య, వైయస్ వెంకటయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు భరత్ రెడ్డి, గోపి, కావలి మహేష్, డిజె శివ,యాదయ్య, పసుపుల నరసింహ, రాజు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దర్జాగా కబ్జాలు



**కుత్బుల్లాపూర్, జూన్ 20 (జనం సాక్షి) :** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలను హనుమంత రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సూరారం లోని శ్రీరామనగర్, శ్రీకృష్ణ నగర్ తదితర కాలనీలలో బోరు బావులు ఎండిపోయి నీటి సమస్యను ఎదుర్కొంటున్నామని స్థానికులు హనుమంత రెడ్డికి విన్నవించుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు ,కుంటలు కబ్జాకు గురి కావడం వల్లనే భూగర్భ జలాలు ఇంకిపోయి నీటి సమస్య ఏర్పడిందన్నారు. సూరారం ప్రాంతంలో సర్వేనెంబర్ 21 లో కొత్త కుంట చెరువును కొందరు బి ఆర్ ఎస్ నాయకులు పూడ్చివేసి ప్లాట్లుగా విభజించి రూములను నిర్మించడం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ స్థలాన్ని కాపాడేందుకు హైడ్రా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఆక్రమణకు గురైన చెరువులను గుర్తించి పునర్నిర్మించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంతోష్ ముదిరాజ్, సోమన్న గారి శ్రీధర్ రెడ్డి, స్థానిక కాలనీవాసులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ నేత ఎం. సుదర్శన్ రావు సేవలు మరువలలేనివి

● మండలి విపక్ష నేత ఎస్ మధుసూదనాచారి



**కూకట్‌పల్లి, జూన్ 20 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమ నేత ఎం సుదర్శన్ రావు సేవలు చిరస్మరణీయమని మండలి విపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి అన్నారు. ఏం సుదర్శన్ రావు జయంతి సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గంలో జరిగిన పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఏం. సుదర్శన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితిలో ఏం. సుదర్శన్ రావు కీలక భూమిక పోషించారని అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం నిరంతరం కృషి చేసిన ఎం సుదర్శన్ రావు ఎంతోమంది నాయకులకు ఆదర్శనీయమని కొనియాడారు. ఎమ్మెల్సీ కురుమయ్యగారి ఎమ్మెల్సీ నవీన్ రావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, ప్రముఖ సంఘ సేవకులు కురుమయ్యగారి కొండలరావు, ఎం అభిలాష్ రావు, బిజెపి కోరుట్ల ఇన్చార్జ్ సురభి నవీన్ రావ్, కపిల్ రాజు, గజ్జల నగేష్, పి రఘునందన్ నేత, రామ్మోహన్ రావు, దుర్గారావు, దేవేంద్రరావు, డి భాస్కర్ రెడ్డి, కన్నయ్య, బిక్షపతి, మాచర్ల భద్రయ్య, సిహెచ్ అనిల్, లక్ష్మణ్, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తాం

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్, జూన్ 20 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్ పరిధిలోని ఒక్షిత్ హిల్ వ్యూ కాలనీలో దాదాపు 60 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధి నిరంతర ప్రక్రియని తెలిపారు. నియోజకవర్గం శివారు ప్రాంతాల్లో రోజురోజుకు వెలుస్తున్న కొత్త కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులు,అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి, ఒక్షిత్ హిల్ యు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణ గౌడ్, ఉపాధ్యక్షులు సి నాగరాజు, అడ్వైజర్ ఎం సురేంద్ర, ఫాక్స్ డైరెక్టర్ పరిష శ్రీనివాస్ యాదవ్, బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి నవాబ్, సీనియర్ నాయకులు తెలంగాణ సాయి, మూసాఖాన్, చెట్ల వెంకటేష్, చందు సుంకరి, బోయిని మహేష్, చిన్న చౌదరి, బాబీ చౌదరి, దూలప్ప, సమ్మయ్య యాదవ్, రాములు గౌడ్, కరుణాకర్ రాజు, శివ నాయక్, జునైద్, ప్రసాద్, గౌస్, వహీద్ మహిళా అధ్యక్షురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆశలు నెరవేర్చిన రేవంత్ సర్కార్



**శామీర్‌పేట్, జూన్ 20 (జనంసాక్షి) :** నారాయణపూర్ గ్రామంలో 8 ఇందిరమ్మ ఇండ్లకు ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోమ్మలపల్లి నర్సింహులు యాదవ్ హాజరై ముగ్గులు పోయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మంద శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపిటిసి అఖిలేష్ రెడ్డి, బండి జగన్నాథం, దామోదర్ రెడ్డి, హరిమోహన్ రెడ్డి, గుర్రంబస్వరెడ్డి, దోసకాయల వెంకటేష్, రాత్నల మహేష్, తుంకి రమేష్, కీసరి బాను చందర్, సంజీవ, నరసింహ, ఇందిరామ్మ కమిటీ సభ్యులు ఉన్నారు.

# వృద్ధురాలిపై లైంగిక దాడి కేసులో నిందితుడి రిమాండ్



**యాచారం, జూన్ 20 (జనం సాక్షి) :** 90 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన మండల వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కొంత మంది అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా వారు ఇచ్చిన సమాచారంతో ఎట్టకేలకు నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మంథన్ గౌరెల్లి గ్రామానికి చెందిన గ్యార శివ, (23) హైదరాబాదులో క్యాటరింగ్ లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పది రోజులకు ఒకసారి గ్రామానికి వచ్చి వెళుతుండేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస అయ్యాడు. జూన్ 12వ తేదీన అర్ధరాత్రి 90 ఏళ్ల వృద్ధురాలు తన ఇంటిలో నిద్రిస్తుండగా మద్యం మత్తులో వృద్ధురాలి ఇంటిలోకి ప్రవేశించి లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఆమె తీవ్రంగా ప్రతిఘటించింది. దీంతో దాడి చేసి అఘాయిత్యానికి పాల్పడి అక్కడి నుంచి పరారయ్యాడు. వృద్ధురాలిపై దాడికి పాల్పడుతున్నప్పుడు విద్యుత్ సరఫరా లేకపోవడంతో నిందితుడిని ఆమె గుర్తించలేకపోయింది. పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేసి సాక్ష్యాధారాలు సేకరించి నిందితుడిని పట్టుకున్నారు. ఈమేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యం చేస్తే చర్యలు

● పట్టణ సిఐ జీ. సంతోష్ కుమార్




**తాండూరు, జూన్ 20 (జనంసాక్షి) :** ప్రైవేటు పాఠశాలలు, విద్యాసంస్థలకు చెందిన బస్సులు, వ్యాన్ ఫిట్ నెస్ లపై నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని పట్టణ సిఐ జీ. సంతోష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, డిఎస్పీ బాల కృష్ణ రెడ్డిల ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని పాఠశాలలు మరియు కళాశాలకు సంబంధించిన బస్సులకు సంబందించిన ఆర్సీలు, పర్మిట్, ఫిట్ నెస్, పోల్యూషన్ వంటి వివరాలను పరిశీలించారు. అదేవిధంగా. బస్ డ్రైవర్ లకు బ్రీత్( ఎనలైజర్) ద్వారా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ జీ. సంతోష్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలకు చెందిన వాహనాలు నడిపే డ్రైవర్ లు లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రైవర్లు, విద్యార్థులు రోడ్డు నిబంధనలు. భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# రైతు సమస్యలు త్వరగా పరిష్కరించాలి



**ఇబ్రహీంపట్నం, జూన్ 20 (జనం సాక్షి) :** మంచాల మండలం బండ లేమూర్ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తాహాసిల్దార్ ఎంవి ప్రసాద్ రావుకు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ పోచమోని కృష్ణ మాట్లాడుతూ బండాలేమూర్ లో భూసమస్యలతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రెవెన్యూ సదస్సులో వాటి పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకున్నారని వాటిని త్వరగా పరిష్కరించాలని కోరారు. గ్రామం శివారు గుట్టల్లో ఉన్న పశువుల బెడద వల్ల పొలాల్లో రైతులు పంటలు సాగు చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారుగా 20 ఏళ్లుగా అడవిలో వందలాదిగా పశువులు ఉన్నాయని అవి రైతులు వేసిన పంటలను నష్టం చేస్తున్నాయని అన్నారు. వాటి నుండి పంటలను కాపాడుకోలేక రైతులు తమ పొలాల్లో పంటలు వేయడమే మానేయడం జరిగిందని చెప్పారు. సుమారుగా 20 ఏళ్లుగా పంటలు వేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగుధయకమైన పొలాల్లో చెట్లు పెరిగిపోయి అడివి ప్రాంతంగా మారిందని దీనివలన రైతు భరోసా సహాయం కూడా అందిండం లేదని అన్నారు. పశువులను పట్టుకొని గోశాలలకు తరలించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయింది. కావున ఇప్పటికైనా ఆ పశువులన్నిటిని ఈ ప్రాంతం నుండి పట్టుకెళ్లాలని డిమాండ్ చేశారు. పశువులు లేకుండా అయితే రైతులు తమ పొలాల్లో పంటలు సాగు చేసుకుంటారని అన్నారు. అలాగే రైతులకు రైతు భరోసా సహాయం కూడా అందుతుందని చెప్పారు. పశువుల బెడద నుండి కాపాడి రైతులు పంటలు పందించుకునెలా చూడాలని అలాగే రైతు భరోసా సహాయం అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె వీరయ్య, మాజీ ఎంపీటీసీ వట్టి వెంకటేష్, మల్లం జంగయ్య, బద్దుల మల్లేష్, జర్పుల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు

● నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**బిజినేపల్లి, జూన్ 20 (జనం సాక్షి) :** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లాలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులు 100 శాతం పూర్తయినట్లు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం బిజినపల్లి మండలంలోని వెలుగొండ లో రెవెన్యూ సదస్సును పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం 2025 రైతులకి చుట్టంగా, భూ సమస్యలకి శాశ్వత పరిష్కారం లభించేలా నిపుణులు,అధికారులు, ప్రజల సూచనలతో రూపొందించటం జరిగిందని తెలిపారు. ఈనెల 3 నుంచి నేటి వరకు చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా తహసీల్దార్ నేతృత్వంలో బృందాలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరించడం జరిగిందన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవిన్యూ సదస్సుల ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అధికారులే ప్రజల వద్దకి వచ్చి సమస్యలు పరిష్కరించేందుకు వస్తున్నారని జిల్లా కలెక్టర్, తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా ప్రతి సమస్యకి పరిష్కారం చూపటం జరుగుతుందని వచ్చే ఆగస్టు 15 నాటికి భూ సమస్య లు పరిష్కరించేందుకు , అధికారులు క్షేత్ర స్థాయి లో పరిశీలించి రైతులు ఇబంది పడకుండా పారదర్శకంగా చట్టం అమలుచేయాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే సంబంధిత వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రికార్డుల వివరాలతో సరిపోల్చుకొని, క్షేత్రస్థాయి విచారణను పకడ్బందీగా జరపాలన్నారు. కలెక్టర్ వెంట బిసినపల్లి తహసిల్దార్ మున్నూరోద్దీన్ ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

# ఆట వస్తువులతో పిల్లలు ఎక్కువ సమయం గడిపేలా చూడండి

- జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్

**బిజినేపల్లి, జూన్ 20 (జనం సాక్షి) :** అంగన్వాడి కేంద్రాలలో పిల్లలను ఆట వస్తువులతో ఎక్కువ సమయం గడిపేలా చూడాలని అంగన్వాడి కార్యకర్తలకు జిల్లా కలెక్టర్ బాదవత్ సూచించారు శుక్రవారం మండల పరిధిలోని వెలుగొండ గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు అనంతరం ఆయన మాట్లాడారు. అంగన్వాడీలో పిల్లలకు అందిస్తున్న మెనూ ప్రకారం అందించాలి, అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల సంక్షేమంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి, ఆహార సరఫరా, మెనూ అమలుపై అంగన్వాడి కేంద్రంలో స్వయంగా పిల్లలు ప్రతిరోజూ హాజరవ్వాలంటూ టీచర్లకు సూచించారు. నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని ఆరోగ్యానికి సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని, అలాగే, అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. కలెక్టర్ అంగన్వాడీలలో పిల్లల పెరుగుదల మరియు అభివృద్ధికి సంబంధించిన వివరాలను కూడా తెలుసుకున్నారు. పిల్లలకు అందించే పోషకాహారం గురించి కలెక్టర్ ఆరా తీశారు.



అంగన్వాడీలో పిల్లల నమోదు, ఆహార సరఫరా, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు వంటి వాటిని పరిశీలించారు. అంగన్వాడి కేంద్రం సందర్శించి రిజిస్టర్లు, మెనూ ప్రకారం అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ అంగన్వాడీ కేంద్రం పనితీరును మెరుగుపరచడానికి కొన్ని సూచనలు చేశారు. కలెక్టర్ అక్కడే ఉన్న చిన్నారులతో మాట్లాడారు. మీరు ఎలా చదువుతున్నారుటీచర్లు బాగా బోధిస్తున్నారు కదా అనే ప్రశ్నలతో వారిని ఉత్సాహపరిచారు. పిల్లల్లో చొరవను ప్రోత్సహిస్తూ, ప్రతిరోజూ అంగన్వాడి పాఠశాలకు హాజరు కావాలని, ఆటవస్తువుల ద్వారా వారికి ఆనందదాయకంగా మరియు సృజనాత్మకంగా బోధన ఉండేలా టీచర్లు కృషి చేయాలని సూచించారు. కలెక్టర్ చిన్నారులను చిత్రాలను చూపించి అక్షరాలను గుర్తించేలా చదివించారు. చిన్నారుల భవిష్యత్తు బలంగా ఉండాలంటే ప్రాథమిక స్థాయిలోనే వారికి సరైన మార్గనిర్దేశనం అవసరమని ఆయన పేర్కొన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం వారంలో రెండు రోజులు ఎగ్ బిర్యాని, అందించాలన్నారు. అంగన్వాడి కేంద్రంలో ఉన్న స్టోర్ను పరిశీలించి శుభ్రత కలిగిన వాతావరణం చిన్నారుల ఆరోగ్యానికి ఎంత ముఖ్యమో ఆయన స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాలు సక్రమంగా లేకపోతే అందే సేవల ప్రభావం తగ్గుతుందని తెలిపారు. అంగన్వాడి కేంద్రానికి వచ్చిన బాలింతలు గర్భిణులకు అంగన్వాడి కేంద్రం ద్వారా అందుతున్న ఆహార పదార్థాలు సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.

# యోగ జీవితంలో భాగం కావాలి




**తూప్రాన్, జూన్ 20 (జనం సాక్షి) :** ప్రతిరోజు ఒక గంట చొప్పున యోగా తప్పనిసరి చేయాలని యోగా వలన అనేక వ్యాధులు దూరమవుతాయని గీతా స్కూల్ కరస్పాండెంట్ రామాంజనేయులు తెలిపారు .అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తూప్రాన్ గీతా స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో చేసిన ప్రదర్శన లో పాల్గొన్నారు యోగా వలన మనసుకు ఉల్లాసము ఆరోగ్యంగా ఉంటారని యోగాను జీవితంలో భాగంగా గుర్తించాలని యోగ చేయాలని అన్నారు. నాలుగు వందలకు పైగా విద్యార్థులు యోగా డే, యోగాసనాల ఆకారంలో కూర్చుని యోగా విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి రామాంజనేయులు,చైర్ పర్సన్ పి.ఉష, డైరెక్టర్లు బి.రాఘవేందర్ గౌడ్,నారాయణ గుప్త,ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్,ఇంచార్జి ప్రిన్సిపాల్ రాజేశ్వర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు యోగా డే శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సులు సీజ్




**అల్లాదుర్గం జూన్ 20 (జనంసాక్షి) :** అల్లాదుర్గం మండలంలో సరియైన వాహన పత్రాలు లేని పలు ప్రైవేట్ పాఠశాలల బస్సులను అల్లాదుర్గం పోలీసులు, మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ లు తనిఖీలు నిర్వహించి పలు పాఠశాలలకు చెందిన బస్సులను సోమవారం సీజ్ చేసినట్లు అల్లాదుర్గం ఎస్సై డి.శంకర్ తెలిపారు. బస్సులకు సంబంధించి ఇన్సూరెన్స్, సరియైన ధ్రువపత్రాలను కలిగి ఉండాలని పాఠశాలల యాజమాన్యానికి సూచించినట్లు ఆయన తెలిపారు.

# భూ సమస్యల కొరకే భూ భారతి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 19 (జనం సాక్షి) :** భూ సమస్యల కొరకే భూభారతి ప్రవేశపెట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. భూభారతి రెవెన్యూ సర్వే చివరి రోజు అయిన శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ కృష్ణ, మాగనూర్, తాసిల్దార్ కార్యాలయలలో, మున్సిపాలిటీ లో నిర్వహిస్తున్న స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. జిల్లాలో ప్రతి గ్రామపంచాయతీలలో రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరిగిందని వాటిలో వచ్చిన అప్లికేషన్లను స్వీకరించి కేటగిరీల వారీగా నోటీసులు అందజేసి ఆర్. డి. ఓ. ఎమ్మార్వో స్థాయిలను ఉంటే పరిష్కరించస్తామని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 3500 అప్లికేషన్స్ వచ్చాయని తెలిపారు. గత నెల కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు గ్రామంలో నిర్వహించడం జరిగిందని వచ్చిన అప్లికేషన్లను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. మాగనూర్ తహసీల్దార్ కార్యాలయం లో వచ్చిన అప్లికిషన్స్ లను పరిశీలించారు. మగనూరు లో ఇప్పటివరకు ఎన్ని అప్లికిషన్స్ వచ్చాయని వాటిలో ఎన్ని పరిష్కరించారని తహసీల్దార్ ద్వారా తెలుసుకున్నారు. మండలం లో 264 అప్లికిషన్స్ వచ్చాయని వాటిలో 234 వరకు ఆర్డీవో, తహసీల్దార్ స్థాయిలో ఉన్నవాటిని పరిష్కరించడం జరిగిందని కలెక్టర్‌కు తెలిపారు. పరిష్కరించాబడ్డ వాటిని ఎప్పటికి అప్పుడు ఆన్లైన్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కృష్ణ మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతిలో ఎన్ని ఫిర్యాదులు అందాయి వాటిలో ఎన్ని పరిష్కరింప్పబడ్డాయి వాటి వివరాలను తెలుసుకున్నారు. కృష్ణ మండలంలోని కేజీబీవీ పాఠశాల ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఇప్పటి వరకు ఎంతమంది విద్యార్థులు వచ్చారు అని యస్ఓ ద్వారా తెలుసుకున్నారు. వంట గది ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని పేర్కొన్నారు. ఫుడ్ కమిటీ తప్పనిసరిగా ఉండాలని ఉపాధ్యాయులలో ఒక్కరు భోజనం సమయంలో భోజనానికంటే ముందు భోజనం చేయాలని తప్పనిసరిగా రిజిస్టర్ మెంటైన్ చేయాలన్నారు. నీటి వృదా కాకుండా కుళాయిలను మరమ్మతు చేయాలన్నారు. విద్యార్థులకు వసతి గృహ లలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు.

# సైబర్ నేరాలు పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- ఎస్ఐ మధుకర్ రెడ్డి



**శివ్వంపేట, జూన్ 20 (జనంసాక్షి) :** సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని స్థానిక ఎస్ఐ మధుకర్ రెడ్డి స్పష్టం చేశారు. సైబర్ క్రైమ్ అవగాహన తో కూడిన వాల్ పోస్టర్లను శుక్రవారం ఆయన శివ్వంపేట పోలీస్ స్టేషన్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోస్టర్లను అన్నిటిని మండలంలోని అన్ని గ్రామాలలో ముఖ్యమైన ప్రదేశాలలో సైబర్ అవేర్నెస్ పోస్టర్స్ ను అంటించడం జరిగిందన్నారు. తద్వారా ప్రజలందరూ చైతన్యవంతులు కావాలని ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే 1930 కు కాల్ చేయాలని ఎస్ఐ మండల ప్రజలందరికీ తెలియజేశారు. శుక్రవారం పోలీసు సిబ్బంది పోస్టర్లను, ఆయా గ్రామాల ప్రధాన చౌరస్తాల వద్ద అంటించారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



**చిన్నశంకరంపేట, జూన్ 20 (జనం సాక్షి) :** మండలంలోని మిర్జాపల్లి గ్రామంలో, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు, ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. ఎంపీడీవో దామోదర్, హౌసింగ్ ఏఈ లోకేష్ ,పంచాయతీ కార్యదర్శి నర్సింలుకు, మిర్జాపల్లి మాజీ సర్పంచ్ పోతరాజు జనార్ధన్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో పాటు, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, సంఘని సంజీవులు, నేరెళ్ల శ్రీను ,భాస్కర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ గౌడ్, నీలం సుధాకర్ మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐదు కోట్లతో ఫంక్షన్‌హాల్ నిర్మాణం

- త్వరలో గండిగూడెం ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**అమీన్పూర్, జూన్ 20 (జనం సాక్షి) :** అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని గండిగూడెంలో రూ. ఐదు కోట్ల తో నిర్మించిన ఫంక్షన్ హాల్ ను అతి త్వరలో ప్రారంభించినున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఫంక్షన్ హాల్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫంక్షన్ హాల్ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. హాల్ నిర్మాణం కోసం రూ.రెండు కోట్ల సొంత నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఆధునిక వసతులతో ప్రజలందరికీ ఉపయోగపడేలా దీనిని అభివృద్ధి చేశామన్నారు. సుల్తాన్పూర్, దాయర, వడకపల్లి, జానకంపేట, తదితర గ్రామాల ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో వివాహది శుభకార్యాలు నిర్వహించుకోవచ్చన్నారు. అనంతరం ఫంక్షన్ హాల్



సమీపంలో నిర్మిస్తున్న గ్రామ దేవతల ఆలయాలను పరిశీలించారు. త్వరలోనే విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. అనంతరం సుల్తాన్పూర్ మల్లన్న గుడి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానంద్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు రాజు, సత్యనారాయణ, భాస్కర్ గౌడ్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారం

- టిజి ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి



**సదాశివపేట, జూన్ 20 (జనం సాక్షి) :** భూభారతితో రైతుల సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. శుక్రవారం సదాశివపేట మండలం పెద్దాపురం గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు భూ సమస్యల పరిష్కారానికి కోర్టుల చుట్టూ తిరిగే అవసరం లేదని అన్నారు. ఏళ్ల తరబడి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగిన పరిష్కారం కానీ భూ పంచాయతీలు భూభారతిలో పరిష్కారం దిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వ హయాంలో రైతులు చెప్పులు అరిగేలా తిరిగారని, ధరణితో బిఆర్ఎస్ నాయకులు ఆస్తులు కూడా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా పాలనలో ధరణిని బంగాళాఖాతంలో కలిపామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సరస్వతి,ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మండల పార్టీ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ,పట్టణ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, పెద్దాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు బిక్షపతి గౌడ్, పెద్దాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు బండ అరుణ్ యాదవ్, కొమురయ్య, సందీప్, మోహన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, ఆత్మ కమిటీ డైరెక్టరు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య

**జడ్చర్ల, జూన్ 20 (జనం సాక్షి) :** కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య పిలుపునిచ్చారు. అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం జడ్చర్ల సిడిపిఓ శోభారాణికి సమ్మెనుటీసీను అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారులకు వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని, 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేస్తుంది. అందుకు నిరసనగా చేస్తున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మిక సంఘాలు, కార్మికులు, కర్షకులు, రైతు కూలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు సరోజ, ప్రభావతి, రాజ్యలక్ష్మి, గౌరీ,



మహబూబా బేగం, విజయ, కవిత, జయమ్మ, రాజేశ్వరి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**బిజినేపల్లి, జూన్ 20 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం బిజినపల్లి మండలంలో అల్లీపూర్ గ్రామంలో మంజూరు అయిన 70 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలను పాటించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా తగిన సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇల్లు పేదవాడికి ఉపయోగ పడేలా ఒక వంట గది, ఒక టాయిలెట్ లతో కలిపి 400-600 చదరపు అడుగుల్లో నిర్మించాలని సూచించారు.

# ప్రజా సమస్యల సాధనకు కృషి చేయాలి

- బీఆర్ఎస్ పట్ల పెరుగుతున్న ఆదరణ
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, జూన్ 20 (జనంసాక్షి) :** సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, అందుకే ప్రజల సమస్యల సాధనకు ముందుండి కృషి చేయాలని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రానున్న స్థానిక ఎన్నికల సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం అమ్మపల్లిలోని మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి గారి స్వగృహంలో పెద్దమందడి మండల స్థాయి బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ 420 మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని దుయ్యబట్టారు. గత ఖరీఫ్ సీజన్ రైతు బంధును పూర్తిగా ఎగ్గొట్టారని, యాసంగిలో మూడెకరాల లోపు భూములకు



మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఎద్దేవా చేశారు. రైతుకున్న మొత్తం భూములకు కాకుండా సగం సగం కమతాలకు పంట పెట్టుబడి సాయం ఇస్తున్నారని, ఈ అంశాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలను కోరారు. ప్రతి ఒక్కరిలో పార్టీ పట్ల నిబద్ధత నాయకుని పట్ల విధేయత ప్రజల పట్ల విశ్వాసంతో పనిచేస్తే విజయం మనదేనని అన్నారు. ప్రతి బి.ఆర్.ఎస్ కుటుంబ సభ్యునికి తాను అండదండగా ఉంటానని నా చుట్టూ తిరగకుండా ప్రజల చుట్టూ తిరగాలని అప్పుడే మీకు,పార్టీకి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. మండల నాయకులు ప్రతి గ్రామము తిరిగి రావాలని ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకొని వారికి బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమనాటి పోరాటస్ఫూర్తి ప్రదర్శిస్తామని కన్నతల్లిలాంటి పార్టీతో అన్ని ప్రయోజనాలు పొంది ద్రోహం చేసిన నాయకులకు గుణపాఠం వచ్చేలా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయదుందుభి మ్రోగిస్తామని ప్రతినబునారు. ఈ సమావేశములో మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు వేణు యాదవ్,మాజీ ఎం.పి.పి మన్నెపు రెడ్డి,నగ్గేంద్రం యాదవ్ మాజీ ప్రజా ప్రతినిధులు,గ్రామ పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీవో 49ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి

- ఈ జీవోతో ఆదివాసీల హక్కులకు భంగం
- ఉపసంహరించుకోకపోతే ఉద్యమం
- సీపీఎం కంద్ర కమిటీ సభ్యులు వీరభద్రం



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 20 (జనం సాక్షి) :** గిరిజన, గిరిజనేతర్ల హక్కులకు భంగం కలిగించే జి ఓ నెంబర్ 49 ని రాష్ట్ర ప్రభుత్వం బే షరతుగా ఉపసంహరించుకోవాలని సిపిఐ( ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అదిలాబాద్, నిర్మల్, మంచిరాల, ఆసిఫాబాద్ జిల్లాల సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లో ఫారెస్ట్ కన్జర్వేషన్ రిజర్వ్ జీవో నెంబర్ 49 విడుదల చేయడంతో ఈ ప్రాంతంలో ,339 గ్రామాల గిరిజన, గిరిజనేతర ప్రజలను వారి గ్రామాల నుంచి ఖాళీ చేయించి తద్వారా వారి హక్కులను కాలరాసేందుకే ఈ జీవోను రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని అన్నారు. టైగర్ కారిడార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం నుంచి వేలకోట్ల రూపాయలు దండుకోవడం వెనుక ఈ జీవో జారీ ఉద్దేశం ఉందని విమర్శించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం చతిస్గడ్ రాష్ట్రంలో ,4 లక్షల ఎకరాల భూమిని పారిశ్రామిక వేత్త గౌతమ్ ఆదానికి అప్పనంగా కట్టబెట్టారని దుయ్యబట్టారు. అడవి ప్రాంతాల్లోని ఖనిజ సంపద, ఇతర విలువైన మినరల్స్ ను కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చేందుకే ఇలాంటి జీవో లు ప్రభుత్వాలు తీసుకు వస్తున్నాయని, వీటి వెనక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హస్తముందని అన్నారు. జియో నెంబర్ 49 ని తక్షణమే ఉపసంహరించుకోకపోతే గిరిజనులు, గిరిజనేతర ప్రజలతో కలిసి ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారి రవికుమార్, కమిట్ సభ్యులు భూపాల్, ఆశయ, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి కుశన రాజన్న, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి మల్లేష్, మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి, నిర్మల్ జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ తదితరు పాల్గొన్నారు.



## పేద ప్రజల అభివృద్ధే తమ ప్రభుత్వ విధానం

- ఎమ్మెల్సీ దండే విటల్

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జూన్ 20 (జనం సాక్షి) :** పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే తన ప్రభుత్వ ధ్యేయమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విటల్ అన్నారు. శుక్రవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, పేదలకురు. 500 కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా పథక కింద 70 లక్షల మంది రైతులకు రు.9 వేల కోట్లు ఈ జూన్ మాసంలో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విటల్ వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్, యూసఫ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## దుప్పిని అటవీ శాఖ అధికారులకు అప్పగింత



**ఖానాపూర్ జోన్ 20 (జనం సాక్షి) :** పట్టణ పొలిమేరలోని డబల్ బెడ్ రూమ్ పరిసరాలకు వచ్చిన చుక్కల దుప్పిని కుక్కలు తరుముతున్న విషయాన్ని గమనించిన స్థానికులు దుప్పిని కుక్కల బారినుండి రక్షించారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు ఘటన స్థలానికి చేరుకుని చుక్కల దుప్పిని స్వాధీనపరచుకున్నారు. స్థానికులు స్పందించి చుక్కల దుప్పిన ప్రాణాపాయ స్థితి నుండి కాపాడిన డబల్ బెడ్ రూమ్ వాసులకు అటవీశాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

## యువత క్రీడల్లో రాణించాలి

- ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి,జూన్ 20(జనంసాక్షి):** యువత క్రీడల్లో రాణించాలని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.రాయపర్తి మండల కేంద్రంలో పలు యూత్ సంఘాలకు ఆరు క్రికెట్ కిట్లను ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు పంపిణీ చేసిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు అన్ని రంగాల్లో ముందుండాలని అప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహ నాయక్,మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి,మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతకుల రంగా రెడ్డి,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్,మండల పార్టీ అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నాప్, దొంగతనానికి పాల్పడిన ఆరుగురు నిందితుల అరెస్టు

- నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల




**నిర్మల్ బ్యూరో, జూన్ 20 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా మామడ పోలీస్ స్టేషన్ పరిధిలో పొనకల్ గ్రామంలో చోటు చేసుకున్న కిడ్నాప్, హత్యాయత్నం, దొంగతనం కేసును నిర్మల్ పోలీసులు వేగంగా ఛేదించారు. బాధితుడు బిఆర్ ఎస్ నేత చిక్యాల హరీష్ కుమార్ రావును కిడ్నాప్ చేసి, హత్యాయత్నం కు ప్రయత్నించి, బెదిరించి నగదు డిమాండ్ చేయడమే కాకుండా ఇంటిలోకి చొరబడి బంగారం, నగదుతో పాటు వాహనమును దొంగలించిన కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారని జిల్లా ఎస్పి జానకి షర్మిల తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రధాన నిందితుడు షేక్ హైదర్ పొనకల్ గ్రామస్తుడు గతంలో ఇతను బాధితుడైన చిక్యాల హరీష్ రావు వద్ద డ్రైవర్ గా పనిచేసేవాడు, ఇతని ప్రవర్తన నచ్చక 6 నెలలకే పనిలోనుండి తీసివేయడం జరిగింది.దీనితో షేక్ హైదర్ పగ పెంచుకున్నాడు. అతను తన మిత్రుడు బానాల ప్రిన్స్ తో కలిసి ఈ కుట్రను పన్నాడు. వారి ప్రణాళిక మేరకు బానాల ప్రిన్స్ నివాసం తట్టురి రవి, కళకంటి సురేష్ , గూడె కోటేశ్వర రావు, మధుసూదన్ నిందితులుగా ఉన్నారు. కిడ్నాప్‌కు అవసరమైన కత్తులు, తాళ్లు, మాస్కులు, ప్లాస్టర్లు ముందుగానే సిద్ధం చేసుకున్నారని తెలిపారు.15.06.2025 అర్ధరాత్రి సుమారుగా 1:45 గంటలకు, నిందితులు పోనకల్ గ్రామంలోని బాధితుడి ఇంటి పైకప్పు ద్వారా లోపల ప్రవేశించి, అతని చేతులు కాళ్ళు కట్టి, నోరుమూసి బెదిరించారు. బంగారు చైన్, రెండు బంగారు బిళ్ళలు, డైమండ్ ఉంగరం మరియు రూ. 5,000/- నగదును దొంగలించారు. అనంతరం బాధితుడిని అతని కారు ఇన్నోవా లో కిడ్నాప్ చేసి హైదరాబాద్ వైపు తరలించారు.కారులో నిందితులు బాధితుడిని కత్తులతో బెదిరిస్తూ, అతని బంధువులకు ఫోన్లు చేయించి రూ. 3 కోట్లు డిమాండ్ చేశారని తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల , స్పందించి కేసును ఛేదించడం కోసం ప్రత్యేక శ్రద్ధ కనబరచారు ,ఏఎస్పి నిర్మల్ రాజేష్ మీన ఐపిఎస్ నేతృత్వం లో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞాన సహాయం తో చాక చక్యంగా నాలుగు రోజుల్లోనే నిందుతులని పట్టు కోవటం జరిగిందని అన్నారు. ఈ కిడ్నాప్ రాష్ట్రం లో చాలా సంచలనం సృష్టించింది. కిడ్నాప్ ను కేవలం మూడు రోజుల్లో ఛేదించి నిందితులను పట్టుకోవటం జరిగిందని, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలుంటే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేసు ఛేదనలో ఏ.ఎస్పీ నిర్మల్ రాజేష్ మీన ఇన్స్పెక్టర్లు గోవర్ధన్ రెడ్డి, కృష్ణ, సమ్మయ్య, ఎస్ఐలు ప్రదీప్, శ్రీనివాస్, లింబాద్రి, శ్రీకాంత్, అశోక్, తో పాటు టీం లు చాకచక్యంగా పని చేశారు. వీరిని జిల్లా ఎస్పీ జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు.

# యోగా ఆకృతిలో విద్యార్థులు




**పాలకుర్తి, జూన్ 20(జనంసాక్షి) :** ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేం ద్రంలోని స్థానిక సుధా స్కూల్లో విద్యార్థులు శు క్రవారం యోగా ఆకృతిలో కూర్చుని ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రాంగాణంలో యోగా అక్షరాలు అకృతిలో విద్యార్థులు కూర్చుని యోగా ప్రాముఖ్యతను చాటారు. యోగా భారత వారసత్వ సంపద అని దాన్ని ప్రతి ఒక్కరు ఆచరించాలని పాఠశాల నిర్వాహకులు ఈ అకృతి ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాపాక విజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు,

## కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయింది

- స్థానిక సంస్థ ఎన్నికల్లో బీఆర్ఎస్ దే గెలుపు
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**నల్లబెల్లి, జూన్ 20 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకు నమ్మకం పోయిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. నల్లబెల్లి మండల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్ లో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ సారంగపాణి ఆధ్వర్యంలో శు క్రవారం జరిగింది. ఈ సమావేశానికి పెద్ది ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతుందని ఎద్దేవా చేశారు. రామప్ప రంగా చెరువు ప్రాజెక్టుతో నియోగ వర్గాన్ని సస్యశ్యామలం చేశామని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం చెందిందని విమర్శించారు. స్థానిక సంస్థ ఎన్నికల కోసమే ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా వేస్తున్నారని తెలిపారు. మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అంకితభావంతో పనిచేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ద స్వప్న, పిఎసిఎస్ చైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్ రావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మహిళా ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వ ప్రత్యేక పథకాలు

- ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రుణాల మంజూరు...
- డిఆర్డిఓ పిడీ మధుసూదన రాజు...



**మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 20 (జనం సాక్షి):** శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో మండల సమైక్య సమావేశ మందిరంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం 25 పురస్కరించుకొని జిల్లా సహకార శాఖ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల సమైక్య మహిళా సభ్యురాలతో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు హార్టికల్చర్ అధికారి జి జినుగు మరియాన్న హాజరైన సమావేశంలో జిల్లా సహకార అధికారి ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక చేయూతను అందించడం, జ్యూట్ బ్యాగుల తయారీ, గోల్డ్ ప్రెస్ ఆయిల్ తయారీ, బేకరీల నిర్వహణ తదితర ఉత్పత్తుల యొక్క మార్కెటింగ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ప్రస్తుత మార్కెట్ డిమాండ్కు అనుగుణంగా అనుకూలమైనటువంటి ఉత్పత్తులను తయారుచేసి గొప్ప వ్యాపారవేత్తలుగా ఎదిగి దేశ అభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలన్నారు. డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సాధికారిక కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా అనేక పథకాలను ప్రవేశపెడుతుందని అందులో భాగంగానే ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ పంపులను మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులు నిర్వహణ, సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటు చేస్తుందని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మహిళా సంఘాలలో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం మహిళా సంఘాల ద్వారా బ్యాంకు రుణాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకుంటుందని సభ్యులుగా ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు కేసముద్రం మండలం కల్వల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు కుంట కౌసల్య భర్త గుట్టయ్య, ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం కోసం మార్కింగ్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం జిల్లా హార్టికల్చర్ అధికారి జి.మరియన్న ఆయిల్ ఫామ్ హార్టికల్చర్ పంటలపై మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులకూ అవగాహన కల్పించి పంటలు పండించి ఆర్థిక అభివృద్ధికి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ డిపిఎం నళిని ఏపిఏం రాజీవ్ మండల సమైక్య సిబ్బంది అమృత సోఫియా ఉమా వెంకటనారాయణ శ్రీనివాస్ వెంకటరమణ పరుశురాం స్థానిక పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.



## ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఉట్నూర్‌కు తరలించడంపై నిరసన

- తహసీల్దార్‌కు వినతి

**ఖానాపూర్ జూన్ 20 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం పేరుతో మంజూరి అయిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఉట్నూరుకు తరలించడంపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం ఆర్ అండ్ బి విశ్రాంతి భవనం నుండి అఖిలపక్షం ఆధ్వర్యంలో మూతికి నల్ల గుడ్డలు కట్టుకొని అంబేద్కర్ విగ్రహం వద్దకు బైకులపై ర్యాలీగా వెళ్లారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ముందు బైఠాయించి నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దాహంతో కాలరాస్తుందని ఆరోపించారు. విద్యార్థులతో మానవహారం చేపట్టి నిరసన తెలుపుతామని అఖిలపక్షం ప్రకటించడంతో అధికార దాహంతో కాంగ్రెస్ పాలకులు ఆంక్షలు విధించారని అఖిలపక్షం నాయకులు ఆరోపించారు. పట్టణ శివారులోని 110 ఎకరాల స్థలంలో అనుమతులు రాని ప్రభుత్వ కార్యాలయాల కోసం కేటాయించిన భూములను రద్దుచేసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు కేటాయించాలని కోరుతూ తహసిల్దార్ సుజాత కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు ఆకుల శ్రీనివాస్, లక్ష్మణ్ రావు, గంగారావు, నంది రామయ్య, శనిగారపు శ్రావణ్ కుమార్, కొక్కుల ప్రదీప్, కీర్తి మనోజ్, ఉపేందర్, ప్రణయ్, గోగికారి రాజు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే సాధ్యం కానిదేదీ లేదు

- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- ఐఐటిలో ర్యాంకు సాధించిన విద్యార్థినికి ఎస్పీ అభినందన



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** కష్టపడి చదివితే సాధ్యం కానిది ఏది లేదని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు ముఖ్య కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న హొంగార్డు కనక పునరామ్ కుమార్తె కె వైష్ణవి ఐఐటిలో దేశంలోనే 1581 ర్యాంకును సాధించి ఐఐటి ముంబైలో జియో ఫిజిక్స్ కోర్సులో సీటును సాధించిన సందర్భంగా జిల్లా ఎస్పీ వారిని స్వయంగా పోలీసు ముఖ్య కార్యాలయానికి ఆహ్వానించి, శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించి అభినందనలు తెలియజేశారు. జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్ రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, ఎన్ చంద్రశేఖర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేఎంసి లో మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్‌ను ప్రారంభించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ ఎంజీఎం, జూన్ 20(జనంసాక్షి):** కాంగ్రెస్ పాలనలో వరంగల్ వైద్య హబ్ గా రూపుదిద్దుకుంటోందని, అన్ని రకాల సేవలతో ప్రత్యేకంగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. శుక్రవారం కాకతీయ మెడికల్ కళాశాలలో మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్ ను స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ వైద్య విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితమవకుండా.. పరిశోధనలపై దృష్టిసారించేందుకు ఈ యూనిట్ దోహదం చేస్తుందని తెలిపారు. యూనిట్ ద్వారా పరిశోధనలు చేపడితే వైద్యశాస్త్ర పురోగతి మరింత సుసాధ్యం అవుతుందని ఎంపీ అన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులకు ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కేఎంసి ప్రిన్సిపల్ రామ్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆమ్మో పులి..! భయం గుప్పిట్లో ప్రజలు

- పులి కోసం అటవీ శాఖ అధికారుల అన్వేషణ



**మల్హార్, జూన్ 20(జనంసాక్షి) :** భూపాల పల్లి జిల్లా తాడిచర్ల అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచారంతో ప్రజలు భయాం దోళనకు గురవుతు న్నారు. వామ్మో పులి అంటూ జంకుతున్నారు. ఎడ్లపల్లి గ్రామానికి చెందిన గుర్రం రాజయ్య కు చెందిన ఆవు పై పెద్ద పులి దాడి చేయడం సంచలనంగా మారింది. ఆవు ఎప్పటి మాదిరిగానే మేత కోసం అడవికి వెళ్లగా అడవిలో పులి దాడి చేసి ఆవును చంపేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న కొయ్యూరు అటవీ శాఖ అధికారి రాజేశ్వర్ రావు తో కలిసి సిసిఎఫ్ఓ ప్రభాకర్ రెడ్డి, డిఎఫ్ఓ నవీన్ రెడ్డి లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి పులికి పాద ముద్రలు గుర్తించి ఆవు ను చంపింది పులి అని నిర్ధారించారు. పులి ఎటువైపు వెళ్లిందో తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పులి పాద ముద్రలు గుర్తించి జాడ కోసం ట్రాప్ కెమెరాలు అమర్చి అన్వేషణ ప్రారంభించారు. తాడిచర్ల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తుందన్న వార్త ధావనంల వ్యాపించడంతో కొయ్యూరు, రుద్రారం, కిషన్‌రావుపల్లీ, పెద్దతూండ్ల, శాత్రజ్ పల్లె, తాడిచర్ల గ్రామాల ప్రజలు బిక్కుమంటున్న పరిస్థితి నెలకొంది. పులి సంచారంతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. పశువుల కాపరులు, ప్రజలు అటవీ ప్రాంతంలోకి వెల్లవద్దని పులి అనవాలు కనిపిస్తే సమాచారం అందించాలని తెలిపారు.

# సంస్కరణలకు కేరాఫ్ ఖమ్మం ఆర్టీసీ

- ప్రయాణికులకు ఉత్తమ సేవలు
- ఆదాయం పెంపుపై దృష్టి
- ఖమ్మం ఆర్టీసీలో సరిరామ్ మార్క్

**ఖమ్మం, జూన్ 20 (జనం సాక్షి) :** ఖమ్మం రీజియన్ ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు రీజనల్ మేనేజర్ సరిరామ్ తనదైన శైలిలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రయాణికులకు ఉత్తమమైన సేవలను అందించడమే లక్ష్యంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. గత సంవత్సర కాలంలో ఆర్టీసీలో ఆయన పరిపాలన ప్రయాణికులకు సంస్థను మరింత చేరువచేసింది. పదవీబాధ్యతలు చేపట్టిన తర్వాత తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు.

**ఖమ్మం ఆర్ఎంగా వచ్చినరోజునుండి తీసుకున్న కొన్ని నిర్ణయాలు..**

అరుణాచలం నకు జిల్లానుండి ఎక్కువ బస్సులు నడపడం, కార్తీక మాసంలో అత్యధికంగా పంచారామాలు బస్సులు నడపడం, వెనువెంటనే ఉద్యోగుల సంస్కరణలు దృష్టిలో పెట్టుకుని ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్న కండక్టర్, డ్రైవర్ ఉద్యగులకు ఏడీసీ ప్రమోషన్లు ఇవ్వడం, గ్రేడ్ వన్ మరియు 12 ఇయర్స్, 20 ఇయర్స్ ఇంక్రిమెంట్స్ ఇవ్వడం వంటివి గొప్ప నిర్ణయం ఖమ్మం జిల్లాలో ఎన్నడూ రానంత స్థాయిలో తుపాన్ రావడం



వల్ల మన ఆర్టీసీ లోని దాదాపు 100 మంది కుటుంబాలు ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. అట్టి వారికి అండగా నిలబడి ప్రతి కుటుంబానికి పప్పు, బియ్యం, నూనె ఉద్యోగుల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేసి ఎండీ మన్ననలు పొందారు. దసరా, సంక్రాంతి పండగ సందర్భంగా ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించి ప్రజల మనసులను గెలుచుకున్నారు. వెంకటాపురం ఆర్టీసీ బస్టాండ్ ఆస్తిని ప్రైవేట్ వ్యక్తులు కొన్ని సంవత్సరాలుగా స్వాధీన పరుచుకుంటే తనదైన శైలిలో ఎంతో డేర్ స్టెప్ తీసుకుని, అధికారులకు ఆదేశాలు ఇస్తూ వాటిని కూలగొట్టి ఆర్టీసీ ఆస్తిని కాపాడటం లాంటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు హెల్త్ చెకప్ చేయించడం, పాత, కొత్త బస్టాండ్‌లను ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ, తరుచూ ప్రమాదం జరిగే వైరా బస్టాండ్ పాత గేట్లను మూపించడం లాంటి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మధ్య కాలంలో మళ్లీ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి ఏడీసీ ప్రమోషన్లు ఇవ్వడం ఉద్యోగుల్లో చాలా సంతోషం కలిగించింది. ఖమ్మం జిల్లాలో మహాలక్ష్మి పథకాన్ని పటిష్టంగా అమలు చేయడం. తెలంగాణ రాష్ట్రం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా మధిర బస్టాండ్ కి శంకుస్థాపన చేసి, ఉప ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి మన్ననలు పొందారు. ఖమ్మం హైదరాబాద్ రాజధాని నాన్ స్టాప్ సర్వీసులు పెట్టడంతో ప్రయాణికుల ఆదరణ పెరిగింది. హైదరాబాద్ ఎంజీబీఎస్, ఎల్బీనగర్ పాయింట్లను బలోపేతం చేయటం, పేర్ పెయిడ్ ఆదాయం పెంచడం, లక్ష్యాలను సాధించడంలో విజయం సాధించారు. ఇవన్నీ గడిచిన సంవత్సరం లో ఆర్ఎం చేసిన అభివృద్ధికి నిదర్శనం. రాబోయే రోజుల్లో సైతం ఇలానే ఉద్యోగుల కుటంబాల్లో సంతోషాన్ని నింపాలని, తద్వారా మీ కుటుంబం కూడా సుఖ సంతోషాలతో జీవించాలని ఆర్టీసీ కార్మికులు కోరుకుంటున్నారు.

## పైలెట్ ప్రాజెక్ట్ ఇండ్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలి




**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 20 (జనంసాక్షి) :** పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన ఇండ్లకి సంబంధించి గ్రౌండింగ్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో హౌసింగ్ అధికారులతో వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకి సంబంధించి పునాది నిర్మాణం, గోడల నిర్మాణం, స్లాబ్ , ఇల్లు పూర్తిగా నిర్మాణం పూర్తవ్వగానే నాలుగు దశలలో ఎప్పటికప్పుడు ప్రతి వారం హౌసింగ్ ఎఈలు ఫోటోలు తీసి రిపోర్ట్ ను హౌసింగ్ పిడికి పంపిస్తే ప్రతి శనివారం రాష్ట్ర స్థాయి అధికారులకి ఇండ్ల నిర్మాణానికి సంబందించిన చెల్లింపులు కొరకు పంపటం జరుగుతుందని తెలిపారు. ప్రతి సోమవారం లబ్దిదారుల అకౌంట్‌లో అమౌంట్ చెల్లింపులు చేయటం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో ఏమైనా టెక్నీకల్ సమస్యలు, లబ్ధిదారుల పేర్లు, బ్యాంకు అకౌంట్ నెంబర్ లో తప్పులు ఏమైనా ఉంటే ప్రజలకి ఇబ్బంది కలిగించకుండా అధికారులు సరిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి ధర్మారెడ్డి, హౌసింగ్ డిప్యూటీ డిఈ జబ్బార్, హౌసింగ్ ఎఈలు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి

- మంత్రి పొంగిలేటి, ఎంపీ రామ సహాయం, ఎమ్మెల్యే జారే

**చంద్రుగొండ, జూన్ 20 (జనం సాక్షి) :** 10 సంవత్సరాల బీహార్ ఎస్ పార్టీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైతే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఒక్క సంవత్సరం లో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ రవాణా సమాచార శాఖల మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం చంద్రుగొండ అన్నపురెడ్డిపల్లి ములకలపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో ఒక కోటి 70 లక్షల రూపాయలు తో నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, అదే గ్రామంలో 130 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కాగా వాటికి శంకుస్థాపన కార్యక్రమం, సీతయ్య గూడెం వద్ద లో లెవెల్ బ్రిడ్జిని హై లెవెల్ బ్రిడ్జిగా మార్చేందుకు శంకుస్థాపన, సీతయ్య గూడెం వెంగళరావు సాగర్ ప్రాజెక్ట్ అలుగునిర్మాణ పనులను సందర్శించి ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీని తూచా తప్పకుండా అమలు చేస్తూ గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు తెలుసుకునే విధంగా అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తున్నామని ప్రతి పేదవాడికి న్యాయం జరిగేలా ప్రతి పథకాన్ని అందిస్తూ వెళ్తున్నామని తెలిపారు. ఒకపక్క ఇందిరమ్మ ఇల్లు వేగవంతంగా నడుస్తూ ఉండగా మరోపక్క రైతుల ఎకౌంట్ల లో రైతుబంధు డబ్బులు వేస్తూ వడివడిగా ప్రభుత్వం ప్రజలకు



కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ఇది అని తెలియచెప్తున్నామని చెప్పారు. రాష్ట్రం మొత్తంలో మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రూ 500కే గ్యాస్, భూభారతి చట్టం ద్వారా రైతులకు అన్యాయం జరగకుండా తప్పులను సవరిస్తూ వారి భూములకు భరోసా ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ పిఓ రాహుల్, ఆర్డీవో మధు మండలాధికారులు, కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్య నాయక్, నల్లమోతు వెంకటరమణ, అశ్వరావుపేట సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఫజల్ భక్ష్, బొర్రా సురేష్, ధరావత్ రామారావు, సారేపల్లి శేఖర్, గుగులోతు బాబు, గుగులోతు రాములు, కిరణ్ రెడ్డి, బుంగా శీను, సంక శంకర్, కృష్ణవేణి, ఇస్లావత్ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

## సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలి

**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 20 (జనంసాక్షి) :** సాధారణ ప్రసవాలు చేసేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సదరం క్యాంపు నిర్వహించేటప్పుడు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మెరుగైన వసతులు కల్పించి సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజు వచ్చే పేషంట్ల వివరాలు, జ్వరంతో హాస్పిటల్ కు వచ్చే వారికి వైద్య సేవలు అందించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉండాలన్నారు. హస్పటల్ కు వచ్చే వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఎంసీహెచ్ సెంటర్ భవనాన్ని సందర్శించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. డి అడిక్షన్ సెంటర్ కోసం స్థలం సేకరించాలని సూచించారు. అత్యవసర వార్డు, టీబీ యూనిట్ వార్డు, పిడియాట్రిక్ కేర్ వార్డు, డే కేర్ కిమోథెరపీ వార్డు, జ్వరం, కోవిడ్ ఐసోలేషన్ వార్డులు పరిశీలించారు. వైద్యసేవలు, మందులు ఇస్తున్నారా లేదా పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు బ్లడ్ టెస్టుల వివరాలు, రిజిస్టర్లలో నమోదు



పరిశీలించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ లో మందుల లభ్యత గురించి ఆరా తీశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. హాస్పిటల్ లో పారిశుద్ధ్య పనులు ఎప్పటికికప్పుడు చేస్తూ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఆర్ఎంఓ డాక్టర్ వినయ్ ఆనంద్, డాక్టర్ లక్ష్మణ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశ ప్రతిష్టను తాకట్టు పెట్టిన మోడీ

- ఖమ్మం డివిజన్ రాజకీయ శిక్షణా తరగతుల్లో నున్నా నాగేశ్వరరావు

**ఖమ్మం, జూన్ 20 (జనం సాక్షి) :** అమెరికా అహంకారం రోజురోజుకీ పెరుగుతోంది అని, అన్ని దేశాలపై పెత్తనం కోసం ప్రయత్నం చేస్తుంది అని దాని అహంకారానికి సవాల్ విసేరది మాత్రం కేవలం సోషలిస్టు దేశాలు మాత్రమే అని సీపీఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ దేశాలలో కమ్యూనిస్టులు బలపడుతున్నారు అని , క్రమంగా కమ్యూనిస్టు దేశాలు పెరుగుతున్నాయి అని తెలిపారు. ప్రపంచ దేశాలపై అమెరికా తన ఆధిపత్యాన్ని చలాయించాలని చూస్తుంది, ఇరాక్ పై దాడి దాంట్లో భాగం అని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఈరోజు సిపిఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులు జరిగే రాజకీయ శిక్షణా తరగతులు చౌడపు వెంకటేశ్వర్లు సరస్వతి ఫంక్షన్ హాల్ లో రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమైనాయి. ముందుగా జండా ఆవిష్కరణ సిపిఎం సీనియర్ నాయకులు బండారు యాకయ్య జండాను ఆవిష్కరించారు. అనంతరం క్లాసులు ప్రారంభానికి ముందు సభకు సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ అధ్యక్షత వహించారు. మూడు రోజులపాటు జరిగే క్లాసులలో మొదటి రోజు మొదటి క్లాసు సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు రాజకీయ తీర్మానం క్లాసును చెప్పడం జరిగింది. ఈ క్లాసులకు ప్రిన్సిపాల్ గా పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే మీరా వ్యవహరించారు. ప్రపంచంలో ప్రస్తుతం మూడు దేశాలలో యుద్ధం జరుగుతుంది ఒకటి ఇజ్రాయిల్ పాలస్తీనా మీద యుద్ధం చేస్తుంది అని సుమారు గాజాలో ఇప్పటివరకు 55,000 మంది ఆ యుద్ధంలో




చనిపోయారు అయినా కానీ యుద్ధాన్ని ఆపడం లేదు, అని దీనికి పూర్తిగా మద్దతుగా అమెరికా ఇజ్రాయులకు సహకరిస్తుంది ఇజ్రాయిల్ కు ఆయుధాలు అందజేస్తా ఉంది. అని , ఇంకొక దేశం ఇరాన్ పై కూడా ఇజ్రాయిల్ యుద్ధానికి దిగుతుంది అని , అక్కడ ఉన్న సహజ వనరులు చమురు నిల్వలను తన వశపరచుకోవడానికి ప్రయత్నాలు చేస్తుంది అని అన్నారు . ఒకవైపు రష్యా కూడా ఉక్రేయన్పై యుద్ధం చేసింది అని , వీటన్నిటి కూడా అమెరికా ఆయుధాలు పంపిస్తూ సహకరిస్తుంది అని ఆరోపించారు. అమెరికా తన ఆధిపత్యాన్ని ప్రపంచం మీద చలాయించాలని చూస్తుంది. కానీ ఇప్పుడిప్పుడే అమెరికా చుట్టుపక్కల ఉన్న క్యూబా వెనిజులా ఇంకా ఇతర దేశాలు చైనా సోషలిస్టు దేశాలుగా ఏర్పడ్డాయి అని తెలిపారు. చైనా ఇంకా కొద్ది కాలంలో అమెరికా కంటే ముందుగా అభివృద్ధి పథంలోకి వెళు తుంది అని తెలిపారు . అమెరికా అధ్యక్షుడు ట్రంపు అధికారంలోకి వచ్చిన తర్వాత అక్కడ విదేశీ విద్యార్థుల పైన విదేశీయుల మీద అమెరికాలో స్థానం లేదంటూ వాళ్ళని మరీ చేతులకి కాళ్లకు సంఖ్యులు వేసి వాళ్ళ సొంత దేశాలకు బలవంతంగా పంపించు వేస్తుంది దేనిని ప్రపంచ దేశాలు మొత్తం కూడా వ్యతిరేకిస్తున్నాయి అని తెలిపారు. అమెరికా ప్రజలు సుమారు 20 లక్షల వరకు ఆయన చేసే విధానాలపై నిరసన వ్యక్తం చేశారు అని గుర్తు చేశారు. అమెరికా ఇప్పటివరకు 36 లక్షల కోట్ల డాలర్లు అప్పుల్లో కూరుకుపోయి ఉంది అలాగే అమెరికాలో 2 లక్షల కోట్ల డాలర్లు లోటు బడ్జెట్ లో ఉంది అంటే రాబోకాలంలో అమెరికాలో నిరుద్యోగం పేదరికం చాలా విపరీతంగా పెరిగే అవకాశం ఉంది ఇప్పటికైనా ట్రంపు విధానాలు మార్చుకోకుంటే ప్రపంచ దేశాలు మొత్తం కూడా అమెరికాని దెబ్బతీసే క్రమంలో ఉంటాయి అలాగే ఇక్కడ మోడీ ప్రభుత్వం కూడా చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా మతతత్వాన్ని ప్రజల్లో రెచ్చగొట్టి హిందువులకు ముస్లింలకు మధ్య క్రిస్టియన్లకు మధ్య గొడవలు సృష్టించి లాభం పొందాలని చూస్తుంది బిజెపి పార్టీ కాబట్టి రాబోవు కాలంలో మతతత్వాలకు ఘర్షనులకు లోను కాకుండా సిపిఎం పార్టీ వర్గ పోరాటాలు నిర్వహించాలని ఆయన అన్నారు. మధ్యాహ్నం మతం-మతోన్మాదం అనే క్లాస్ ను బోడపట్ల రవీందర్ బోధించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు, సిపిఎం ఖమ్మం జిల్లా నాయకులు ఎంఎ జబ్బర్, దొంగల తిరుపతిరావు, బండారు రమేష్, సిపిఎం ఖమ్మం 3 టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, సిపిఎం ఖమ్మం వన్ టౌన్ కార్యదర్శి షేక్ నాగులు మీరా, సిపిఎం టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, ఖమ్మం అర్బన్ కార్యదర్శి బత్తిని ఉపేందర్, సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజనేపల్లి శ్రీనివాసరావు, పత్తిపాక నాగ సులోచన, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



**నాగర్‌కర్నూల్, జూన్ 20 (జనంసాక్షి) :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం అని ఆసుపత్రులలో శుభ్రత ఔషధాలపై ప్రత్యేక దృష్టి సారించాలి అని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ బిజినపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆస్పత్రిలో ఓపీ రిజిస్టర్, మందుల స్టాక్ను పరిశీలించి వైద్యులతో కలెక్టర్ మాట్లాడారు. సమయానుకూలంగా వైద్యులు, సిబ్బంది విధులకు హాజరు కావాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, వైద్యం కోసం వచ్చిన రోగులను వెంటనే ఆసుపత్రిలో చేర్చుకోని వైద్యం అందించాలని, కేసులు సీరియస్ గా ఉన్నప్పుడు మాత్రమే నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి లేదా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సదుపాయాలను రోగులతో వాడికి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న మందుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నందున ఆసుపత్రిలోని వివిధ విభాగాల ద్వారా పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలోని ఓపి వివరాలు , పేషెంట్స్ కు అందుతున్న వైద్య సేవలు, మందులు నిల్వ, డాక్టర్స్, నర్సుల ఖాళీల వివరాలు డాక్టర్ అడిగి తెలుసుకున్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఈ సందర్భంగా వైద్యులకు సూచించారు.

## బాన్సువాడను విద్య, వైద్య రంగాలలో హబ్‌గా తీర్చిదిద్దుతా..



**నిజామాబాద్, జూన్ 20 (జనంసాక్షి) :** తనకు ప్రాణమైన బాన్సువాడ నియోజకవర్గాన్ని విద్య, వైద్య రంగాలలో హబ్ గా తీర్చిదిద్దుతానని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ లోని తన కార్యాలయంలో బాన్సువాడ నియోజకవర్గం నసరుల్లాబాద్ మండలం దుర్కి గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కళాశాల భవన సముదాయ పనులపై సంబంధిత అధికారులతో, కాంట్రాక్టర్ తో అయన శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను ఉద్దేశించి పోచారం మాట్లాడుతూ 40 కోట్ల రూపాయలతో కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని నసరుల్లాబాద్ మండలం దుర్కి గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కళాశాల భవన సముదాయ పనులను త్వరితగతిన పూర్తి చేసి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ నర్సింగ్ కళాశాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని, బాలికలకు విద్య ఎంతో అవసరమని, విద్యతోనే సామాజికంగా, ఆర్థికంగా మార్పు వస్తుందని అయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ వసంత్ నాయక్, డీఈ మోహన్, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలన మన అందరి సామాజిక బాధ్యత



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 20 (జనంసాక్షి) :** ఈ నెల 26న డ్రగ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగంతో కలిసి జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా ఎస్పి నరసింహా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, తెలంగాణ రాష్ట్ర పోలీస్ యాంటీ నార్కోటిక్ బ్యూరో అధ్వర్యంలో డ్రగ్స్ నివారణ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పౌరులు, యువత, విద్యార్థులు, వివిధ సంఘాల వారు ఈ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఉండాలని కోరారు. డ్రగ్స్, గంజాయి లాంటి వాటి నుండి మన పిల్లలను మనమే కాపాడుకోవాలని, భావితరాలు డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ సైనికుల వలే పాటుపడాలన్నారు. డ్రగ్స్ నిర్మూలన సోల్జర్ గా నమోదు చేసుకోవడానికి సంబంధిత లింక్ ద్వారా ఎవరైనా సోల్జర్ నమోదు చేసుకోవచ్చని అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం జిల్లా పోలీస్ శాఖ అనునిత్యం తనిఖీలు నిర్వహిస్తుందని, డ్రగ్స్ నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి జిల్లా వ్యాప్తంగా పోలీసు ప్రజా భరోసా ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యాసంస్థలు, పని ప్రదేశాలు, ఫ్యాక్టరీలు, జనసముహం ప్రదేశాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన




**భూదాన్ పోచంపల్లి, జూన్ 20 (జనం సాక్షి) :** పోచంపల్లి మినీట్యాంక్ బండ్ సుందరీకరణ పనులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి పట్టణం, మండలంలోని శివారెడ్డి గూడెం, ఇంద్రియాల, పెద్దరావులపల్లి, కప్రాయిపల్లి, జూలూరు గ్రామాలలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పర్యటించారు. మండలంలోని గ్రామాలలో హెచ్ఎండిఏ నిధులు 17కోట్ల రూపాయలతో, పట్టణంలో 7.90 కోట్ల రూపాయలతో, యంపిడీవో కార్యాలయంలో మండలంలోని గ్రామాలకు వివిద అభివృద్ధి కార్యక్రమాలకు హెచ్ఎండిఏ ద్వారా మంజూరైన 9.10 కోట్ల రూపాయల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు, ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో భాస్కర్ గౌడ్, ఆర్ ఐ వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తడక వెంకటేశ్వర్లు, సామ మధుసూదన్ రెడ్డి, తడక రమేష్, పట్టణ అధ్యక్షులు భారత లవ కుమార్, మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గునిగంటి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.




# నర్సరీ ఫీజు కంటే ఇంటి అద్దె చీప్!

ప్రతి దేశంలో ఆరోగ్య సంరక్షణ, రవాణా, అద్దె, ఆహారం, యుటిలిటీల ఖర్చును పరిశీలించి చౌకైన దేశమా? ఖరీదైన దేశమా? అని నిర్ణయిస్తారు. విలియం రస్సెల్ అనే రిసెర్చ్ అనలిస్ట్ 2025లో మూడు చౌకైన ప్రాంతాల వివరాలు వెల్లడించారు. అందులో వియత్నాం ముందు వరుసలో నిలిచింది. వియత్నాం ప్రవాసులు జీవించడానికి అత్యంత చౌకైన దేశంగా ఉందని విలియం రస్సెల్ తెలిపారు. మంచి ఆహారం, స్నేహపూర్వక స్థానికులు, ఆధునిక సౌకర్యాలు, పురాతన సంప్రదాయాలు అన్నీ వియత్నాంలో ఉన్నాయని చెప్పారు. నెలకు సగటున సింగల్‌బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్‌కు 265 పౌండ్ స్టెర్లింగ్(రూ.30 వేలు), మూడు పడక గదుల అపార్ట్‌మెంట్‌కు 589 పౌండ్ స్టెర్లింగ్(రూ.68 వేలు) ఖర్చవుతుందని అన్నారు. వియత్నాంలో మొత్తం జీవన వ్యయం యూకే కంటే 59 శాతం చౌకగా ఉందని తెలిపారు. కార్పొరేట్ స్కూల్స్‌లో ఏటా నర్సరీ ఫీజు రూ.1లక్షపైనే ఉందని కొందరు చెబుతున్న నేపథ్యంలో వియత్నాంలోని ఇంటి అద్దెలు వాటి కంటే చీప్‌గా ఉన్నట్లు తెలుస్తుంది. బొలీవియా ప్రవాసులకు రెండో అత్యంత చౌకైన దేశంగా ఉందని చెప్పారు. రాజధాని లా పాజ్‌లో ఒక పడకగది అపార్ట్‌మెంట్ ధర నెలకు 386 డాలర్లు(రూ.33 వేలు), మూడు పడక గదుల అపార్ట్‌మెంట్ ధర 707 డాలర్లు(రూ.45 వేలు) అని అన్నారు. జార్జియా మూడో చౌకైన గమ్యస్థానంగా ఉందని విలియం చెప్పారు.





# వరుస నష్టాలకు బ్రేక్

## ఎట్టకేలకు భారీ లాభాల్లో సూచీలు.. 25వేల పైకి నిఫ్టీ

**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నా మన సూచీలు రాణించడం గమనార్హం.**

దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ప్రధానంగా బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు కూడా రాణించాయి.

ఈ క్రమంలో సెన్సెక్స్ వెయ్యికి పైగా పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 25,100 మార్కును దాటింది. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.4 లక్షల కోట్లు పెరిగి రూ.446.37 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 81,354.85 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,361.87) ఫ్లాట్‌గా ప్రారంభమైంది. రోజంతా భారీ లాభాల్లో కొనసాగింది. ఇంట్రాడేలో 82,494.49 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1046.30 పాయింట్ల లాభంతో 82,408.17 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 319 పాయింట్లు లాభపడి 25,112.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.59గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ సుజుకీ మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, రిలయన్స్ ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76 డాలర్లు కాగా.. బంగారం ఔన్సు 3372 డాలర్లు వద్ద కొనసాగుతోంది.


**సూచీల పరుగుకు కారణమిదీ..**

ఇటీవల సూచీలు వరుస నష్టాల నేపథ్యంలో ఆకర్షణీయంగా మారాయి. దీంతో కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు దిగినట్లు అనలిస్టులు భావిస్తున్నారు. గడిచిన మూడు సెషన్లలో విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. డాలర్ సూచీ క్షీణించి 98.57 స్థాయి వద్ద ట్రేడవుతుండడమూ మన మార్కెట్‌కు లాభించింది.



# ఇకపై అన్ని టూవీలర్లలో ఏబీఎస్ తప్పనిసరి

రోడ్డు భద్రతను పెంపొందించే నిర్ణయాత్మక చర్యలో భాగంగా 2026 జనవరి 1 నుంచి ఇంజిన్ సామర్థ్యంతో సంబంధం లేకుండా అన్ని కొత్త ద్విచక్ర వాహనాలకు ఏబీఎస్ అమర్చాలని భారత ప్రభుత్వం తెలిపింది. 125 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న వాహనాలకు మాత్రమే ఏబీఎస్ ఉండాలనే ము నుపటి నిబంధనను ఈ నిర్ణయంతో సవరించినట్లయింది. రోడ్డు మరణాల్లో 44 శాతం ద్విచక్ర వాహనాల వల్ల జరుగుతున్నట్లు కొన్ని నివేదికలు చెబుతున్నాయి. ఆకస్మిక బ్రేకింగ్ సమయంలో వీల్ లాక్‌ను నిరోధించే టెక్నాలజీ ఏబీఎస్‌ను ప్రవేశపెట్టడం వల్ల ప్రమాదాలు 45 శాతం వరకు తగ్గుతుందని తెలుపుతున్నాయి.




# బెంగుళూరు బెంగ..

**అడ్వాన్స్‌గా ఆరు నెలల రెంట్.. ఆపై ఎన్నో ఛార్జీలు**

**అద్దెదారులకు చుక్కలు చూపిస్తున్న ఇంటి ఓనర్లు**



బెంగళూరులో కఠినమైన అద్దె విధానాలపై రెడ్డిట్ యూజర్ చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో బెంగళూరు హౌసింగ్ మార్కెట్లో అద్దెదారులను ఇబ్బంది పెట్టేలా ఉన్న నిబంధనల పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అద్దెకు ఉండడం కంటే డబ్బు ఖర్చయినా సొంతంగా ఇల్లు కొనడం బెటర్ అనే ధోరణికి వస్తున్నట్లు చెప్పారు. కొంతకాలంపాటు బెంగళూరు నగరం బయట అద్దెకు ఉన్న ఒక యూజర్ ఇటీవల నగరం లోపలకు మకాం మార్చినట్లు చెప్పారు. తమ కొత్త ఇంటి యజమాని అసంబద్ధమైన డిమాండ్లు పెడుతున్నాడని రాశారు. బెంగళూరులో ఆరు నెలల సెక్యూరిటీ డిపాజిట్ నిబంధనను తప్పుబడుతూ 'మొదట వారు ఆరు నెలల డిపాజిట్, అడ్వాన్స్ రెంట్ తీసుకుంటారు. మీరు ఖాళీ చేయాలనుకున్నప్పుడు ఇంటిని తిరిగి శుభ్రం చేయించేందుకు, కొత్తవారి కోసం మీరు వాడిన వస్తువులను మార్చేందుకు డబ్బు అవసరం అవుతుందని చెప్పి అధిక మెయింటెనెన్స్ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. డిపాజిట్ తిరిగి ఇచ్చే ఉద్దేశం కూడా వారికి లేదు' అని రాసుకొచ్చారు. బెంగళూరు రియల్టీ మార్కెట్‌లో సాధారణంగా అద్దెదారుల నుంచి ఆరు నెలల సెక్యూరిటీ డిపాజిట్‌ను తీసుకుంటున్నారు. ఇది దేశంలోనే అత్యధికం. అందుకే నగరంలో స్వల్పకాలిక నివాసం ఉన్నవారు కూడా సొంతంగా ఫ్లాట్ కొనుగోలు చేసి ఈ దోపిడీ నుంచి బయటపడా లనుకుంటున్నారని రెడ్డిట్ యూజర్ పేర్కొన్నారు. దీనిపై నెటిజన్లు స్పందిస్తున్నారు. 'వారు ఆ డిపాజిట్‌ను ఉపయోగించి ఇంటిని పునరుద్ధరిస్తారు. అది మా డబ్బు. ప్యూర్ టార్చర్' అని ఓ నెటిజన్ కామెంట్ చేశాడు. 'నా మునుపటి ఇంటి యజమాని తన ఇంటి గోడలపై 1-2 చోట్ల పెయింటింగ్ పోయినందుకు మొత్తం పెయింటింగ్ అయ్యే ఖర్చును వసూలు చేశాడు' అని మరో యూజర్ రిప్లై ఇచ్చాడు. ఐటీ హబ్‌గా బెంగళూరు నగరం ఎంత ప్రఖ్యాతి గాంచిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. రియల్ ఎస్టేట్ పరంగా కూడా బెంగళూరుకు ప్రత్యేక స్థానం ఉంది. అయితే కొన్నాళ్లుగా ఇక్కడ రియల్ ఎస్టేట్ డిమాండ్ తగ్గుతూ వస్తోంది. అయినప్పటికీ దక్షిణాదిలో హైదరాబాద్, చెన్నైతో గట్టి పోటీనిస్తోంది. బెంగళూరులో ఐటీకి ఎక్కువ అవకాశాలు ఉన్న నేపథ్యంలో అక్కడికి చదువు కోసం అదే విధంగా ఉద్యోగాల నిమిత్తం పలు ప్రాంతాల నుంచి వెళుతుంటారు. ఇదే సమయంలో అక్కడ రియల్ ఎస్టేట్ డిమాండ్ పెరుగుతూ వెళ్తోంది. ఒక ప్రముఖ ఆంగ్ల మీడియా రిపోర్ట్ ప్రకారం.. ఇటీవల అక్కడ ఇంటి అద్దెలు ఆకాశాన్ని అంటుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడు బెంగళూరు నగరంలో 1%దీప్త్రఎ% అద్దెలు ఏ స్థాయిలో ఉన్నాయో మనం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. బెంగళూరుకు విద్యార్థులు, ఉద్యోగుల తాకిడి ఎక్కువవుతున్న క్రమంలో సమీప ప్రాంతాల్లోని ఇంటి యజమానులు రెంట్లను బీభత్సంగా పెంచుతున్నారట.

## స్వల్పంగా పెరిగిన రాయల్ ఎన్‌ఫీల్డ్ ధరలు!

రాయల్ ఎన్‌ఫీల్డ్ తన ఐకానిక్ బుల్లెట్ 350 సిరీస్ ధరల్లో స్వల్ప మార్పులు ప్రకటించింది. వేరియంట్‌ను అనుసరించి ధరను రూ.2,000 నుంచి రూ.3,000 వరకు పెంచినట్లు తెలిపింది. దాంతో బేస్ వేరియండ్ ధర రూ.1.75 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమై ప్రీమియం మోడల్ ధర రూ.2.18 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉంది. ఈ ధరల పెంపుతో పాటు బుల్లెట్ సిరీస్‌లో అప్‌డేటెడ్ మోడల్ బెటాలియన్ బ్లాక్‌ను ప్రవేశపెట్టింది. బెటాలియన్ బ్లాక్ బేస్ ధర రూ.1.75 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా ఉంది. ఆకట్టుకునే డిజైన్‌తో బ్లాక్ బాడీ, గోల్డెన్ హ్యాండ్ పెయింటెడ్ పిన్ స్ట్రిప్స్, రెట్రో టెయిల్ లైట్, స్కూప్డ్ సింగిల్ సీట్, రియర్ డ్రమ్ బ్రేక్ వంటి ఫీచర్లు ఉన్నాయి.



# 'హర్మూజ్' మూత.. మనపై ప్రభావమెంత?

ఇజ్రాయెల్ - ఇరాన్‌ల మధ్య యుద్ధం ముదిరి పాకాన పడుతోంది. వారం రోజుల పరస్పర క్షిపణి దాడుల తరువాత ఇరుదేశాలిప్పుడు పైచేయి కోసం కొత్త ఎత్తుగడలు పన్నుతున్నాయి. జోక్యం చేసుకోవాలని ఒకవైపు ఇజ్రాయెల్ అమెరికాను రెచ్చగొడుతూంటే.. ఇరాన్ హర్మూజ్ జలసంధిని దిగ్బంధం చేయడం ద్వారా సమస్యను అంతర్జాతీయ చేసే ప్రయత్నాల్లో ఉంది. ఏమిటీ హర్మూజ్ జలసంధి? దాన్ని మూసేస్తే ప్రపంచానికి మరీ ముఖ్యంగా భారత్‌కు ఏమిటి నష్టం? సూయెజ్ కెనాల్... యూరప్ దేశాలను హిందూ మహాసముద్రంతో కలిపే సముద్ర మార్గం. సరుకుల రవాణాకు అత్యంత కీలకం. సూయెజ్ లాంటిదే ఈ హర్మూజ్ జలసంధి కూడా. ఇరాన్, ఒమాన్‌ల మధ్య ఉంటుంది. పర్షియన్ జలసంధిని ఒమాన్ జలసంధితో, అరేబియా సముద్రంతోనూ కలుపుతుంది. సూయెజ్ కెనాల్, హర్మూజ్ జలసంధులు రెండింటి ద్వారా ముడిచమురు, ఎల్‌ఎన్‌జీలు సరఫరా అవుతూంటాయి. మన దేశం సౌదీ అరేబియా, ఖతార్ తదితర మధ్యప్రాచ్య దేశాల నుంచి దిగుమతి చేసుకునే ముడిచమురు, ఎల్‌ఎన్‌జీ గ్యాస్‌లు సూయెజ్‌తోపాటు హర్మూజ్ జలసంధి ద్వారా రవాణా అవుతూంటాయి. ప్రపంచ చమురు రవాణాలో సుమారు తొమ్మిది శాతం సూయెజ్ కెనాల్ ద్వారా జరుగుతుంటే.. అంతకు రెట్టింపు మోతాదు హర్మూజ్ ద్వారా సాగుతూంటుంది. భారీ నౌకలు, ఆయిల్ కంటెయినర్లు ఉన్న నౌకలు వీటిని భారత్‌తోపాటు ఇతర ఆసియా దేశాలకు సరఫరా చేస్తూంటాయి. భారత్ తన చమురు అవసరాల్లో 80 శాతం వరకూ దిగుమతుల ద్వారా పూర్తి చేసుకుంటూ ఉంటుంది. ఇరాక్‌లోని బస్రా నుంచి అత్యధికంగా 20 - 23 శాతం వస్తూంటే.. రష్యా నుంచి వచ్చేది 18 - 20 శాతం వరకూ ఉంటుంది. ఇవి కాకుండా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్, అమెరికా (ఆరేడు శాతం), నైజీరియా, పశ్చిమ ఆఫ్రికా, కువైట్‌ల నుంచి మిగిలిన ముడిచమురు కొనుగోలు చేస్తూంటాం. ద్రవరూప సహజ వాయువు (ఎల్‌ఎన్‌జీ) విషయానికి వస్తే మన దిగుమతుల్లో సగం ఖతార్ నుంచి అందుతూంటే.. అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్, ఆస్ట్రేలియా, రష్యా, మొజాంబీక్‌ల నుంచి మిగిలిన సగం వస్తాయి. 2022 తరువాత అంటే ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలైన తరువాత రష్యా నుంచి ఎల్‌ఎన్‌జీ దిగుమతులు కొంచెం పెరిగాయి. ఇజ్రాయెల్‌పై కోపంతోనో లేక ఆ దేశానికి సర్ది చెప్పగల సామర్థ్యమున్న అమెరికా పట్టించుకోవడం లేదనో ఇరాన్ కనక ఈ జలసంధిని మూసేసిందంటే.. చమురు, గ్యాస్ దిగుమతులపై ఆధారపడ్డ భారత్ లాంటి దేశాలకు చుక్కలు కనిపించడం ఖాయం!. ప్రతి రోజు హర్మూజ్ జలసంధి ద్వారా భారత్‌కు చేరే ముడిచమురే సుమారు 15 లక్షల బ్యారెళ్లు మరి! ఈ రవాణ ఆగిపోయిందంటే.. రోజుకు 10 నుంచి 12 కోట్ల లీటర్ల పెట్రోలు ఉత్పత్తి కాదన్నమాట. కొంచెం అటు ఇటుగా ఇది మన రోజువారీ వినియోగానికి సమానం. చమురు రవాణా నిలిచిపోవడం వల్ల డీజిల్‌తోపాటు అనేక ఇతర పదార్థాల ఉత్పత్తి కూడా నిలిచిపోతుంది. ఈ కొరతను ఎదుర్కొనేందుకు దేశాలు పోటాపోటీగా చమురు కొనుగోళ్లు మొదలుపెడతాయి. తద్వారా డిమాండ్ పెరిగి ఎక్కువ డాలర్లు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. దీంతో రూపాయి విలువ పడిపోతుంది. వస్తువుల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణమూ అదుపు తప్పుతుంది.

# మస్క్ చూపు.. ఫైనాన్షియల్ సెక్టార్ వైపు..



ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన ఎలాన్ మస్క్ ఇప్పుడు ఫైనాన్షియల్ సెక్టార్‌పై కన్నేశారు. ఎలక్ట్రిక్ వాహనాలు, అంతరిక్ష ప్రయాణాలు, సామాజిక మాధ్యమాల్లో తనదైన ముద్ర వేసిన తర్వాత మస్క్ తన ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా ఆర్థిక సేవలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా ఎక్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ ఫీచర్లను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఎక్స్ యూజర్లు ప్లాట్‌ఫామ్ నుంచి బయటకు వెళ్లకుండా షాపింగ్, టిప్పింగ్, మనీ మేనేజ్‌మెంట్.. వంటి మరెన్నో లావాదేవీలను నిర్వహించేందుకు వీలు కల్పించేలా సమగ్ర ఆర్థిక ఎకోసిస్టమ్‌ను రూపొందించమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రణాళికలో భాగంగా ఎక్స్ బ్రాండెడ్ క్రెడిట్, డెబిట్ కార్డులను త్వరలో విడుదల చేయాలని భావిస్తున్నారు. ముందుగా యూఎస్‌లో ఈమేరకు మార్పులు చేయబోతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. క్రమంగా ఈ మార్పులు ప్రపంచవ్యాప్తంగా విస్తరించనున్నట్లు చెప్పాయి. వీసా సంస్థ ఇప్పటికే ఈమేరకు ఎక్స్ ప్లాట్‌ఫామ్ మొదటి చెల్లింపుల భాగస్వామిగా సంతకం చేసింది. ఎక్స్ మనీగా పిలిచే ఈ సేవలో డిజిటల్ వాలెట్, పీర్-టు-పీర్ పేమెంట్ ఫంక్షన్లు ఉంటాయి. వీటి ద్వారా ఎక్స్‌లో వినియోగదారులు కొనుగోళ్లు చేయవచ్చు. వాలెట్‌లో మనీ నిల్వ చేసుకోవచ్చు. 'మీరు ఎక్స్‌లోకి వెళ్లి మీ ఆర్థిక లావాదేవీలన్నింటినీ నిర్వహించగలరు' అని ఎక్స్ సీఈఓ లిండా యాకారినో కేన్స్ లయన్స్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ క్రియేటివిటీలో పేర్కొన్నారు.

## అమెరికాతో 'అణు' చర్చలుండవు

ట్రంప్ ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో అణు స్థావరాల లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. పరస్పర దాడులతో పశ్చిమాసియా రణరంగంగా మారింది. ఈ క్రమంలో ఇరాన్‌పై సైనిక చర్య కు అమెరికా సిద్ధమవుతున్నట్లు ఇటీవల కథనాలు వెలువడ్డాయి. దీనిపై వైట్‌హౌస్ స్పందిస్తూ.. ట్రంప్ ఈ విషయంలో రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటారని పేర్కొంది. టెహ్రాన్‌తో దౌత్యపరమైన పరిష్కారానికే అధ్యక్షుడు సిద్ధంగా ఉన్నారని తెలిపింది.

## ఆంగ్ల భాష వారధిలాంటిది

ప్రతి చిన్నారికి ఇంగ్లీష్ భాషను నేర్పాలన్నారు. ప్రపంచంతో పోటీపడాలంటే ఇండియాకు ఇదో మార్గమని, ఇది ప్రతి పిల్లవాడికి సమాన అవకాశం కల్పిస్తుందన్నారు.

## క్లస్టర్ బాంబుతో ఇజ్రాయెల్ గజగజ

ఇరాన్- ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో పశ్చిమాసియా రణరంగంగా మారింది. యుద్ధం 8వ రోజుకి చేరగా.. తమ భూభాగంలోకి ఏకంగా క్లస్టర్ బాంబులను ఇరాన్ ప్రయోగించిందని ఇజ్రాయెల్ సంచలన ఆరోపణలు దిగింది. అసలు ఈ క్లస్టర్ బాంబు అంటే ఏమిటి? వాటి ప్రమాద తీవ్రత ఎంత?. ఆ బాంబును చూసి ఇజ్రాయెల్ ఎందుకు వణికిపోతోంది? వాటిని నిషేధం నిజంగానే అమల్లో ఉందా?.. క్లస్టర్ బాంబు అనేది ఒక క్షిపణిలా కనిపించినా..



అది గాలిలోనే తెరుచుకుని చిన్న చిన్న పేలుళ్లతో కూడిన సబ్‌మ్యూనిషన్లు అనే మినీ బాంబులను నేల మీదకు వదిలిపెడుతుంది. భూమిని తాకిన వెంటనే అవి పేలిపోతాయి. ఇరాన్ ఇజ్రాయెల్‌పై జరిపిన తాజా దాడిలో.. ఒక మిసైల్ సుమారు 7 కిలోమీటర్ల ఎత్తులో పేలి, దాని నుండి సుమారు 20 చిన్న పేలుడు పదార్థాలు సెంట్రల్ ఇజ్రాయెల్‌లో 8 కిలోమీటర్ల పరిధిలో పడ్డాయని సమాచారం. ఇప్పటి వరకు ఈ యుద్ధంలో ఇలాంటి బాంబులను వాడినట్టు నమోదైన ఇది మొట్టమొదటి కేసు.

**మోస్ట్ డేంజర్:** ఇరాన్‌కు చెందిన ఇతర బాలిస్టిక్ క్షిపణుల కంటే ఈ క్లస్టర్ బాంబు క్షిపణులు భారీ ముప్పును కలిగిస్తాయనేది ఇజ్రాయెల్ వాదన. యుద్ధ తీవ్రతను పెంచేందుకు.. భారీ ముప్పును కలిగించేందుకు.. ఇరాన్ ఈ ఆయుధాలను ఉపయోగిస్తోందని, తమ పౌరులకు హాని కలిగించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తోంది. డ్యామేజ్ ఏంటంటే..: ఇజ్రాయెల్ వార్తా సంస్థ ప్రకారం.. జూన్ 19న జరిగింది ఇదే. క్షిపణుల్లో ఒకటి అజోర్‌లోని మధ్య పట్టణంలో ఓ నివాసాన్ని తాకినట్లు తెలుస్తోంది.

# సన్‌టీవీ ఛైర్మన్‌కు సోదరుడి నోటీసులు



సన్‌టీవీ ఛైర్మన్ కళానిధి మారన్ కుటుంబ వ్యవహారం రచ్చకెక్కింది. ఆయన సోదరుడు దయానిధి మారన్ కళానిధితోపాటు మరో ఏడుగురికి లీగల్ నోటీసులు పంపించడంతో పరిస్థితులు తీవ్రంగా పరిణమించాయి. కళానిధి మారన్ తన వ్యాపార కార్యకలాపాల్లో మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు అందులో పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కళానిధిపై చర్యలు తీసుకోవాలని దయానిది కోరారు. కళానిధి మారన్ భార్య కావేరి మారన్‌కు కూడా నోటీసులు అందాయి. కళానిధి మారన్ సారథ్యం వహిస్తున్న సన్ గ్రూప్ ఆధ్వర్యంలో టెలివిజన్, రేడియో, ప్రింట్, సినిమా, క్రీడా విభాగాల్లో వ్యాపారాలున్నాయి. కళానిధితో సంబంధం ఉన్న కీలక కంపెనీల జాబితా కింది విధంగా ఉంది.

**మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్**

సన్ టీవీ నెట్‌వర్క్ లిమిటెడ్ - 37 టీవీ ఛానళ్లు నిర్వహిస్తోంది. సన్ పిక్చర్స్ - చిత్ర నిర్మాణ సంస్థ. సన్ డైరెక్ట్ - డైరెక్ట్-టు-హోమ్ (డీటీహెచ్) శాటిలైట్ టీవీ సర్వీస్. సన్ డిస్ట్రిబ్యూషన్ సర్వీసెస్ - కంటెంట్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ. కేఎఎల్ పబ్లికేషన్స్ / కుంగుమమ్ పబ్లికేషన్స్ - కుంగుమమ్ తమిళ పత్రికను ప్రచురిస్తుంది. కేఎఎల్ కేబుల్స్ - కేబుల్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్. కేఎఎల్ రేడియో / సౌత్‌ఏషియా ఎఫ్‌ఎమ్ - సూర్యన్ ఎఫ్‌ఎమ్, రెడ్ ఎఫ్‌ఎమ్ వంటి బ్రాండ్ల ద్వారా 69 ఎఫ్‌ఎమ్ రేడియో స్టేషన్లను నిర్వహిస్తుంది.

ప్రింట్ మీడియా: దినకరన్ - ప్రముఖ తమిళ దినపత్రిక.

క్రీడలు: సన్ రైజర్స్ హైదరాబాద్ - ఐపీఎల్ క్రికెట్ ఫ్రాంచైజీ. సన్ రైజర్స్ ఈస్టర్న్ కేప్ - దక్షిణాఫ్రికా టీ20 లీగ్ జట్టు. గతంలోని వెంచర్ స్పైస్ జెట్ - మారన్ 2010 నుంచి 2015 వరకు కేఎఎల్ ఎయిర్ వేస్ ద్వారా మెజారిటీ వాటాను కలిగి ఉన్నారు. ఆర్థిక అనిశ్చితి కారణంగా అందులో నుంచి నిష్క్రమించారు.

# గూగుల్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్.. పాస్‌వర్డ్‌లు లీక్



గూగుల్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్.. వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, గిట్‌హబ్‌లోని డెవలపర్ ఖాతాలు, కొన్ని ప్రభుత్వ పోర్టల్స్‌లోని దాదాపు 16 బిలియన్లకు పైగా పాస్‌వర్డ్‌లు లీక్ అయినట్లు సైబర్ న్యూస్, ఫోర్బ్స్ నివేదికలు తెలిపాయి. ఇంటర్నెట్ చరిత్రలోనే అతిపెద్ద సెక్యూరిటీ లీక్‌ల్లో ఇది ఒకటిగా నిలిచిందని పేర్కొన్నాయి. ఈ లీక్ వల్ల మిలియన్ల మంది వినియోగదారుల వ్యక్తిగత డేటా ప్రమాదంలో ఉందని చెప్పాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా విస్తృతమైన ఫిషింగ్ స్కామ్‌లు, ఐడెంటిటీ థెఫ్ట్, అకౌంట్ హ్యాకింగ్‌కు దారితీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తి చేశాయి. లీక్ అయిన డేటా ఏళ్ల తరబడి ఉన్న పాత సమాచారం మాత్రమే కాదని భద్రతా పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ఇందులో ఎక్కువ భాగం కొత్త డేటా, బాగా వ్యవస్థీకృతమైన సమాచారం ఉందన్నారు. ఈ లీక్‌ల కోసం సైబర్ నేరగాళ్లు ఇన్ఫోస్టీలర్స్ అని పిలువబడే ఒక రకమైన మాల్వేర్‌ను ఉపయోగించి ఉండవచ్చని చెబుతున్నారు. ఈ మాల్వేర్ ప్రోగ్రామ్‌లు యూజర్లకు తెలియకుండానే తమ పరికరాల నుంచి లాగిన్ పాస్‌వర్డ్‌లను దొంగిలించి హ్యాకర్లకు పంపుతాయన్నారు. ఈ సమాచారాన్ని డార్క్ వెబ్ ఫోరమ్‌ల్లో అమ్మకానికి ఉంచుతారని తెలిపారు. లీకైన డేటాలో గూగుల్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నుంచి గిట్‌హబ్‌ల్లోని డెవలపర్ ఖాతాల్లోని సమాచారం ఉందనే అంచానాలున్నాయి. కొన్ని ప్రభుత్వ పోర్టల్స్ లాగిన్ సమాచారం కూడా లీకైందని చెబుతున్నారు. ఈ డేటా అంతా నిర్మాణాత్మకంగా, ఉపయోగించదగినదిగా ఉన్నందున నిపుణులు ఈ లీక్‌ను 'గ్లోబల్ సైబర్ క్రైమ్ కోసం బ్లూప్రింట్' అని పిలుస్తున్నారు. దాదాపు 30 బిగ్ డేటా సెట్లు, ఒక్కొక్కటి మిలియన్ల నుంచి బిలియన్ల లాగిన్ వివరాలు వివరాలను సేకరించాయని, మొత్తం 16 బిలియన్లకు పైగా పాస్‌వర్డ్‌లను దొంగిలించారని భావిస్తున్నారు. దొంగిలించబడిన ఈ డేటాను ఎంత సులభంగా కొనుగోలు చేయవచ్చనే దానిపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పరిమిత సాంకేతిక పరిజ్ఞానం, తక్కువ మొత్తంలో డబ్బు ఉన్నవారు కూడా డార్క్ వెబ్‌లో ఈ పాస్‌వర్ట్‌లను యాక్సెస్ చేసుకోవచ్చని నివేదికలు చెబుతున్నాయి. ఇది రోజువారీ వినియోగదారుల నుంచి పెద్ద కంపెనీల వరకు దాదాపు ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తుంది.

ఇప్పుడు ఏం చేయాలి?: సంప్రదాయ పాస్‌వర్ట్‌ల నుంచి పాస్ కీ వంటి మరింత సురక్షితమైన ఆప్షన్లకు మారాలని గూగుల్ ఇప్పటికే వినియోగదారులకు సూచించింది. లాగిన్ వివరాలు అడిగితే ఎస్ఎంఎస్ లేదా ఈమెయిల్స్ ద్వారా పంపే లింక్‌లను క్లిక్ చేయవద్దని ప్రజలను హెచ్చరించింది. ప్రజలు తమను తాము రక్షించుకోవడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. అన్ని ప్రధాన ఖాతాల్లో పాస్‌వర్డ్‌లను మార్చడం, బలమైన, ప్రత్యేకమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం, టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ (2ఎఫ్ఏ)ను ఆన్ చేయడం ద్వారా భవిష్యత్తులో జరిగే మోసాలను కట్టడి చేయవచ్చు.



## రాక పోకలు ఆగేనా ..

# కొనసాగేనా

## నత్త నడకన పనులు

- ఆగమ్య గోచరంగా ప్రయాణికుల పరిస్థితి
- సుదీర్ఘంగా సాగదీస్తున్న పనులు
- చిన్న పనికి చాలా సమయం
- రవాణాకు మళ్లీ అంతరాయం

**ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి, (జనం సాక్షి) :** ఖమ్మం నగరంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన కేబుల్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మున్నేరు మీద కాల్వొడ్డు నుంచి రూరల్ మండలం వైపుకు రాకపోకలు సాగించేందుకు కొత్త తీగల వంతెన నిర్మిస్తున్నారు. సూర్యాపేట నుంచి అశ్వారావుపేట వెళ్లే జాతీయ రహదారిపై కిలోమీటర్ 57.150 నుంచి 58.400 కి.మీ.వరకు ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. ఇందులో తీగలతో నిర్మించే వంతెన 300 మీటర్లు ఉండ నుంది. 390 మీటర్ల బాక్స్ టైప్ వయాడక్ట్ సూపర్ స్ట్రక్చర్ నిర్మించను న్నారు. దీనితో పాటు బ్రిడ్జికి రెండు వైపులా అప్రోచ్ రోడ్లను నిర్మిస్తారు. ఈపీసీ (ఇంజనీరింగ్, ప్రొకూర్ మెంట్ అండ్ కన్ స్ట్రక్షన్) పద్ధతిలో రూ.180 కోట్లతో దీని పనులు జరుగుతున్నాయి.

బ్రిడ్జి, అప్రోచ్ రోడ్ల కోసం భూసేకరణ చేయడంలో కొంత ఆలస్యం జరగడం తో పనులు లేట్ అయ్యాయి. రోడ్డుకు పక్కన గుడిసెలు, రేకుల ఇండ్లు నిర్మిం చుకున్న వారికి ఇందిరమ్మఇండ్లు కేటాయించి అక్కడి నుంచి తరలించారు. బ్రిడ్జి పనులు వచ్చే ఏడాది మార్చి వరకు పూర్తయ్యేలా ఉన్నాయి.

ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్మాణ పనులు పూర్తి చేసి ఈ యేడాది జనవరి లోనే బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశించినట్లుగా పనుల్లో వేగం కానరావడం లేదు. రోజు రోజు పనులు ఆలస్యం అవుతుండటంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. రూరల్ ప్రజలు, కాల్వొడ్డు ప్రజలు వానకాలంలో రవాణా సమస్యను ఎదుర్కొంటున్నారు. ఆ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వాలు చొరవ చూపలేదు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వంలో కేబుల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయితే ప్రజలకు రవాణా సౌకర్యం ఉంటుందని భావించారు కాని వారి ఆశలు రోజు రోజుకు దూరమవుతున్నాయి.

గత రెండేళ్ల నుంచి వరదలు ఖమ్మం నగరాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. దాంతో కాల్వొడ్డు బ్రిడ్జి వందేళ్ల క్రితంది కావడంతో వరదల సమయంలో ఆ బ్రిడ్జి పై నుంచి రాకపోకలు నిలిపేస్తు న్నారు. మున్నేరు వరదలు తగ్గిన తర్వాత పాత కాజ్ వేపై తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేసి, సమాంతరంగా తీగల వంతెన పనులను కొనసాగిస్తున్నారు.

మళ్లీ అకస్మాత్తుగా వరద ప్రవాహం పెరగితే కాజ్ వే పై నుంచి రాకపోకలు సాగించేందుకు వీలు ఉండదు. అలా జరిగితే మళ్లీ పాత బ్రిడ్జిపై నుంచి రాకపోకలు కొనసాగించా ల్సి వస్తుంది. భారీ వాహనాలు బైపాస్ నుంచి కరుణగిరి బ్రిడ్జి పై నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఆ సమయంలో భారీ ట్రాఫిక్ జామ్ అవుతుంది. స్కూల్ , కాలేజీ లకు వెళ్లే విద్యార్థులతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అనేక ప్రమాదాలు సైతం జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి త్వరతగిన కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.





## శేరిలింగంపల్లి సమగ్ర అభివృద్దే

# తన అంతిమ ధ్యేయం

### రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, జూన్ 20 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్దే తన ప్రధాన ధ్యేయమని, ప్రజల నమ్మకాన్ని పెట్టుబడిగా పెట్టి తాను విజయం సాధించానని... కడవరకు వారి శ్రేయస్సు కోసం పరితపిస్తానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు నియోజకవర్గ శేరిలింగంపల్లి డివిజన్ పరిధి హెచ్ఏఎల్ కాలనీలో 4 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణం పనులకు స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి శుక్రవారం ముఖ్యఅతిథిగా పాల్గొని పలు శంకుస్థాపనలు గావించారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ హెచ్ఏఎల్ కాలనీలో సుదీర్ఘంగా ఉన్న రోడ్ల సమస్య కాలనీతోపాటు కేఎంఆర్ ఎస్టేట్ పారా అమౌంట్ కాలనీలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు శుక్రవారం చేసుకున్న ప్రారంభోత్సవ కార్యక్రమంతో తీరనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మొదటి నుండి శేరిలింగంపల్లి ప్రజలు తనను ఎంతో ఆదరాభిమానాలతో ఆశీర్వదిస్తున్నారని, సొంత కుటుంబ సభ్యునిగా భావిస్తానని, అందుకే ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎన్ని నిధులనైనా తెప్పించి అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తానని అరికెపూడి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న కోట్ల రూపాయల నిధులతో నూతనంగా రోడ్లు, మౌలిక సదుపాయాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ పరిధిలోని ఆయా కాలనీల అభివృద్దే ధ్యేయంగా అనేక కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని, ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని అరికపూడి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని, తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని, ఇందుకోసం పక్కా ప్రణాళికలతో ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోకజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిచేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. రోడ్లుసహా ఇతర అభివృద్ధి పనులను అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాల తో చేపట్టాలని, ఎక్కడా రాజీ పడకూడదని సూచించారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత సుఖవంతమైన మెరుగైన రవాణా సౌకర్యంకొరకు శాయశక్తులా కృషి చేస్తానని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ఆయా కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంలో మాజీ సర్పంచ్ మహేశ్వరం సునీత అరెస్ట్

**రాజేంద్రనగర్, జూన్ 20 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం కేసులో మాజీ సర్పంచ్ మహేశ్వరం సునిత ను శుక్రవారం నార్సింగి పోలీసులు అరెస్ట్ చేశారు. నార్సింగి ఇన్స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన ప్రకారం పుప్పాలగూడ మాజీ సర్పంచ్ కాలంలో తన పదవీ కాలంలో పంచాయతీ నిధులుగా ఉన్న రూ.2,02,30,885 కోట్ల దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలతో రాజేంద్రనగర్ డివిజన్‌కు చెందిన డివిజినల్ పంచాయతీ అధికారి నుండి ఫిర్యాదుతో పంచాయతీ నిధులు పెద్ద మొత్తంలో వేరే దారులుగా మళ్లించబడ్డాయని తెలిపారు. హైదరాబాదు గ్రామ పంచాయతీ ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు దుర్వినియోగం మొత్తంలో రూ.23,68,618 ను తిరిగి చెల్లించినా, ఈ చర్య పబ్లిక్ సర్వెంట్ గా నమ్మకద్రోహం మోసానికి సంబంధించడంతో తెలంగాణ లోకాయుక్త ఆదేశాల మేరకు, క్రైమ్ నెంబర్ 853/2025 లో 409, 420 కింద క్రిమినల్ కేసు నమోదు చేశామని, విచారణలో ట్రిబ్యూనల్ ఉత్తర్వులు, విచారణ నివేదికలు, చలాన్లు బాధితురాలి లిఖిత పత్రాలు వంటి పలు ఆధారాలు లభించాయని పోలీసులు న్యాయ ప్రక్రియలకు అనుగుణంగా ఆమెను అరెస్ట్ చేసి గౌరవనీయ న్యాయస్థానానికి హాజరు పరిచారు.

## పొద్దు తిరుగుడు అమ్మిన రైతుల ఖాతాలో రూ. 3.9 కోట్లు జమ

- ఏకకాలంలో డబ్బులు జమ చేయడంతో హర్షం వ్యక్తం చేసిన రైతులు
- తలకొండపల్లి పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి



**తలకొండపల్లి జూన్ 20(జనంసాక్షి):** తలకొండపల్లి మండలంలోని రైతులు సాగు చేసిన పొద్దుతిరుగుడు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్మిన రైతులకు శుక్రవారం ప్రభుత్వం రూ,3 కోట్ల9 లక్షలు రైతుల ఖాతాలో జమ చేసినట్లు పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి తెలిపారు.313 మంది రైతులు 4248 క్వింటాల్ పొద్దు తిరుగుడు ధాన్యాన్ని అమ్మకాలు చేశారని చెప్పారు.సీఎం రేవంత్ రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు,ఎంపీ మల్లు రవి,ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఒకే దాఫాలో రైతుల ఖాతాల్లో రూ,3 కోట్ల 9 లక్షలు జమ కావడం జరిగిందన్నారు. రైతు బాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి కావడంతోనే ఏకకాలంలో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు.



# ఆమ్మో పులి..!

## భయం గుప్పిట్లో ప్రజలు

### పులి కోసం అటవీ శాఖ అధికారుల అన్వేషణ

**మల్హర్, జూన్ 20(జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లా తాడిచర్ల అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వామ్మో పులి అంటూ జంకుతున్నారు. ఎడ్లపల్లి గ్రామానికి చెందిన గుర్రం రాజయ్య కు చెందిన ఆవు పై పెద్ద పులి దాడి చేయడం సంచలనంగా మారింది. ఆవు ఎప్పటి మాదిరిగానే మేత కోసం అడవికి వెళ్లగా అడవిలో పులి దాడి చేసి ఆవును చంపేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న కొయ్యూరు అటవీ శాఖ అధికారి రాజేశ్వర్ రావు తో కలిసి సిసిఎఫ్ఓ ప్రభాకర్ రెడ్డి, డిఎఫ్ఓ నవీన్ రెడ్డి లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి పులికి పాద ముద్రలు గుర్తించి ఆవు ను చంపింది పులి అని నిర్ధారించారు. పులి ఎటువైపు వెల్లిందో తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పులి పాద ముద్రలు గుర్తించి జాడ కోసం ట్రాప్ కెమెరాలు అమర్చి అన్వేషణ ప్రారంభించారు. తాడిచర్ల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తుందన్న వార్త ధావనంల వ్యాపించడంతో కొయ్యూరు, రుద్రారం, కిషన్రావుపల్లీ, పెద్దతూండ్ల, శాత్రజ్ పల్లె, తాడిచర్ల గ్రామాల ప్రజలు బిక్కుమంటున్న పరిస్థితి నెలకొంది. పులి సంచారంతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. పశువుల కాపరులు, ప్రజలు అటవీ ప్రాంతంలోకి వెల్లవద్దని పులి అనవాలు కనిపిస్తే సమాచారం అందించాలని తెలిపారు.

## ప్రతి ఒక్కరి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్




**మర్పల్లి జూన్ 20 (జనంసాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తామని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల కేంద్రం తోపాటు, పరిధిలోని గ్రామాలకు చెందిన 263 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను, 60 కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం అని, మొదటి విడతలో మంజూరైన ఇండ్లను త్వరగా పూర్తిచేసి గృహప్రవేశాలు నిర్వహించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తామన్నారు. దేశంలో పేదల కోసం కూడు, గుడ్డ, నీడ కల్పించాలనే లక్ష్యంతో నాటి ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ దేశ ప్రజలకు ఎంతో సేవ చేశారనీ, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయడం జరిగిందని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కూడా అదే ఆశయంతో పనిచేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మొత్తం నాలుగు విడతల్లో లబ్దిదారుల బ్యాంకు ఖాతాలోనే డబ్బులు జమ చేయడం జరుగుతుందనీ తెలిపారు. బేస్‌మెంట్ గాని గోడలు గాని శ్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. స్పీకర్ హోదాలో ఉండడంతో మన నియోజకవర్గానికి ప్రత్యేకంగా 7000 ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని , మన నియోజకవర్గంలో స్వంత ఇల్లు లేని పేదలందరికి ఏడాదికి కొంతమందికి చొప్పున అందరికి ఇళ్ళను మంజూరు చేయిస్తామని ఆయన తెలిపారు. ఇండ్ల మంజూరు విషయంలో అర్హులైన పేదల గుర్తించి వారి సొంత ఇంటి కలను నెరవేర్చే విదంగా స్థానిక నాయకులు, అధికారులు కృషి చేయాలనీ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని ఇది పనిచేసే ప్రభుత్వమని ఆయన అన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అధికారం చేపట్టాక మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు అందరు ఆర్ టి సి బస్సులలో ఉచితంగా ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని అదేవిధంగా 500 రూపాయలకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ను అందిస్తున్నామని ఆయన తెలిపారు. వికారాబాద్ జిల్లాలో వైద్య, నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల ఏర్పాటుతోపాటు జాతీయ, రాష్ట్ర రహదారులకు అనుసంధానంగా రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల మేరకు మహిళలకు 2500 రూపాయల చొప్పున అదేవిధంగా కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారాన్ని ఇచ్చిన మాట కట్టుబడి అందజేస్తామని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మోహన్ కృష్ణ, ఎంపిడిఓ రాజ్ మల్లయ్య, తహసిల్దార్ పురుషోత్తం, హౌసింగ్ డి.ఇ.సయ్యద్ సాజిద్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, రాముల యాదవ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ కొండల్ రెడ్డి, సుభాష్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేష్ యాదవ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఫసియోద్దీన్, వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మండల పార్టీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నల్లని మబ్బులతో ఊరిస్తున్న మేఘాలు

### వరుణుడా కరుణించి.. వర్షించు!

**చెన్నారావుపేట, జూన్ 20 (జనం సాక్షి):** ఆశలు ఆకాశంలో గూడు కట్టుకున్నవి.. నీలాకాశాన్ని కమ్మేసిన కరిమేఘాలను చూసి కర్షకుడు ఆశపడ్డాడు. కరుణించే మేఘం కోసం కల్లు వెంట పడ్డాయి.. అంతలోనే ఆశ నీరుగారింది.. మేఘం తరలిపోయింది.. చెన్నారావుపేట మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం వేళలో మేఘాలు దోబూచులాడాయి. అంతేకాక వర్షం పడ్డట్లుగా ఆకాశంలో నల్లని మబ్బులు కమ్ముకున్నాయి. ఆ తరలి వెళ్తున్న మబ్బులను చూసి వర్షం పడుతుందని రైతులు తెగ సంబరపడ్డారు. కానీ కొద్దిసేపటికే మబ్బులు మొత్తం ఎక్కడికి అక్కడ తేరుకున్నాయి. దీంతో రైతుల ఆశలపై కన్నీళ్లు చల్లినట్లు అయింది.



ఆకాశంలో మేఘాలు ఊరిస్తున్నాయే తప్ప వర్షం మాత్రం పడడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



## బోనాల పండుగకు నిధులు కేటాయించండి: ఎమ్మెల్యే

**మల్కాజిగిరి,జూన్ 20 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి మల్కాజిగిరి నియోజకవర్గనికి ఆషాడమాస బోనాల పండుగకు అధిక నిధులు కేటాయించాలని, నూతన దేవాలయాలకు కూడా నిధులు కేటాయించాలని, నియోజకవర్గం లోని పెద్ద దేవాలయాలకు భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనే దేవాలయాల్లో రంగము, పోతురాజుల వీరంగం చేసి దేవాలయాలకు అధిక నిధులు ఇచ్చే విధంగా కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, మేకల రాము యాదవ్, హేమంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## నిధులు కేటాయించినా అభివృద్ధికి నోచుకోని రంగథాముని చెరువు

- సమస్యలపై వినతి పత్రం స్వీకరించి సంబంధిత అధికారులకు ఆదేశించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు





**కూకట్ పల్లి, జూన్ 20(జనంసాక్షి):** కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావుతో కలిసి బాలాజీ నగర్ డివిజన్లోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ కాముని చెరువు సుందరీకరణ పనులను స్వయంగా పరిశీలించి అవసరమైతే హౌసింగ్ బోర్డ్ స్థలాన్ని సేకరించి అత్యంత సుందరీకరణంగా తీర్చిదిద్దాలని, కబ్జా అవుతున్న స్థలాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే బతుకమ్మ కుంటలు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.. అనంతరం రంగదాముని (ఐడియల్) చెరువు వద్ద ఆ ప్రాంతాన్ని అంతటినీ పరిశీలించి ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 19 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి సుందరీకరణ పనులు చేపట్టామని ఇందులో భాగంగానే ఇప్పటికే అత్యంత సుందరంగా కొంత ప్రాంతాన్ని తీర్చిదిద్దామని దాన్ని కూడా కనీసం పట్టించుకున్న పాపాన పోవట్లేదని.. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. అలాగే మిగిలిన అసంపూర్తిగా ఉన్న పనులు ఎందుకు పూర్తి చేయడం లేదని, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని వెంటనే పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు.. అనంతరం వివేక్ నగర్ లోని కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించిన అసోసియేషన్ సభ్యులు, అధికారుల సమీక్ష సమావేశంలో అసోసియేషన్ సభ్యుల అందించిన వినతి పత్రాలు స్వీకరించి వారి సమస్యలను సంబంధిత అధికారులకు అందించారు... శక్తి నగర్, హబీబ్ నగర్, రోడ్ నెంబర్ వన్ వద్ద త్వరలోనే డ్రైనేజ్ సమస్య పూర్తి చేస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. సేవాలాల్ నగర్ లోని సిసి రోడ్డు పనులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ నేపద్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ బాలాజీ నగర్ లో నూతన ధోభీ ఘాట్ కొరకు ప్రణాళికలు సిద్దం చేయాలని, అలాగే వీధిలైట్లు ఒక నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని అన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు ఇచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని నిధులు కొరత ఉంటే తనకు తెలపాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాలు బాబురావు, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, అన్నివిభాగాల అధికారులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం

- కడుపు నొప్పితో దవాఖానలో చేర్పించిన తల్లిదండ్రులు
- అత్యాచారం జరిగినట్లు వైద్యుల నిర్ధారణ
- పోలీసుల అదుపులో నిందితుడు

**జడ్చర్ల, జూన్ 20 (జనం సాక్షి):** మైనర్ బాలికపై ఓ యువకుడు అత్యాచారం చేసిన ఘటన జడ్చర్ల మండల పరిధిలోని ఒక గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జడ్చర్లకు సమీపంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తన ఏడేండ్ల కూతురుతో కలిసి కట్టెలు ఏరుకోవడానికి సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లింది. ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో తల్లితో పాటు సమానంగా నడవలేక ఆ చిన్నారి వెనుకబడి పోయింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువకుడు బాలిక వెనుక నుంచి వచ్చి పొదల్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేసినట్లు సమాచారం. ఆ తర్వాత బాలికను జరిగిన విషయం బయటకు చెబితే చంపేస్తానని భయపెట్టాడనీ, ఇంటికి ఆలస్యంగా వచ్చిన బాలికను తల్లి మందలించినప్పటికీ సమాధానం చెప్పలేదని, తీవ్రమైన కడుపునొప్పితో రెండు రోజుల తర్వాత జరిగిన విషయం చెప్పడంతో శుక్రవారం తల్లిదండ్రులు ఉదయం బాలికను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అత్యాచారం జరిగిందని నిర్ధారించారు. ఈ విషయాన్ని ఆస్పత్రి సిబ్బంది నేరుగా జడ్చర్ల పోలీసులకు తెలిపారు. విషయం జిల్లా ఎస్పీ డి.జానకి కి తెలియడంతో ఆమె జడ్చర్ల పోలీస్ స్టేషన్ చేరుకొని విచారణ చేపట్టారు. మైనర్ బాలికపై అత్యాచారం సంఘటన పట్ల సీరియస్ యాక్షన్ తీసుకోవాలని, నిందితుడి పట్ల చట్టపరమైన చర్యలు కఠినంగా ఉండాలని ఆదేశించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బాలికపై అత్యాచారం జరిగిన సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

# ఖమ్మంలో ట్రా'ఫీజు'



## పైసా ఇస్తే ఫైన్ లేదు.. అడ్డంగా పెట్టుకో

- ఇష్టంగా వాడుకో.. సబ్ మై దేఖ్లుంగా..

*ఖమ్మం ట్రాఫిక్ పోలిసుల వ్యవహారంపై జనంసాక్షి వరుస కథనాలతో ఒక్కొక్కటిగా ట్రాఫిక్ దందాలు బయటికి వస్తున్నాయి. ట్రాఫిక్‌లో జరుగుతు న్న తంతు పోలిస్ శాఖతో పాటుగా పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తమకు తామే బాస్‌గా.. ప్రత్యేక వ్యవస్థగా ట్రాఫిక్ సిబ్బంది భావి స్తుంది. నగరం పెద్దది కావడం అందుకు తగ్గట్టుగా రోడ్ల వ్యవస్థ లేకపోవడంతో ట్రాఫిక్‌లో భారీ వసూళ్ల దందా కొనసాగుతున్నట్లు సమాచా రం. ఇప్పటికే వివాదస్పదంగా వ్యవహరిస్తున్న ఓ సిఐ సాబ్‌కు ఓ బంటు జతయ్యాడు. అతని విధి ట్రాఫిక్‌ని సరిదిద్దే కంటే జేబును సరిజేసుకునేదిగా ఉన్నట్లు సమాచారం. ఏళ్ల తరబడి ట్రాఫిక్ వ్యవస్థలో లేని కొత్త దందాకు తెరలేపి అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నాడు. బదిలి అయినా అతన్ని కొనసాగిస్తున్న వారెవ్వరో పై అధికారులే తెల్చాల్సి ఉంది. ఖమ్మం జిల్లా కేంద్రంలో వసూళ్ల తంతు జరుగుతున్నందున అధికార పార్టీకి తలనొప్పిగా మారే అవకాశం లేకపోలేదు..*

**- ఖమ్మం, (జనంసాక్షి) :**

### బదిలి అయ్యింది... ఆపింది ఎవరు..?

అతనికి బదిలి అయినా ఇక్కడే కొనసాగుతున్నాడు. బదిలి అయినా మరుక్షణమే ఇక్కడి నుంచి వెళ్లి రిపోర్ట్ చేయాల్సిన ఉద్యోగి ఇప్పటి వరకు ఇక్కడి నుంచి కదలడం లేదు. ఒకవేళ మెన్ లేకపోతే ఉన్నత అధికారికి చెప్పి ఇంకొకరిని నియమించుకోవాలి. అలా కాకుండా అతడినే కొనసాగించడం వెనుక ఉన్న మర్మం ఏమిటో తెలియాల్సి ఉంది. అతను విధుల నిర్వర్తించ డానికే ఇక్కడ ఉంటే యూనిఫార్మ్ ధరించి విధుల్లో కొనసాగాలి. ప్రస్తుతం అతను ఎక్కడ విధులు నిర్వర్తించకుండా కేవలం నెలవారి, రోజు వారి, వారం వసూళ్లలకే పరిమితం అయినట్లు సమాచారం. ఇంత బహిరంగంగా వసూళ్లకు తెగపడుతూ ట్రాఫీజ్ వసూలు చేస్తున్న వారి పట్ల ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా వసూళ్ల పర్వం ఈ స్థాయిలో పెరిగిందని ఆందోళన చెందుతున్నారు. ఎవరైన లేదని. కాదని చెబితే తెల్లారి నుంచి ఆ షాపు ముందు మాత్రమే ట్రాఫిక్ విధులు కొనసాగుతాయి. వచ్చి పోయే కస్టమర్ల వాహానాలకు ఇబ్బంది సృష్టించడమే వారి విధిగా మారింది.

### పెద్ద షాపుల ముందు ఇష్టారీతిన ట్రాఫిక్ ...

ఖమ్మం నగరంలోని అనేక షాపింగ్ మాల్స్, పెద్ద పెద్ద షాప్స్ ముందు, పెద్ద కాలేజీల ముందు భారీగా ట్రాఫిక్ జాం అవుతున్నా కాని ఎవ్వరు పట్టించుకునే నాధుడు లేడు. అందరు సాయంకాలం పని నుంచి ఇంటి కెళ్లాల్సిన సమయంలో పైన తెలిపిన వాటి ముందు గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుంది. పని చేసి వచ్చిన ఒత్తిడి కంటే ట్రాఫిక్‌లో నిలబడే ఇబ్బంది అధికంగా ఉంటుంది. ట్రాఫిక్ సమస్యతో నగరం పూర్తిగా ఇబ్బంది పడుతుందని మునిసిపల్ కార్పోరేషన్ అధికారులకు లేఖ రాయాల్సిన అధికారులు రాయకపోవడం వెనుక ఆంతర్యాన్ని బట్టి ఏ స్థాయిలో లాలూచి ఉందో అర్థం చేసుకోవచ్చని రాజకీయా విశ్లేషకులు భావిస్తున్నారు.

### వసూళ్లు కోసమే అతడు

ఖమ్మం నగరంలో ఇబ్బడి ముబ్బడి గా షాపులు వెలిసాయి. ప్రతి ఒక్క షాపు కార్పోరేషన్, మునిసిపాలిటీ నిబంధనలకు తూట్లు పొడిచి నిర్మాణం చేపట్టారు. రాజకీయ పలుకుబడితో కొందరు తమ అక్రమ నిర్మాణాలను కాపాడుకుంటూ వస్తున్నారు. దాన్ని అదునుగా భావించి ట్రాఫిక్ వ్యవస్థలోని ఓ కానిస్టేబుల్‌ను వసూళ్ల కోసం నియమించుకు న్నారు. చిన్న, పెద్దా అనే తేడా లేకుండా అన్ని షాపుల నుంచి ఆ షాపు స్థాయిని బట్టి మామూళ్లతో జేబులు నింపు కుంటున్నారు. వారికి వచ్చే జీతాల కంటే వసూళ్లపై వచ్చే ఆదాయం అధికంగా ఉందని సమాచారం. ఖమ్మం కార్పోరేషన్ లో స్థాయిలో వసూలు చేసిన సొమ్ము ఎవరికి చేరుతుందనేది ప్రశ్నగా మారింది. కింది స్థాయి సిబ్బంది వసూళ్లకు పాల్పడితే సహజంగా పై స్థాయి అధికారులకు వాటాలు దక్కుతాయి మరి ఇక్కడ వసూలు చేసిన వాటిని ఎవరికి పంచుతున్నాడో తెలియాల్సి వుంది.

## పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు

**గణపురం జూన్ 20(జనం సాక్షి):** ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకుఈనెల 23న గణపురం మండల కేంద్రంలో భూపాల పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోనాల రాజమౌళి, ఎంఈఓ ఊరుగొండ ఉప్పలయ్య లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న కట్కూరి అశ్వినీ జ్ఞాపకార్థం వారి తండ్రి కట్కూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాల ల్లో పదవ తరగతి మొదటి రెండవ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ లు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వసనీయత పెంచేందుకే ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని వారు ఈ సందర్భంగా తెలిపారు.

## నకిలీ ఐడీ కార్డులతో ఆర్మీ సెంటర్లోకి

**బొల్లారం :** తిరుమలగిరి మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్(ఎంసీఈఎంఈ) సెంటర్లోకి అక్రమంగా నలుగురు ప్రవేశించిన ఘటన శుక్రవారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరిలోని ఎంసీఈ ఎంఈలోకి ఇద్దరు పురుషులు, బురా ధరించి న ఇద్దరు మహిళలు అక్రమంగా ప్రవేశించి వీడియోలు చిత్రీకరించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న జవాన్లు ఫోటోలు, వీడియోలు తీయడం నిషేధమని వారిని ఆదేశించారు. కాగా నిందితులు మేము ఆర్మీ జవాన్లమే అంటూ ఐడెంటి కార్డులు చూపించారు.

# అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులపై వెంటనే దృష్టి పెట్టండి

### కొత్త స్పెషల్ కమిషనరుకు ఫెడరేషన్ వినతి

**హైదరాబాద్, జూన్ 20 (జనంసాక్షి) :** తెలంగాణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తక్షణం అక్రిడిటేషన్లు ఇవ్వాలనీ, కొత్త ఆరోగ్య విధానాన్ని తీసుకురావాలని కోరింది. శుక్రవారం హైదరాబాద్లోని సమాచార్ భవన్ లో కొత్త స్పెషల్ కమిషనర్గా బాధ్యతలు తీసుకున్న ఐఏఎస్ అధికారి సిహెచ్, ప్రియాంకను ఫెడరేషన్ బృందం కలిసి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించింది. అనంతరం జర్నలిస్టుల సమస్యలపై ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పి. రామచందర్, గుడిగ రఘు, విజయానంద్, తాటికొండ కృష్ణ, కార్యదర్శులు సలీమ, ఈ చంద్రశేఖర్, బి. జగదీష్, దామోదర్, బి. రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు పి. విజయ, నాయకులు పద్మనాభరావు, కె. లలిత తదితరులు స్పెషల్ కమిషనర్తో దాదాపు గంటపాటు చర్చించారు. ఇండ్లస్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, మహిళా జర్నలిస్టుల సమస్యలు, వేజ్ బోర్డు అమలు, ప్రత్యేక రక్షణ చట్టం, రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్ పథకం, మీడియా అకాడమీ శిక్షణా తరగతులు, మీడియా కమిషన్ తదితర అంశాలపై కూలంకషంగా ఫెడరేషన్ అభిప్రాయాలను స్పెషల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా అక్రిడిటేషన్లకు నాలుగోసారి స్టిక్కర్లు వేయబోతున్నారనీ, ఇది సరికాదన్నారు. జర్నలిస్టుల విధుల నిర్వహణకు ఇది ఇబ్బందికరంగా



మారిందన్నారు. ఆరోగ్య సమస్యలతో పాత్రికేయులు అనేక కష్టాలు అనుభవిస్తున్నారనీ, ఉద్యోగుల కోసం కొత్తగా తెచ్చే ఆరోగ్య పథకాన్ని జర్నలిస్టులకూ వర్తింపజేయాలని చెప్పారు. మీడియా అకాడమీ జర్నలిస్టులకు ఇచ్చే శిక్షణాతరగతుల్లో వివక్ష చూపిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఎంతమాత్రం సహించరాదని కోరారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పెన్షన్ పథకాన్ని రిటైరైన జర్నలిస్టులకు తెలంగాణలో కూడా అమలు చేయాలని కోరారు. రాత్రిపూట మహిళా జర్నలిస్టులకు పనిచేసే చోట నుంచి రవాణా సౌకర్యం కల్పించేలా ఆయా సంస్థలపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఉ ద్యోగుల తరహాలోనే జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం అవసరమని ఫెడరేషన్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. మీడియాతోపాటు జర్నలిస్టుల పరిస్థితులను అధ్యయనం చేసి పరిష్కరించేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని స్పెషల్ కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు.

# రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం దరఖాస్తుల ఆహ్వానం

- సివిల్స్ లో ప్రిలిమ్స్ పాసైన తెలంగాణ అభ్యర్థులు అర్హులు
- 23వ తేదీ నుంచి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- మెయిన్స్‌కు ఎంపికైన తొలిసారిగా సింగరేణి కార్మికుల పిల్లలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం
- సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్

**గోదావరిఖని, జనంసాక్షి :** దేశంలోనే ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధమవుతున్న తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక ప్రతిబంధకాలను తొలగించాలనే లక్ష్యంతో సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సూచనతో సింగరేణి కాలరీస్ రూపొందించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ శుక్రవారం పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇటీవల విడుదలై సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందించేందుకు ఈ నెల 23వ తేదీ నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైన సింగరేణి కార్మికుల పిల్లలకు కూడా రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందించనున్నట్లు వెల్లడించారు.



సింగరేణి సామాజిక బాధ్యత నిధులతో గత ఏడాది ప్రారంభించిన ఈ పథకం మంచి ఫలితాన్ని ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో ఈ ఏడాది కూడా మరింత మందికి ప్రోత్సాహం అందించేందుకు దీన్ని కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.గత ఏడాది 140 మంది ప్రిలిమ్స్ పాసైన వారికి సాయం అందిం చగా.. 20 మంది మెయిన్స్ లోనూ ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూలకు ఎంపిక య్యారని, ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారికి మరో లక్ష రూపాయల సాయం కూడా అందించామని, వారిలో ఏడుగురు సివిల్స్ లో సత్తా చాటారని వివరించారు. ఈ ఏడాది కూడా వీలైనంత ఎక్కువ మంది సివిల్స్ లో విజయం సాధించి రాష్ట్రానికి, దేశానికి సేవ చేస్తారన్న విశ్వాసంతో అర్హులైన తెలంగాణ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు సింగరేణి వెబ్ సైట్ www.scclmines.comను సందర్శించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవా లన్నారు. సివిల్స్ మెయిన్స్ పరీక్షకు హాజరవు తున్న అభ్యర్థులకు ఇది ఒక గొప్ప అవకాశమని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# హాకీ క్రీడాకారులకు బొనాంజా

### ఇకపై నెలనెలా రూ. 25 వేలు



భారత హాకీ క్రీడాకారులకు గుడ్‌న్యూస్. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వాళ్ల కోరిక ఫలించనుంది. అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్న ఆటగాళ్లకు ప్రోత్సాహకంగా కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ బంపర్ బొనాంజా ఇవ్వనుంది. జాతీయ క్యాంప్‌నకు ఎంపికైన పురుష, మహిళా ప్లేయర్లకు ప్రతి నెల అదనంగా రూ.25వేలు చెల్లించనుంది. గురువారం జరిగిన మిషన్ ఒలింపిక్ సెల్స్ నెలవారీ సమావేశంలో హాకీ ఇండియా అభ్యర్థనను అంగీకరించిన మంత్రిత్వ శాఖ.. టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం కింద ఈ అలవెన్స్ అందజేస్తామని మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. ఈ స్కీమ్ ద్వారా మొత్తంగా 80 మంది (40 మంది పురుషులు, 40 మంది మహిళా క్రీడాకారులు) లబ్ది పొందనున్నారని హాకీ ఇండియా వెల్లడించింది. హాకీ ప్లేయర్లకు అదనపు భత్యం ఇవ్వాలని హాకీ ఇండియా పలుమార్లు విజ్ఞప్తి చేసింది. ఈ విషయంపై గురువారం జరిగిన మిషన్ ఒలింపిక్ సెల్ సమావేశంలో చర్చ జరిగింది. ఆటగాళ్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నెల నెలా రూ.25 వేలు ఇవ్వాలని నిర్ణయించాం. ఫామ్, ఫిట్‌నెస్.. ఈ రెండు అంశాల ఆధారంగా ఆటగాళ్లను ఎంపిక చేస్తాం అని మంత్రి మాండవీయ వెల్లడించారు. అంతేకాదు ఈ సమావేశంలో కోర్ గ్రూప్ అథ్లెట్లకు ప్రతి నెల రూ.50 వేలు ఇవ్వాలని తీర్మానించామని ఆయన తెలిపారు. హాకీ ఆటగాళ్లకు నెలనెలా రూ.25 వేలు ఇవ్వడం కోసం ప్రభుత్వం రూ.20 లక్షలు ఖర్చు చేయనుంది. క్రికెటర్ల మాదిరిగానే తమకూ సెంట్రల్ కాంట్రాక్ట్ ఇవ్వాలని హాకీ ఆటగాళ్లు ఎప్పటినుంచో కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రిత్వ శాఖ నెల నెలా రూ.25 వేలు ఇవ్వాలని నిర్ణయించడం క్రీడాకారులకు ఎంతగానో ఉపయుక్తం కానుంది. గత కొన్నేళ్లుగా భారత పురుషుల, మహిళల జట్లు అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్నాయి. టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యంతో మెరిసిన హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం.. పారిస్ విశ్వక్రీడల్లోనూ సంచలన ప్రదర్శనతో కంచు మోత మోగించి చరిత్ర సృష్టించింది. అయితే.. ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్‌లో మాత్రం వరుస వైఫల్యాలతో తీవ్రంగా నిరాశపరుస్తోంది.

# 5 బంతుల్లో 4 వికెట్లు..

### తమిళనాడు ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో అద్భుతమైన ఫీట్

క్రికెట్ అంటేనే అనూహ్య మలుపులు, ఉత్కంఠభరితమైన క్షణాలు. అలాంటి ఒక అద్భుత ఘట్టం తమిళనాడు ప్రీమియర్ లీగ్ 2025లో చోటు చేసుకుంది. సేలం వేదికగా జరిగిన ఒక మ్యాచ్‌లో సూర్య ఆనంద్ అనే యువ బౌలర్ తన అద్భుతమైన బౌలింగ్‌తో తన జట్టుకు అసాధారణ విజయాన్ని అందించాడు. చివరి ఓవర్‌లో 5 బంతుల్లో ఏకంగా 4 వికెట్లు పడగొట్టి, హ్యాట్రిక్ సాధించి, నెల్లై రాయల్ కింగ్స్‌ను నివ్వెరపరిచాడు. సీచెమ్ మదురై పాంథర్స్ వర్సెస్ నెల్లై రాయల్ కింగ్స్ మధ్య జరిగిన ఈ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. మదురై పాంథర్స్ బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లై రాయల్ కింగ్స్ విజయం దిశగా సాగుతోంది. చివరి రెండు ఓవర్లలో వారికి కేవలం 11 పరుగులు మాత్రమే అవసరం కాగా, చేతిలో 4 వికెట్లు ఉన్నాయి. నెల్లై విజయం దాదాపు ఖాయం అనిపించింది. అయితే, 19వ ఓవర్‌ను వేయడానికి సూర్య ఆనంద్ వచ్చాడు. అప్పటి వరకు నెల్లై జట్టు క్రీజ్‌లో నిలదొక్కుకున్న సోనూ యాదవ్ (32) ను మొదటి బంతికే అవుట్ చేసి సూర్య ఆనంద్ మదురైకి ఆశలు రేపాడు. తర్వాతి బంతి డాట్ బాల్. ఆ తర్వాత జరిగిన మూడు బంతుల్లో యుధీశ్వరన్ (0), సచిన్ రాఠీ (0), ఇమ్మాన్యుయేల్ చెరియన్ (0) లను వరుసగా అవుట్ చేసి సూర్య ఆనంద్ హ్యాట్రిక్ నమోదు చేయడంతో పాటు మొత్తం 5 బంతుల్లో 4 వికెట్లు పడగొట్టాడు. ఈ అనూహ్య బౌలింగ్‌తో నెల్లై రాయల్ కింగ్స్ 18.5 ఓవర్లలో 158 పరుగులకు ఆలౌట్ అయింది.

# భారీ స్కోర్ దిశగా టీమిండియా



## భారత్-ఇంగ్లాండ్ తొలి టెస్టు

### సాయి సుదర్శన్ అరంగేట్రం, నితీశ్ రెడ్డికి నిరాశ

- జట్టులో నితీష్‌కు దక్కని చోటు
- జట్టులోకి శార్దూల్ ఠాకూర్..
- సాయి సుదర్శన్‌కూ అవకాశం
- ఇంగ్లాండ్‌తో భారత్ తొలి టెస్టు షురూ
- టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మొదటి టెస్టు మ్యాచ్‌లో భారత ఓపెనర్ యశస్వీ జైస్వాల్ అద్భుతమైన శతకంతో (100 నాటౌట్) చెలరేగాడు. పేసర్ బ్రాండన్ కార్సే ఓవర్‌లో వరుసగా రెండు ఫోర్లు, ఆపై సింగిల్‌తో యశస్వీ తన 5వ టెస్టు సెంచరీని 144 బంతుల్లో పూర్తి చేశాడు. ఇతని ఇన్నింగ్స్‌లో 16 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. మరోవైపు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (58 నాటౌట్, 74 బంతుల్లో) కూడా అద్భుతంగా ఆడాడు, తన అత్యంత వేగవంతమైన టెస్టు అర్ధశతకాన్ని (56 బంతుల్లో) నమోదు చేశాడు. ఈ ఇద్దరూ కలిసి మూడో వికెట్‌కు 123 పరుగుల అజేయ భాగస్వామ్యంతో భారత్‌ను బలమైన స్థితిలో నిలిపారు. టీ బ్రేక్ సమయానికి భారత్ 51 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. ఈ మ్యాచ్ లీడ్స్‌లోని హెడింగ్లీలో జరుగుతోంది, ఇక్కడ ఇంగ్లాండ్ టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకుంది. ఈ ప్రదర్శనతో భారత జట్టు ఆండర్సన్-తెందుల్కర్ ట్రోఫీ సిరీస్‌లో బలమైన పునాది వేసింది. జైస్వాల్, గిల్‌లు ఇంగ్లాండ్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు, ముఖ్యంగా బ్రాండన్ కార్సే, బెన్ స్టోక్స్‌లపై దూకుడుగా ఆడారు. మొదటి సెషన్‌లో కేఎల్ రాహుల్ (42) మరియు డెబ్యూ ఆటగాడు సాయి సుదర్శన్ (0) వికెట్లు కోల్పోయినప్పటికీ, జైస్వాల్-గిల్ జోడి రెండో సెషన్‌ను పూర్తిగా ఆధిపత్యం చేసింది.

### నితీశ్ కుమార్ రెడ్డికి నిరాశ

తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డికి ఈ మ్యాచ్‌లో అవకాశం దక్కలేదు. ఆల్‌రౌండర్ కోటాలో నితీశ్‌కు బదులు శార్దూల్ ఠాకూర్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ ఎంచుకుంది. గతేడాది బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో నితీశ్ టెస్టు అరంగేట్రం చేశాడు. 5 మ్యాచ్‌లలో 9 ఇన్నింగ్స్‌లో 37 సగటుతో 298 పరుగులు, అందులో ఒక సెంచరీతో అద్భుత ప్రదర్శన చేశాడు. అయినప్పటికీ, ఈ సిరీస్‌లో మరో 4 టెస్టులు ఉండటంతో, తదుపరి మ్యాచ్‌లలో నితీశ్‌కు అవకాశం దక్కే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు.

### సాయి సుదర్శన్ టెస్టు అరంగేట్రం

ఇటీవల ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన 23 ఏళ్ల యువ ఆటగాడు సాయి సుదర్శన్ ఈ మ్యాచ్‌తో టెస్టు అరంగేట్రం చేశాడు. 2023లో వన్డే, 2024లో టీ20ల్లో అరంగేట్రం చేసిన ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్, ఇప్పుడు టెస్టు ఫార్మాట్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగనున్నాడు. సాయి, ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో 29 మ్యాచ్‌లలో 1957 పరుగులు (సగటు 42.33) సాధించాడు. ఇంగ్లాండ్‌లో సర్రే కౌంటీ క్లబ్‌తో 7 మ్యాచ్‌లు ఆడిన అనుభవం కూడా అతనికి ఉంది, ఇది ఇంగ్లీష్ పిచ్‌లపై అతనికి సహాయపడనుంది. ప్రాక్టీస్ సెషన్‌లో కోచ్ గౌతం గంభీర్ సాయికి పిచ్ స్వభావం, టెక్నిక్‌పై సలహాలు ఇచ్చారు. సాయి పిచ్‌ను పరిశీలించి, ఫిస్ట్ పంప్ చేసిన దృశ్యం వైరల్‌గా మారింది.

### కరుణ్ నాయర్ రీ-ఎంట్రీ

దాదాపు 8 ఏళ్ల తర్వాత కరుణ్ నాయర్ టెస్టు జట్టులోకి తిరిగి వచ్చాడు. చివరిసారి 2017లో టెస్టు ఆడిన కరుణ్, ఈ మ్యాచ్‌లో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు రానున్నాడు. అతని రీ-ఎంట్రీపై కూడా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

## ఇంగ్లాండ్‌లో టెస్టు సిరీస్ నెగ్గడమే అతి పెద్ద విజయం

### టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్



ఐపీఎల్ ట్రోఫీ నెగ్గడం, ఇంగ్లాండ్‌లో సిరీస్ దక్కించుకోవడం రెండింట్లో నీకు ఏది ముఖ్యమని ప్రెస్‌మీట్‌లో అడగ్గా, గిల్ ఒక్క సెకన్ ఆలోచించకుండానే రిప్లై ఇచ్చాడు. 'ఐపీఎల్ ట్రోఫీ కంటే ఇంగ్లాండ్‌లో టెస్టు సిరీస్ నెగ్గడమే అతి పెద్ద విజయం. కెప్టెన్‌గా ఇంగ్లాండ్‌లో జట్టుకు నాయకత్వం వహించే అవకాశం లభించడం చాలా అరుదు. మనం ఉత్తమమైన ప్లేయరైతే రెండు మాడుసార్లు ఈ ఛాన్స్ దక్కొచ్చేమో. కానీ, ఐపీఎల్ ప్రతి ఏడాది వస్తుంటుంది. ట్రోఫీ సాధించడం కోసం ప్రతీ సంవత్సరం ఛాన్స్ ఉంటుంది. కానీ, (సౌతాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లో టెస్టు సిరీస్ సిరీస్ దక్కించుకోవడం నిజంగా అతి పెద్ద విషయం' అని గిల్ రిప్లై ఇచ్చాడు.అలాగే తమ జట్టుపై ఉన్న సందేహాలను కూడా గిల్ సమర్థంగా తిప్పికొట్టాడు. 'టీమ్‌ఇండియాకు నాయకత్వం వహించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ఇక విరాట్ భాయ్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ కోసం కోచ్ గంభీర్ భాయ్‌తో చర్చించాను. సెంకడ్ డౌన్‌లో నేనే బ్యాటింగ్‌కు వస్తా. కెప్టెన్సీ గురించి ఎక్కువగా ఆలోచించి ఒత్తిడిలో పడడం నాకు ఇష్టం లేదు. ఈ సిరీస్‌లో ఉత్తమ బ్యాటర్‌గా నిలవాలని అనుకుంటున్నా. గత ఫలితాలను పెద్దగా పట్టించు కోం. పూర్తి స్థాయిలో బరిలోకి దిగుతాం. మా ఆటతీరుపై అవగాహన రావాలంటే ఆగస్టు దాకా వేచి ఉండండి' అని గిల్ పేర్కొన్నాడు.

### నల్లటి బ్యాండ్లతో బరిలోకి

భారత్, ఇంగ్లాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభమైంది. ఇరు జట్ల మధ్య శుక్రవారం (జూన్ 20)న ప్రారంభమైన మొదటి టెస్టులో టాస్ గెలిచిన ఇంగ్లాండ్, భారత్‌ను ముందుగా బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తొలి మ్యాచ్ లీడ్స్‌లోని చారిత్రాత్మక హెడింగ్లీ మైదానంలో జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో యంగ్ ప్లేయర్ సుదర్శన్ తన టెస్ట్ క్రికెట్‌లోకి అడుగుపెట్టగా, మరో సీనియర్ ప్లేయర్ కరుణ్ నాయర్ కూడా 8 సంవత్సరాల తర్వాత ప్లేయింగ్ ఎలెవన్‌లోకి వచ్చాడు. అయితే ఈ టెస్ట్ మ్యాచ్‌లో, రెండు జట్ల ఆటగాళ్లు నల్లటి చేతి బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి నివాళులు అర్పించడానికి రెండు జట్ల ఆటగాళ్లు నల్లటి బ్యాండ్‌లు ధరించారు. జాతీయ గీతానికి ముందు రెండు జట్లు రెండు నిమిషాల మౌనం పాటించాయి. జూన్ 12న, అహ్మదాబాద్ నుండి లండన్‌కు వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం AI171 టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయింది. ఈ ప్రమాదంలో 270 మందికి పైగా మరణించారు.

# యోగాతో యోగ్యత



## ఎల్బీ స్టేడియం యోగాలో వెంకయ్యనాయుడు

### కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు




**హైదరాబాద్, జూన్20 (జనంసాక్షి) :** యోగా చేస్తే యోగ్యులు అవుతారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తెలిపారు. ఎల్బి స్టేడియంలో జరిగిన యోగా కౌంట్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా వెంకయ్యనాయుడు మాట్లాడారు. మానసిక శక్తులను ఏకం చేసేది యోగా అని ప్రశంసించారు. విశ్వమంతా పరిపూర్ణ ఆరోగ్యంతో, శాంతితో ముందుకు సాగాలన్నదే యోగ దినోత్సవ సంకల్పమని స్పష్టం చేశారు. యోగాకు మతం లేదు జాతి లేదని, యోగా మన జీవన విధానమని తెలియజేశారు. ప్రపంచంలోనే అద్భుత సాహసం ఆపరేషన్ సింధూర్ అని కొనియాడారు. ఒకే భూమి ఒకటే ఆరోగ్యం కోసం యోగ అని అనే సంకల్పంతో ఈ ఏడాది యోగ దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందని, మనమంతా ఇదే సంకల్పాన్ని తీసుకుని వసుధైవ కుటుంబ భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది యోగ మార్గాన్ని సాధన చేస్తూ ముందుకు సాగుతున్నారని, విదేశీయులంతా యోగ మార్గాన్ని తలకెత్తుకుని ముందుకు సాగుతుంటే, ఈ నేల మీద పుట్టిన మనం యోగ మార్గానికి ఇంకెంత గౌరవం ఇవ్వాలో ఒక్కసారి ఆలోచించుకోవాలని, యోగ మార్గాన్ని అనుసరించవలసిందిగా వెంకయ్యనాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, వెంకయ్యనాయుడు..కిషన్‌రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, సినీనటులు కుష్బూ, మీనాక్షి చౌదరి హాజరయ్యారు.

# ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం

## మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

### ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల అందజేత



**సిద్దిపేట, జూన్20 (జనంసాక్షి) :** పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ప్రతి ఇందిరమ్మ ఇంటికి తమ ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తోందని అన్నారు. సిద్దిపేట జిల్లాకు 12వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని చెప్పారు. ప్రతి గ్రామంలోని పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తామని అన్నారు. పేదరికాన్ని దూరం చేయాలని ఇందిరాగాంధీ గరీబ్ హటావో పేరుతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ పేదలకు మంచి చేయాలనే 200యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తున్నారని పేర్కొన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండా భూదేవి గార్డెలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మీడియాతో మాట్లాడుతూ.. సిద్దిపేటలో అడ్వాన్స్ టెక్నాలజీతో స్కిల్ డెవలప్‌మెంట్‌ని ప్రారంభిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే హామీలు నెరవేరుస్తారా అని ప్రజల్లో అనుమానం ఉండేదని చెప్పారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక రూ. 8లక్షల కోట్లు అప్పు అయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కంకణం కట్టుకుందని మంత్రి వివేక్ తెలిపారు. మ ప్రభుత్వం పేదలను ఆదుకోవాలని ఆలోచన చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. మహిళలకు రూ.500లకు గ్యాస్ సిలిండర్, ఉచిత బస్ సౌకర్యం అందిస్తున్నామని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దేశంలో ఎక్కడ లేని విధంగా రైతులకు రూ. 23వేల కోట్ల రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. సుమారు రూ.10వేల కోట్ల రైతు భరోసా నిధులను సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల విడుదల చేశారని తెలిపారు. రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని చెప్పారు. సన్నవడ్లు పండించే రైతులకు ప్రభుత్వం రూ.500ల బోనస్ ఇస్తోందని వెల్లడించారు మంత్రి వివేక్ వెంకటస్వామి. అంతకుముందు గజ్వేల్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మంత్రి వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జిల్లా కలెక్టర్ హేమావతి పాల్గొన్నారు. గజ్వేల్‌లో 3వేల డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఎన్నికలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. గృహజ్యోతి కింద 79 వేల మంది లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ అందిస్తున్నామని చెప్పారు మంత్రి వివేక్ వెంకటస్వామి. పేదలకు రేషన్‌కార్డ్ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. 600 గజాల స్థలంలో ప్రతి నిరుపేద ఇండ్లు కట్టుకునేందుకు తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. విద్య, వైద్యం, ఇండ్లు, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. 600 గజాల కంటే ఎక్కువ ఇంటి నిర్మాణం ఉండేలా లబ్ధిదారులు చూసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.



# విద్యుత్‌శాఖ సిబ్బంది సంక్షేమమే ధ్యేయం

### ట్రాన్స్‌కోలో కారుణ్య నియామకాలు

### ఉత్తర్వులు అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** విద్యుత్ శాఖ సిబ్బంది సంక్షేమమే ప్రజా ప్రభుత్వ విధానం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రజాభవన్‌లో ట్రాన్స్‌కోలోని 18 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఇందులో ఏడుగురు రెగ్యులర్ ఉద్యోగులు కాగా, ఆర్టిజెన్స్ 11మంది ఉన్నారు. విధుల్లో ప్రాణాలు కోల్పోయిన ట్రాన్స్‌కో ఉద్యోగుల తో పాటు ఆర్టిజన్స్ కూడా కారుణ్య నియామకాల్లో అవకాశాలు కల్పిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆర్టిజన్స్ ను కూడా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. కారుణ్య నియామక పత్రాలు పొందిన ఉద్యోగులు సంస్థ అభ్యున్నతికి తోడ్పడాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీఎం డి కృష్ణ భాస్కర్, డైరెక్టర్లు సూర్య ప్రకాష్, బి. నర్సింగరావు, జీ నరసింహారావు, ఎఫ్ఏ, సీసీఏ గుప్తా, జాయింట్ సెక్రెటరీ ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

# పోలవరంతో భద్రాచలం మునక

## రాముడు తెలంగాణలో.. భూములు ఏపీలో..

### ఎపిలో కలిపిన ఐదూళ్లు వెంటనే వెనక్కి ఇచ్చేయాలి

### తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత డిమాండ్



**హైదరాబాద్, జూన్20 (జనంసాక్షి) :** పోలవరం నిర్మాణంతో భద్రాచలం పూర్తిగా మునిగిపోవడం ఖాయమని, అందుకే తాము పోలవరం ప్రాజెక్టు నిర్వహణ అంశాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే వ్యతిరేకించామని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అప్పట్లో తాము సుప్రీంకోర్టుకు వెళ్లి ఆపే ప్రయత్నం చేసినా ప్రాజెక్టు ఆగలేదని తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణకు ముంపుపై శుక్రవారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన గ్రామాల్లో ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలని, పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాక గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆమె అన్నారు. పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ఏర్పడిందన్నారు. ఏపీలో కలిపిన పురుషోత్తపట్నంలో భద్రాచలం రాములవారి మాన్యం వెయ్యి ఎకరాలు ఉందని, ఆ వెయ్యి ఎకరాల దేవుడి మాన్యం ఆంధ్రాకు పోయిందన్నారు. దేవుడేమో తెలంగాణలో ఉన్నాడని.. అక్కడ పట్టించుకునే పరిస్థితి లేక దేవుడి మాన్యం అన్యాక్రాంత మవుతోందన్నారు. దేవుడి మాన్యాన్ని పరిరక్షించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. పోలవరం ముంపుపై సంయుక్త సర్వే నిర్వహించాలని కవిత అన్నారు. ఈ నెల 25న ప్రగతి ఎజెండా పేరిట ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్ గడ్ సీఎంలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న సమావేశంలో ఈ అంశాన్ని చర్చించాలని, ఐదు గ్రామాలను వెనక్కి తీసుకొచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి చేయాలని కవిత అన్నారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో కూడా ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. లేదంటే ఎప్పుడైనా భారీ వరదలు వస్తే అన్ని గ్రామాలు మునిగిపోతాయన్నారు. అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టును ఆపే ప్రయత్నంలో తెలంగాణ జాగృతి సుప్రీం కోర్టును ఆశ్రయించిందన్నారు. 2014లో ప్రధాని మోదీ మొట్ట మొదటి క్యాబినెట్ సమావేశంలో ఏడు మండలాలను ఏపీలో కలపడానికి ఆర్డినెన్స్‌ను ఆమోదించి తెలంగాణకు అన్యాయం చేశారని విమర్శించారు. ఆ ఏడు మండలాలను అన్యాయంగా ఏపీలో కలిపారన్నారు. లోయర్ సిలేరు విద్యుత్తు ప్రాజెక్టును కూడా ఏపీకి అప్పజెప్పారని... బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసి చంద్రబాబు ఏడు మండలాలను తీసుకున్నారని విమర్శించారు. పోలవరం స్పిల్ వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని, భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు సామర్థ్యం 36లక్షల క్యూసెక్కుల నుంచి 50లక్షల క్యూసెక్కులకు పెంచుకుంటూ పోవడంతో ముంపు పెరిగిపోతోంది. మానవీయ కోణంలో ఆలోచించి పరిష్కారం చేయాల్సిన అవసరముంది. పురుషోత్తమపట్నం, గుండాల, ఎటపాక, కన్నాయిగూడెం, పిచుకులపాడు గ్రామపంచాయతీ లను వెనక్కి ఇవ్వాలి. ఈ నెల 25న ప్రగతి ఎజెండా పేరిట 4 రాష్ట్రాల సీఎంలతో ప్రధానమంత్రి మోదీ నిర్వహిస్తున్న సమావేశంలో ఆ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణకు ఇస్తున్నట్లు ప్రకటించాలని కవిత డిమాండ్ చేశారు.




# వరంగల్ కోర్టుకు బాబు బెదిరింపు

## ముమ్మర తనిఖీలు చేపట్టిన పోలీసులు

**హనుమకొండ, జూన్ 20 (జనంసాక్షి) :** వరంగల్ కోర్ట్ ప్రాంగణంలో బాంబు పెట్టినట్లు ఓ ఆగంతకుడు పోలీసులకు ఫోన్ చేసి బెదిరించాడు. ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. డయల్100 నెంబర్‌కి ఫోన్ చేసి చెప్పడంతో పోలీసులు వెంటనే అప్రమత్తం అయ్యారు. కోర్టు ప్రాంగణంలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో కోర్టు ప్రాంగణంలో పెట్టిన ఆరు డిటోనేటర్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సకాలంలో పోలీసుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. కోర్ట్ పరిసరా ప్రాంతాలను పోలీసులు బాంబ్ స్క్వాడ్ సహాయంతో పరిశీలిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రజలను కోర్టు ప్రాంగణం నుంచి దూరంగా పంపించి వేశారు. ఫోన్ ఎక్కడ నుంచి వచ్చింది.. ఎవరు చేశారనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. కోర్టు ప్రాంగణం మొత్తం ఆధీనంలోకి తీసుకుని జల్లెడ పట్టారు. ఈ క్రమంలోనే కోర్టు ఆవరణలో భద్రపరిచిన 6 డిటోనేటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ డిటోనేటర్లను ఆత్మకూరుకు చెందిన ఓ కేసు విషయంలో గతంలో స్వాధీనం చేసుకున్నవిగా గుర్తించారు. డిటోనేటర్లకు సంబంధించిన కేసు ఎప్పుడు కొట్టివేసినట్లు పోలీసులు వెల్లడించారు. తాజా బాంబ్ బెదిరింపు కాల్‌కు ఈ డిటోనేటర్లకు ఎలాంటి సంబంధం లేదని పోలీసులు, కోర్టు సిబ్బంది పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బెదిరింపు కాల్ చేసిన అజ్ఞాత వ్యక్తి కోసం గాలిస్తున్నారు. బాంబ్ బెదిరింపు కాల్‌తో జిల్లా కోర్టుకు వచ్చిన వారు భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన చోటుచేసుకోకుండా కోర్టు వద్ద భారీగా పోలీసులను మోహరించారు.

# పారామౌంట్ కాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

### వీసా గడువు ముగిసినా ఇక్కడే తిష్టవేసిన విదేశీయులు

### 18మంది అక్రమంగా ఉంటున్నట్లు గుర్తించిన పోలీసులు

### వారిని డిపోర్ట్ చేస్తామని ప్రకటించిన సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ



**హైదరాబాద్, జూన్20 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని పారామౌంట్ కాలనీలో శుక్రవారం తెల్లవారు జామున పెద్దఎత్తున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించడంతో ఉద్రిక్తత నెలకొంది. అక్రమ చట్టవ్యతిరేక కార్యకలాపాలు, విదేశీయుల అక్రమ నివాసాలపై ఆధారంగా పోలీసులు ఈ ఆపరేషన్ చేపట్టారు. సుమారు 150 మంది పోలీసులు తెల్లవారుజాము 3 గంటల సమయంలో ఈ కాలనీని చుట్టుముట్టి సోదాలు ప్రారంభించారు. లా అండ్ ఆర్డర్, టాస్క్ ఫోర్స్, హెచ్ఎన్‌యూ, ఏఆర్ విభాగాలకు చెందిన పోలీసులు ఈ తనిఖీలలో పాల్గొన్నారు. ఈ సెర్చ్‌లో నైజీరియా, ఇథియోపియా, కెన్యా, సోమాలియా దేశాలకు చెందిన వలసదారులు పెద్దఎత్తున ఉన్నట్లు గుర్తించారు. వీరిలో చాలామంది భారతదేశం వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా నివసిస్తూ ఇల్లీగల్ కార్యకలాపాల్లో భాగం అవుతున్నట్లు పోలీసుల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తనిఖీల్లో మొత్తం 18 మంది విదేశీయులు వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా జీవిస్తున్నట్లు గుర్తించారు. వారిని గుర్తించిన పోలీసులు త్వరలోనే డిపోర్ట్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సోదాల సందర్భంగా డాక్యుమెంట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 50కి పైగా బైకులు, 5 కార్లను పోలీసులు సీజ్ చేశారు. అంతేకాక, గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తున్న బెల్ట్ షాపులు, హుక్కా సెంటర్లను గుర్తించి పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లు, గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. మద్యం అక్రమ నిల్వలు బయటపడటంతో, స్థానికంగా నడుస్తున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలపై మరింత దృష్టి పెట్టనుని పోలీసులు అన్నారు. ఈ సందర్భంగా సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ మాట్లాడుతూ, 'పారా మౌంట్ కాలనీలో కార్డన్ సెర్చ్‌తో పాటు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించాం. వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉండిపోయిన విదేశీయులను గుర్తించాం. వారి వివరాలు సేకరించి, త్వరలోనే డిపోర్ట్ చేయనున్నాం. మాదకద్రవ్యాల విషయంలో మేము చాలా సీరియస్‌గా ఉన్నాం. ఈ సెర్చ్‌లో డ్రగ్స్ లభించలేదు. కానీ భవిష్యత్‌లో ఇలాంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. ఈ కార్డన్ సెర్చ్‌తో నగరంలోని ఇతర అనుమానస్పద ప్రాంతాల్లో కూడా ఇలాంటి తనిఖీలు జరపనున్నట్లు పోలీసులు సంకేతాలు ఇస్తున్నారు. విదేశీయుల పేరుతో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో పట్టు సాధించేందుకు ఇది ఒక ముందడుగుగా మారింది.

# గ్రూప్-1పై న్యాయపోరాటం చేయండి

## మీ సమస్య పరిష్కారమయ్యేదాకా అండగా ఉంటా

### గ్రూప్ 1 అభ్యర్థులకు హామీనిచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** గ్రూప్ 1 పరీక్షల్లో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఆందోళనలు నిర్వహిస్తున్న అభ్యర్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అండగా నిలిచారు. గ్రూప్ 1 అభ్యర్థులు చేస్తున్న న్యాయ పోరాటానికి మద్దతిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై న్యాయ పోరాటం చేయాలని సూచించారు. న్యాయ పోరాటంలో పూర్తిగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం పలువురు గ్రూప్ 1 అభ్యర్థులు కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయానికి విచ్చేసి కేంద్ర మంత్రిని కలిశారు. గ్రూప్ 1 పరీక్షల్లో జరిగిన అక్రమాలను వివరించారు. ఉర్దూ మీడియంలో మెటీరియల్ అందుబాటులో లేనప్పటికీ ఆ మీడియంలో పరీక్షలు రాసిన వారిలో సింహభాగం అర్హులుగా ప్రకటించారని వాపోయారు. ఒకే సెంటర్ లో పరీక్ష రాసిన వారే ఎక్కువగా అర్హత సాధించడంపట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయంలో తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, అండగా నిలవాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ గ్రూప్ 1 పరీక్షల్లో అక్రమాలు జరిగిన విషయంపై జరుగుతున్న పోరాటంలో పూర్తిగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కష్టపడి చదువుకున్న అభ్యర్థులు మాత్రమే ఉద్యోగాలకు అర్హులని, అక్రమాలకు తావివ్వకుండా పరీక్షలు నిర్వహించాలన్నదే తమ అభిమతమని చెప్పారు. ఈ విషయంలో వాస్తవాలు నిగ్గు తేలి అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు న్యాయస్థానాల్లో పోరాడాలని సూచించారు. ఈ విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

# అంధ విద్యార్థుల గీతాలాపన

## భావోద్వేగంతో కంటతడి పెట్టిన రాష్ట్రపతి ముర్ము



**డెహ్రాడూన్, జూన్20 (జనంసాక్షి) :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వేదికపైనే భావోద్వేగానికి గురయ్యారు. కంట తడి పెట్టారు. రాష్ట్రపతి తన 67వ పుట్టినరోజు సందర్భంగా డెహ్రాడూన్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు అంధ విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ గీతాలు ఆలపించారు. ఈ క్రమంలోనే ద్రౌపది ముర్ము భావోద్వేగానికి లోనయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఉత్తరాఖండ్‌లో మూడు రోజుల పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి డెహ్రాడూన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విజువల్లీ హ్యాండీక్యాప్డ్ డిసేబిలిటీ (ఎన్ఐఈపీవీడీ)ని సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ, పిల్లలు ఎంతో అందంగా పాడుతుంటే భావోద్వేగానికి గురయ్యారని చెప్పారు. 'కన్నీళ్లు ఆగలేదు. పిల్లలు చాలా చక్కగా పాడారు. ఇది వారి హృదయం లోతుల్లోంచి వచ్చిన పాట' అని అన్నారు. పుట్టుకతోనే వైకల్యంతో పుట్టిన వారిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, వారిలో ఆత్మవిశ్వాసం నింపి ముందుకు తీసుకువెళ్లే ఒకనాటి నిశ్చయంగా వారు సక్సెస్ అవుతారని రాష్ట్రపతి అన్నారు. వైకల్యంతో ఉన్న పిల్లల సాధికారత, సమాన అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం పథకాల రూపకల్పన జరుగుతోందని చెప్పారు. వైకల్యంతో పుట్టిన పిల్లల సాధికారత కోసం పని చేస్తున్న ఎన్ఐఈపీవీడీని అభినందించారు. ఉత్తరాఖండ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్ సింగ్ (రిటైర్డ్), ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370